

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం



fb/prajasakti

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 236 | విజయవాడ, శుక్రవారం 25 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

శిల్పా చక్రపాణిరెడ్డిపై

దాడికి యత్నం

- టిడిపి నాయకుడు అభిరుచి మధు కత్తితో వీరంగం
- శిల్పాపై, ఆయన అనుచరులపై కేసులు
- నంద్యాలలో ఉద్రిక్తత



వేట కొడవలితో తిరుగుతున్న అభిరుచి మధు



మధు గన్‌మెన్‌గా భావిస్తున్న వ్యక్తి చేతిలో తుపాకి

ప్రజాశక్తి – నంద్యాలక్రైం

నంద్యాల పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్ వద్ద గురువారం వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డిపై టిడిపి నాయకుడు అభిరుచి మధు కత్తితో పట్టపగలే వందల మంది సమక్షంలో దాడికి యత్నించారు. ఉప ఎన్నికలు బుధవారం ముగియడంతో గురువారం జరిగిన ఈసంఘటన రాష్ట్రంలో సంచలనమైంది. అధికార పార్టీ ఓటమి భయంతో దాడులకు పురిగొల్పిందని వైసిపి నాయకులు అంటుండగా కావాలనే గొడవలు సృష్టిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఒక పక్క ఎన్నికలకోడ్ ముగియక ముందే అభిరుచి మధు అనే రౌడీషీటర్ ఆయుధాలతో బయట తిరుగుతున్నా పట్టించుకోని పోలీసుల వ్యవహారం చర్చనీయాశమైంది. బహిరంగంగా కత్తితో చంపేస్తానని బెదిరించిన అభిరుచి మధును వదిలిపెట్టి శిల్పాచక్రపాణిరెడ్డి, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేశారు.

ప్రత్యక్షసాక్షుల వివరాల ప్రకారం.. వైసిపి కార్యకర్త మాబాష చనిపోయిన విషయం తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు శిల్పా చక్రపాణిరెడ్డి వెళ్లారు. వైసిపి నాయకులు శిల్పా చక్రపాణిరెడ్డి తన అనుచరులు, కుటుంబసభ్యులతో మాబాష కుటుంబ సభ్యులను మిగతా 9లో



వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే

సుప్రీంకోర్టు కీలక తీర్పు

సందిగ్ధంలో ఆధార్ అనుసంధానం

న్యూఢిల్లీ : వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు తొమ్మిదిమంది న్యాయ మూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం గురువారం నాడు ఏకగ్రీవ తీర్పు ఇచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని తేల్చింది. ఈ విషయమై గతంలో ఇచ్చిన రెండు తీర్పులను కొట్టివేసింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఆధార్ అనుసంధానంపై సందిగ్ధత నెలకొంది. వివిధ సంక్షేమ పథకాలతో పాటు, బ్యాంకు ఖాతాలకు, పాన్ కార్డుకు ఆధార్‌ను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆధార్ అనుసంధానంతో మిగతా 9లో

సామాన్యుల హక్కులకు రక్ష

స్వాగతించదగ్గ తీర్పు ఇది. సామాన్యుల హక్కుల పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుంది. కార్పొరేట్లు ఆధిపత్యం కొనసాగుతున్న ప్రస్తుత అధునాతన సాంకేతిక యుగంలో సామాన్యులు తమ వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవడానికి, హక్కులను రక్షించుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు దోహదం చేస్తుంది.

– సిపిఎం పొలిట్‌బ్యూరో

మా అభిప్రాయాలకు దగ్గరగా..



సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వ అభిప్రాయానికి దగ్గరగా ఉంది. కొన్ని పరిమితులకు లోబడి గోప్యత అనేది ఎప్పుడూ ప్రాథమిక హక్కే అనేది మా ప్రభుత్వ విధానం.

– కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్

బిజెపి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

పౌరుల స్వేచ్ఛను హరిస్తూ నిఘా పెట్టి అణిచి వేయాలన్న బిజెపి ప్రభుత్వ భావజాలానికి ఈ తీర్పు గట్టి ఎదురుదెబ్బ. ఇది ప్రతి భారతీయుని విజయం.

– కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ



నేటి నుంచి అందుబాటులోకి

రూ.200 నోటు





న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా శుక్రవారం నుంచి రూ.200 నోట్లు చలామణిలోకి వస్తాయని ఆర్‌బిఐ గురువారం ప్రకటించింది. కొత్తగా నీలిరంగులో రూ.50 నోటును విడుదల చేసిన రెండు రోజుల తర్వాత రూ.200 నోటును విడుదల చేయడానికి ఆర్‌బిఐ సిద్ధమైంది. నవంబరు 8న పెద్ద నోట్ల రద్దు తర్వాత ప్రభుత్వం విడుదల చేస్తున్న నాలుగో నోటు ఇది. దేశంలో చిన్న నోట్ల చెలామణికి ఈ కొత్త నోటు ఉపకరిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. ఎక్కువ విలువ కలిగిన రూ.2000 నోటుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ, ఈ సమస్యకు ఈ కొత్తనోటు పరిష్కారం చూపుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఇవి కొత్త నోటు ప్రత్యేకతలు

- కొత్త రూ.200 నోటు 66 ఎం.ఎం–146 ఎం.ఎం ఉంటుంది.
- ఈ నోటులో అధిక భాగం పసుపురంగులో ఉంటుంది.
- సాంచి స్థూపం , ఆశోక చిహ్నం పక్కన భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాలు ఉంటాయి.
- నోటు మధ్యలో రంగుమారే సిరాతో గాంధీబొమ్మ ఉంటుంది.
- భారత్, ఆర్‌బిఐ అనే అక్షరాలు కనిపించే విధంగా మిగతా 9లో






ఐటిలో లక్ష ఉద్యోగాలు

- రూ.20 వేల కోట్ల ఐటి ఎగుమతుల లక్ష్యం
- కాపులుప్పాడలో సైబర్ సిటీ
- టెక్ హబ్‌లో 8 ఐటి కంపెనీలను ప్రారంభించిన మంత్రి లోకేష్




ఐటి కంపెనీలను ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

9







విస్తారంగా వర్షాలు

- పిడుగుపాటుకు నలుగురు మృతి
- పొంగిపొర్లుతున్న వాగులు
- గిరిజన గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- కడపలో పలు ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీరు
- మరో రెండు రోజులు భారీ వర్షాలు

2



ప్రజ్ఞ

1. పెద్దనోట్ల రద్దు తర్వాత ఆర్‌బిఐ అందుబాటులోకి తెస్తున్న మూడో పెద్దనోటు ఏది?
2. సివిల్స్ ఎంపికలో అభ్యర్థులకు ఎన్ని జోనల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు?
3. మాలెగావ్ పేలుళ్ల కేసులో బుధవారం విడుదలైన ప్రధాన నిందితుడు ఎవరు?
4. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న నేపాల్ ప్రధాని పేరు?
5. 2017 సంవత్సరానికి ఫోర్బ్స్ జాబితాలో అత్యధిక పారితోషకం తీసుకుంటున్న నటుడు ఎవరు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నీట్ ద్వారానే సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీ

వీటికి 371-డి వర్తించదు: హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఎన్టీఆర్ వైద్య, తెలంగాణలోని కాళోజీ విశ్వవిద్యాలయాల పరిధిలోని డిఎం, ఎంసిహెచ్ సూపర్‌స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీ జాతీయ కౌన్సెలింగ్ విధానం (నీట్) ద్వారానే చేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నీట్, ఆర్టికల్ 371డి విధానాలను సవాల్ చేసిన పలు వేరువేరు కేసుల్లో అడ్మిషన్లపై గతంలోనే స్టే ఉత్తర్వుల్ని హైకోర్టు రద్దు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి కింద తెలుగు రాష్ట్రాల్లోని ఆ పోస్టుల భర్తీ చేయరాదని ధర్మాసనం తేల్చి చెప్పింది. పిజి మెడికల్ కోర్సులకు, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు ఆ అధికరణం కింద భర్తీ చేయరాదని హైకోర్టు న్యాయమూర్తులు వి.రామసుబ్రమణియన్, టి.రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. అయితే 371డి, రాష్ట్రపతి ఉత్తర్వుల వర్తింపుపై తమ నిర్ణయాన్ని తుది తీర్పులో చెబుతామని బెంచ్ ప్రకటించింది.

ఎంబిబిఎస్, బిడిఎస్‌లో మిగిలిన సీట్లకు 26న నోటిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిగిలిన ఎంబిబిఎస్,బిడిఎస్ సీట్ల కోసం, ఎన్‌సిసి, స్పోర్ట్స్ కోటాలో సీట్ల భర్తీకి ఈనెల 26న నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్టీఆర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఎస్. అప్పలనాయుడు తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 1 గం నుంచి 2 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని ఎంబిబిఎస్, బిడిఎస్ సీట్లకు మేనేజ్‌మెంట్ కోటాలో తుది కౌన్సిలింగ్ గురువారంతో ముగిసింది. ఎంబిబిఎస్ మేనేజ్‌మెంట్ కోటా సి- కేటగిరిలో 10 సీట్లు, ఎన్నారై కోటాలో 119 సీట్లు మైనారిటీ కళాశాలల్లోనే మిగిలిలాయన్నారు. బిడిఎస్‌లో బి- కేటగిరీలో 120 సీట్లు, సి- కేటగిరీలో 160 సీట్లు మిగిలాయని చెప్పారు.

విద్యుత్తు చట్టం అమలు బాధ్యత కలెక్టర్లదే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్తు చట్టం నియమ నిబంధనల అమలు బాధ్యతల్ని కలెక్టర్లకు అప్పగించారు. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఎపిఈఆర్సీ సూచనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొలిక్కిరాని ఆర్టీసి చర్చలు

- అనేక అంశాలపై కుదరని సయోధ్య
- ఉద్యోగుల మార్పిడికి ఓకే
- ఆర్థిక వాటాల పంపకంలో ఏకాభిప్రాయం
- సెప్టెంబర్ 15న మరో సారి చర్చ


విజయవాడలో జరిగిన ఆర్‌టిసి బోర్డు సమావేశంలో ఎపిఎస్‌ఆర్టీసి ఎండి ఎంమాలకొండయ్య , టిఎస్ ఆర్టీసి బివి రమణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇరు రాష్ట్రాల ఆర్టీసిల మధ్య నెలకొన్న విబేధాలపై చర్యలు కొలిక్కి రాలేదు. రెండు రాష్ట్రాల ఆర్టీసి ఉన్నతాధికారులు, బోర్డు సభ్యులు విజయవాడ ఆర్టీసి హౌస్‌లో గురువారం భేటీ అయ్యారు. అన్ని అంశాలపై సయోధ్య కుదరకపోవడంతో సెప్టెంబర్ 15న మరో సారి సమావేశం కావాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల మార్పిడికి మాత్రం ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిరింది. 2015 జూన్ 1నాటికి ఉన్న ఖాళీల ఆధారంగా ఉద్యోగులు రాష్ట్రాలు మారేందుకు అంగీకరించారు. ఆర్థిక వాటాల పంపకం విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. రాష్ట్రాల విభజన తరువాత నుంచి 14 నెలల పాటు జరిగిన లావాదేవీలపై ఆడిట్ చేపట్టి 58:42 నిష్పత్తిలో ఎపి, తెలంగాణా ఆర్టీసిలు పంచుకోవాలన్న తీర్మానానికి రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు అంగీకారం తెలిపారు. తొమ్మిది, పది షెడ్యూళ్లలోని 14 ఉమ్మడి ఆస్తుల విషయంలో మాత్రం ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం రాలేదు. బస్‌భవన్‌తో పాటు హైదరాబాద్‌లో ఉన్న తార్నాక ఆసుపత్రి, అతిథి గృహం, కళ్యాణ మండపం తదితర వంటి ఆస్తులపై గతంలో ఉన్నట్లుగా తమకు హక్కు ఇవ్వాలని ఎపిఎస్ ఆర్టీసి ఉన్నతాధికారులు కోరగా కేంద్రం చేసిన సిఫార్సుల ప్రకారం అలా కుదరదని, కేవలం బస్‌భవన్‌పై మాత్రం హక్కు ఇస్తామని తెలంగాణ ఆర్టీసి ఉన్నతాధికారులు తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. హక్కులపై నివేదిక సమర్పించాలని, పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ ఉన్నతాధికారులు చెప్పడంతో ఏదో విధంగా అన్ని విషయాల్నీ తేల్చేయాలని కేంద్ర కమిటీ సభ్యులు సూచించినట్లు సమాచారం. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులైన ఎస్ఆర్టీయు ఇడి పి ఆనందరావు, సిఐఆర్టీయు డెరెక్టర్ రాజేంద్ర బి సమేర్ పాటిల్‌తో పాటు ఆర్టీసి ఎండిలు ఎం మాలకొండయ్య, బివి రమణ్‌రావు, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శులు సుమితా దావ్రా, సునీల్ శర్మ, జిహెచ్ఎంసి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు, ఇరు రాష్ట్రాల ఆర్టీసి ఇడిలు పాల్గొన్నారు.

ఐటి కాదు భూ లూటీ

- ఏళ్లుగా వేల ఎకరాల కేటాయింపులు
- ఒక్క అడుగూ వేయని ఐటి ప్రాజెక్టులు
- 2014లో విశాఖలో మంత్రి లోకేష్ స్నేహితుడి సంస్థకు రూ.వందల కోట్ల విలువైన 50 ఎకరాల భూ సంతర్పణ
- కొపులుప్పాడలో 1800 ఎకరాల వరకూ ఐటి పేర కేటాయింపు
- విశాఖ నగర నడిబొడ్డున ప్రభుత్వ భూమి కొట్టేసిన విప్రో, టెక్ మహేంద్ర ఉద్యోగ కల్పనలో చేతలెత్తేసిన వైనం



ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

విశాఖలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) ప్రగతి మూడడగులు ముందుకు ఆరడగులు వెనక్కి అన్న చందంగా మారింది. ప్రకటనలు జాస్తి.. కంపెనీలు, ఉద్యోగాలు నాస్తి... అంటే ఐటి పరిశ్రమకే వర్తిస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. విశాఖను ఐటి హబ్‌గా మార్చే బాధ్యత (గతంలో హైదరాబాద్ లాగ) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్టిమెంట్ రీజియన్ (ఐటిఐఆర్) పేర విశాఖకు రూ.60 వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని, 9 లక్షల ఐటి ఉద్యోయగాలు వస్తాయని 2014లో అధికారం చేపట్టిన నుంచీ చంద్రబాబు చెబుతున్న మాటలివి. గత మూడేళ్లలో సరైన ఐటి పెట్టుబడి ఒక్కటంటే ఒక్కటీ రాలేదు సరికదా! ఒక్క ఉద్యోగం కూడా అదనంగా ఐటి రంగంలో దక్కలేదు. ప్రకటనలన్నీ కాగితాలకే పరిమితమై ఐటి పరిశ్రమ విశాఖలో గొడ్డుపోయిన స్థితి ఏర్పడింది. భూ కేటాయింపులు మాత్రం గణనీయంగానే జరిగిపోయాయి. అందులో చంద్రబాబు తనయుడు ప్రస్తుత ఐటి మంత్రి లోకేష్ జోక్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం విశాఖలో టెక్ మహేంద్రలో జరిగిన కార్యక్రమంలో నారా లోకేష్ చేతుల మీదుగా 8 ఐటి కంఎనీలను ప్రారంభించడం ఒక విజ యంగా తెలుగుదేశం ప్రభుత్వం ప్రచారం ప్రారంభించింది.

ఐటి పేర భూ లూటీ

చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతల్లో ఉన్న 2000 సంవత్సరం నుంచీ విశాఖలో భూములు ఐటి పేర లూటీ అవుతూనే ఉన్నాయి. విప్రో, మహేంద్ర టెక్ విశాఖ నగరం నడిబొడ్డున ప్రభుత్వ టిబి హాస్పిటల్ భూములను బలవంతంగా లాక్కొని ఏర్పాటు చేశారు. ఈ సంస్థలకు చంద్రబాబు 2002లో అధికారంలో ఉన్నప్పుడు కేటాయించారు. మొత్తం 25 ఎకరాల భూమి ప్రస్తుత విలువ రూ.2 వేల కోట్లు. ఎకరా రూ.20 లక్షలకు అప్పట్లో ఇచ్చారు. విశాఖ నగరంలో సెంటు భూమి ధర రూ.5 లక్షల వరకూ పలుకుతోంది. విప్రో భవనాలను చాలా ఏళ్ల క్రితం విశాఖలో నిర్మించేశారు. పూర్తిస్థాయిలో పని నేటికీ ప్రారంభం కాలేదు. మహేంద్రా టెక్‌లో 150 కి మించి పనిచేయడం లేదు. ఎకరాకి 300 ఉద్యోగాలు ఇస్తామని విప్రో యాజమాన్యం ప్రకటించింది. ఈ లెక్కన 8 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వాలి. చంద్రబాబు తనయుడు లోకేష్ (నేటి ఐటి మంత్రి) స్నేహితుడి కంపెనీకి ఆనందపురం-గంభీరం ప్రాంతంలో కేటాయించారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి రాగానే లోకేష్ బినామీ ఈ భూమిని కొట్టేశాడు. అప్పటి కలెక్టర్ డాక్టర్ యువరాజ్ ఎకరానికి రూ.7.26 కోట్లు ధర నిర్ణయించగా కేవలం రూ.50 లక్షలకే సదరు భూమి ఈ-సెంట్రిక్ సొల్యూషన్స్‌కి కేటాయించారు. ఈ కేటాయింపు అడ్డగోలుగా జరిగిందన్నది నేటికీ ప్రజాసంఘాలు, మేధావులు, కొన్ని ఐటి సంస్థలు అభ్యంతరాలను తెలుపుతూనే ఉన్నాయి.

పెట్టుబడుల కోసం గ్లోబల్ ప్లేయర్లకు ఆహ్వానాలు

ప్రభుత్వం ఇప్పటికే వేల ఎకరాలను ఐటికి కేటాయింపులను చేసింది. పెట్టుబడుల కోసం తాజాగా ప్రభుత్వం భూములను ఎరవేసి గ్లోబల్ ఐటి ప్లేయర్లను ఆకర్షించే పని చేపట్టింది. ఇప్పటికే ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిన భూమి లెక్కా పత్రం లేకుండా కాలయాపన చేయడంపై ఐటి ఇన్వెస్టర్‌లు కొంతమంది విశాఖలో పెదవి విరుస్తున్నారు. పరిశ్రమలకు భూములు కేటాయింపు చేసినంత స్పీడుగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చలేకపోవడంతో జరిగిన కాలయాపన అనేక ఐటి పరిశ్రమలు ఇతర చోట్లకు తరలిపోతున్నాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఏపి ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి ఏజెన్సీ విజయవాడకు ఏడాది క్రితం వెళ్లిపోయింది... విశాఖకు రైల్వేజోన్, ఏపికి హోదా వంటి అంశాలు కూడా అంతర్గత కారణాలుగా ఉన్నాయి.. సిరిపురం జంక్షన్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నెలల క్రితం వుడా, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన రూ.44కోట్లతో ప్రారంభించిన ఐటి టవర్‌లో పని ప్రారంభం కాలేదు.

విశాఖ నగరమంతటా అడ్డగోలు కేటాయింపులే

నగరంలోని సిరిపురం జంక్షన్‌లో హెచ్‌ఎస్‌బిసికి 4 ఎకరాలు కేటాయించారు. 5 వేల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 2500 మందితోనే సరిపెట్టేశారు. రుషికొండ ఐటి హిల్-3లో విప్రోకి సుమారు 10 ఎకరాలకు పైగానే కేటాయింపులు చేశారు. నేటికీ నిర్మాణాలు జరగలేదు. సత్యం కంప్యూటర్స్‌కి కూడా రుషికొండ-తొట్ల కొండ మీద సుమారు 50 ఎకరాల వరకూ కేటాయించారు. 2007లో కేటాయించారు. నేటికీ నిర్మాణాలు జరగలేదు. రుషికొండ ఐటి హిల్స్ కొండలపై చంద్రబాబు అధికారంలో ఉండగా 40 కంపెనీలకు భూములు కేటాయించగా ఇంతవరకూ 10 కంపెనీలే నిర్మాణాలు ప్రారంభించాయి. మధురవాడ ఐటి సెజ్‌లో 400 ఎకరాలు భూమిని ఐటి కై కేటాయించారు. అప్పట్లో దీని విలువ సుమారు రూ.450 కోట్లు. ఐదారు కంపెనీలు తప్ప పని ఏ ఐటి సంస్థా ప్రారంభించలేదు. చాలావరకూ ఐటి వైర్లపైనా, టవర్లపైనా వాచ్‌మెన్‌లు, మెయిన్‌టెన్స్ పనివాళ్లు ఉతుక్కున్న బట్టలు ఆరేసుకుంటున్నారంటూ అక్కడ వారంతా తాజాగా వ్యాఖ్యానించుకోవడం చూస్తే ఐటి పరిశ్రమల స్థాపన ఎలా ఉందో అర్థమవుతోంది.

సిబ్బంది లేనందునే ఆదాయం కోల్పోతున్నాం..

సిఎస్‌కు స్పష్టం చేసిన అధికారులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ శాఖల్లో ఆదాయార్జనకు గల అవకాశాలను అధికారులు గుర్తించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ సూచించారు. అయితే తగినంత మంది సిబ్బంది లేకనే ఆదాయార్జన లక్ష్యాలను సాధించలేక పోతున్నామని ఆయా శాఖల అధికారులు సిఎస్‌కు వివరణ ఇచ్చారు. ఆయా శాఖ లపై గురువారం సిఎస్ సమీక్ష నిర్వహించారు. వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్, ఎక్సైజ్, ల్యాండ్ రెవెన్యూ, రవాణా, అటవీ తదితర శాఖలకు సంబంధించి నిర్దేశించుకున్న ఆదాయ లక్ష్యాలను ఏ మేరకు సాధించారనేది చర్చించారు.

సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల వివిధ శాఖల పరిధిలో పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోతున్నామని తెలిపారు. సిబ్బంది కొరత కారణంగా కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అధికారులు సిఎస్ దృష్టికి తీసుకొచ్చారు. జిఎస్టీ వల్ల రాష్ట్ర ఆదాయంపై భారీగానే ప్రభావం పడినట్లు గుర్తించారు. అయితే వచ్చే నెలలోగాని దీనిపై స్పష్టత రాదని అధికారులు చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు డి సాంబశివరావు (రెవన్యూ), అనంతరాము (అటవీ), ఎం రవిచంద్ర (ఆర్థిక), శ్యామలరావు (వాణిజ్య పన్నుల), వెంకట్రామిరెడ్డి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్), బాల సుబ్రమణ్యం (రవాణ), లక్ష్మీ నరసింహం (ఎక్సైజ్), బి శ్రీధర్ (గనులు), సారంగి (అటవీశాఖ) పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై ఆగ్రహం

రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా జరుగుతున్న మైనింగ్‌పై సిఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రానైట్, బైరటీస్, సున్నపురాయి విషయంలో చట్టవిరుద్ధంగా మైనింగ్ సాగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసుల సహకారంతో తక్షణం దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మూడో విడత రుణమాఫీకి రూ.3.6 వేల కోట్లు : సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మూడో విడత రుణమాఫీకి 10 శాతం వడ్డీతో కలిపి రూ.3,600 కోట్లను త్వరలో విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పంట రుణాల పంపిణీ కింద రూ.28,622 కోట్లు పంపిణీ చేశామన్నారు. 4.28 లక్షల కౌలు రైతులకు తొలి సారిగా బ్యాంకుల ద్వారా రూ.900 కోట్ల రుణాలిచ్చామన్నారు. వర్షాభావం వల్ల వేరుశనగ వేయని రైతులకు ప్రత్యామ్నాయంగా రూ.105 కోట్లు విలువ చేసే కంది, పెసర, సజ్జ, మినుము, కొర్ర విత్తనాలను ఉచితంగా అందజేస్తామన్నారు. రాష్ట్రంలో గతేడాది కంటే ఈ ఏడాది 30 శాతం అధికంగా పంట సాగు చేశారన్నారు. కర్నూలు మినహా అన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యిందని చెప్పారు.

జిపిఎస్ ట్రాకింగ్‌పై శ్రద్ధ పెట్టండి : సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిపిఎస్ ట్రాకింగ్‌పై శ్రద్ధ తీసుకోవాలని, దాంతో అక్రమ కార్యకలాపాల్ని, ఇతర సమస్యల్ని గుర్తించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రవాణా శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతమున్న సిసి కెమెరాలు, బ్రీత్ అనలైజర్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. రహదారి భద్రతా సంస్థ సమర్పించిన నివేదికపై రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సుమితా దావ్రాతో కలిసి గురువారం ఆయన సమీక్షించారు. రాష్ట్రంలో రహదారి భద్రతకు తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణకు రహదారులపై ముమ్మర తనిఖీలు చేపడుతున్నట్లు అధికారులు సిఎంకు వివరించారు. రాష్ట్రంలో ప్రమాదాలు 5.13 శాతం, మరణాలు 2.08 శాతం, గాయాలయ్యే వారి సంఖ్య 8.87 శాతం తగ్గినట్లు రవాణా శాఖ కమిషనర్ ఎన్ బాలసుబ్రమణ్యం వివరించారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో 15 శాతం మంది ప్రాణాల్ని కాపాడగలిగామన్నారు. రహదారి భద్రతపై ప్రతి ఆరు నెలలకోసారి వారోత్సవాల్ని నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ సహకారం అవసరమన్నారు.

సిఐడి అదుపులో 'అగ్రి' ఎకౌంటెంట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్రి గోల్డ్ బాధితుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం ఈ కేసులో పురోగతి గురించి సిఐడి అధికారులను వివరణ కోరినట్లు తెలుస్తోంది. అగ్రిగోల్డ్ బాధితుల వెల్ఫేర్ అసోసియేషన్ గత వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య యాత్ర చేపట్టిన విషయం విదితమే. దీంతో సిఐడి అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితుల విచారణలో దూకుడు పెంచారు. ఈనెల నాలుగో తేదీన అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన కీలక ఎకౌంటెంట్ సుందర్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతని నుంచి సంస్థకు చెందిన ముఖ్య సమాచారం రాబడుతున్నట్లు తెలుస్తోంది. సిఐడి విచారణలో పలు కీలక అంశాలకు చెందిన సమాచారాన్ని, కొత్త ఆస్తుల వివరాలనూ సుందర్‌కుమార్ అందజేసినట్లు సమాచారం. సుందర్‌కుమార్ వెల్లడించిన సమాచారం ఆధారంగా అధికారులు ఈ కేసు దర్యాప్తులో మరింత వేగం పెంచారు. ఇదిలావుండగా ఈ కేసులోని కొందరు నిందితులకూ బెదిరింపులు వస్తున్నట్లు సమాచారం. కౌంటెంట్‌నూ బెదిరించడంతో ఇదే విషయాన్ని ఎకౌంటెంట్ సుందర్‌కుమార్ పోలీసులకు తెలిపినట్లు సమాచారం. దీనితో బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీసులు దృష్టి సారించారు.

వక్ఫ్‌బోర్డు ఎన్నికకు హైకోర్టు పచ్చజెండా

ప్రజాశక్తి - హైదరాబాద్

ఎపి వక్ఫ్‌బోర్డ్‌కు ఈనెల 31న ఎన్నిక నిర్వహించవచ్చని, అయితే పాలక మండలిని ఏర్పాటు చేయరాదని హైకోర్టు న్యాయమూర్తి ఎ.రామలింగేశ్వరరావు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వక్ఫ్‌బోర్డు ఎన్నిక నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడినందున ఎన్నిక వరకు ప్రక్రియను పూర్తి చేయవచ్చని, అయితే తమ తీర్పు వెలువడే వరకు బోర్డు పాలక మండలిని ఏర్పాటు చేయరాదని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎంపి, ఎమ్మెల్యే, ముతవలి, బార్ కౌన్సిల్ సభ్యుడు ఇలా నాలుగు కేటగిరిల్లో వక్ఫ్‌బోర్డు ఎన్నిక నిర్వహించాల్సి వుండగా, ఎమ్మెల్యే, ముతవలి కేటగిరిలకు మాత్రమే ఎన్నికలకు 10న నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎన్నిక 31న ఎన్నిక జరగనుందని, వీటిని చట్ట ప్రకారం చేపట్టాలని ఆదేశాలివ్వాలని కోరుతూ గుంటూరుకు చెందిన మహ్మద్ ముస్తఫా షేక్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు.


డిజిపి సాంబశివరావుకు వినతి పత్రం ఇస్తున్న కెవిపిఎస్ నాయకులు అండ్ర, నటరాజ్

దళితునిపై దాడి చేసినవారిని తక్షణమే అరెస్ట్ చేయాలి

డిజిపికి కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప జిల్లా కాశీనాయన మండలం సాగిశెట్టిపల్లెలో దళితునిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిజిపి ఎన్ సాంబశివరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం విజయవాడలోని డిజిపి క్యాంప్ కార్యాలయంలో సాంబశివరావును కలిసి కెవిపిఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. అనంతరం అండ్ర మాల్యాద్రి మీడియాతో మాట్లాడుతూ గతనెల సెప్టెంబర్ 11వ తేదీన పొలానికి వెళ్తున్న ఎంబడి పోలయ్యపై అదే గ్రామానికి చెందిన బసవన్నపల్లె శ్రీనివాసులు తన అనుచరులతో కలిసి దాడి చేసి కులం పేరుతో దూషిస్తూ విచక్షణా రహితంగా చితకబాదారన్నారు.

గడ్డపారతో తలపై కొట్టడంతో తలపగిలి 11 కుట్లు పడ్డాయని వెల్లడించారు. కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు పోలీసులకు వాంగ్మూలం ఇవ్వగా, శ్రీనివాసులతో పాటు అతని అనుచరులపై కేసు నమోదు చేశారని తెలిపారు. కేసు నమోదై 40 రోజులు గడుస్తున్నా ఇంతవరకు నిందితుడిని అరెస్ట్ చేయలేదన్నారు. మైదుకూరు డిఎస్పీ శ్రీనివాస్‌తో పాటు కొందరు పోలీసులు ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. డిజిపి వెంటనే స్పందించి, జరిగిన ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేసి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కడప ఎస్పీని ఆదేశించారని కెవిపిఎస్ నాయకులు వివరించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని వారికి కొమ్ము కాస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బాధితునికి సకాలంలో న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. డిజిపిని కలిసిన వారిలో కెవిపిఎస్ నాయకులు జి నటరాజ్, కె ఉమామహేశ్వరరావు, క్రాంతి కుమార్ తదితరులున్నారు.

విస్తారంగా వర్షాలు


కడపలోని మహాత్మాగాంధీ కళాశాలలో బురదలో చిన్నారుల ఆటలు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. గురువారం పలుచోట్ల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు జలమయమయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. కడపలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై మోకాళ్లలోతు నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. విజయనగరంలో పిడుగుపాటుకు గురై నలుగురు మృతిచెందారు. తిరుమలలో వేకువజామున పడిన పిడుగుపాటుకు టిటిడి నూతనంగా నిర్మించిన రాజేంద్రప్రసాదము అతిథి భవనం బీటలు వారింది.

- **పశ్చిమ గోదావరి జిల్లా** జీలుగుమిల్లి మండలంలో భారీవర్షంతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అంకన్నగూడెం-రాచన్నగూడెం మధ్యలో ఉన్న పెదవాగు, రాచన్నగూడెం-కామయ్యపాలెం మధ్యలో ఉన్న అశ్వారావుపేట వాగు, కామయ్యపాలెం-జీలుగు మిల్లి మధ్యలో ఉన్న వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. ఆయా మార్గాల్లో సుమారు మూడు గంటలపాటు రాకపోకలు స్తంభించాయి. మరో రెండు రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే మొక్కజొన్న, ప్రత్తి పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- **విశాఖ మన్యంలో** నాలుగు రోజుల నుంచి వర్షాలు పడుతు న్నాయి. ఈ వర్షాలకు వ్యవసాయ రైతులు ఒకపక్క ఆనందం వ్యక్తం చేసినా మరోపక్క విచారం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లో నీరు చేరి దుక్కులు, నాట్లు వేసేందుకు వీలుగా ఉండటం లేదు. కొన్నిచోట్ల వరినాట్లు ముంపునకు గురయ్యాయి. వాగులు వంకలూ పొంగిపొర్లుతున్నాయి. రహదారులు జలమయ్యాయి. అరకులోయ, డుంబ్రిగుడు, అనంతగిరి మండలాల్లో పర్యాటకులతో పాటు స్థానికులు ఇబ్బంది పడ్డారు.
- **తూర్పుగోదావరి జిల్లాలోని** విఆర్.పురం, చింతూరు, కూనవరం మండలాల్లో రెండుగంటలపాటు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు పొంగాయి. పశ్చిమగోదావరి జిల్లాలో గత 24 గంటల్లో 7.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా ఆకివీడు మండలంలో 37.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.
- **తిరుమలలో** వేకువజామున రెండు గంటల ప్రాంతంలో పిడుగుపాటుకు రాజేంద్రప్రసాదము అతిథి భవనం బీటలు వారింది. భవనాన్ని నటుడు రాజేంద్రప్రసాద్ ఇటీవల నిర్మించి టిటిడికి అప్పగించారు. తిరుమల సమీపంలోని కపిలతీర్థం కొండపై రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి పై నుంచి నీరు జాలు వారింది.
- **కడపలో** కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన సెంటర్లు కోటిరెడ్డి సర్కిల్, ఆర్‌టిసి బస్టాండు వద్ద, ఆర్‌టిసి ఆర్ఎం కార్యాలయం, జిల్లా కోర్టు, గురుకుల్ విద్యాపీఠ్, సుబ్బిరెడ్డి కళాశాల, పాతబస్టాండు, పాత మార్కెట్, అప్సరా సర్కిల్ ప్రాంతాలలో మోకాటిలోతు నీళ్లు ప్రవహిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు, స్కూల్ పిల్లలు ఇబ్బందులు పడ్డారు.
- **కృష్ణాజిల్లాలోని** పశ్చిమ కృష్ణా, డెల్టా ప్రాంతాల్లో పత్తి, మిర్చి, ఎండుతున్న వరి పొలాలకు కొంత మేలు చేయనుందని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. విజయవాడలో మోస్తారు వర్షం కురిసింది. మధ్యాహ్నం కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయ్యాయి. వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద గల లోబ్రిడ్జి, పిఎన్ బస్టాండ్, సిద్ధార్థ పాలిక్లీనిక్ రోడ్డు, పటమట తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలబడింది.
- **గుంటూరు జిల్లాలో** వర్షం వల్ల వినాయకచవితి వేడుకలకు వివిధ రకాల సామగ్రి కొనుగోలుదార్లు, విక్రేతలు ఇబ్బంది పడ్డారు. చిరు వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దశల వారీగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసిన నేపథ్యంలో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డెల్టాలోని కొన్ని ప్రాంతాల్లో నారుమళ్లు నీట మునిగాయి. నాట్లు వేసిన ప్రాంతాల్లో కూడా భారీ వర్షంతో ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది.

విజయనగరంలో పిడుగుల వర్షం

నలుగురు మృతి


విజయనగరం జిల్లాలో పిడుగులతో కూడిన వర్షంతో వేర్వేరు చోట్ల నలుగురు మృతి చెందారు. గజపతినగరం, గంట్యాడ, ఎస్.కోట, దత్తిరాజేరు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఎస్.కోట మండలం చుక్కవాని పాలెంలో డి.విశ్వనాథం(55), దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో పాచిపెంట అన్నపూర్ణ(51), లక్కవరపుకోట మండలం ఖాసాపేటలో కోళ్ల రామునాయుడు(65), కొటాన అప్పలనాయుడు(45), పొలాల్లో పనిచేస్తుండగా పిడుగులు పడడంతో మృతి చెందారు.


తూర్పుగోదావరి జిల్లా విఆర్ పురంలో పొంగుతున్న వాగు


పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న రాచన్నగూడెం వాగు

మరో రెండ్రోజులు భారీ వర్షాలు

కోస్తా, రాయలసీమల్లో మరో రెండు మూడు రోజులు పలు చోట్ల వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణశాఖ పేర్కొంది. కోస్తాంధ్ర, రాయలసీమలోని కడపలో అక్కడక్కడా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించింది. శుక్ర, శని, సోమవారాల్లో భారీ వర్షాలు నమోదవుతాయని వివరించింది. ఆదివారం కోస్తాలో ఓ మోస్తరు వానలు మాత్రమే ఉంటాయని తెలిపింది. ఉత్తర ఒడిశా మీదుగా ఈశాన్య బంగాళాఖాతం వరకు 1.5 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు వివరించింది. రాయలసీమలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నట్లు పేర్కొంది. మరోవైపు ఒడిశా నుంచి కోస్తాంధ్ర మీదుగా రాయలసీమ వరకు ఒక ద్రోణి, ఒడిశా నుంచి కోస్తాంధ్ర మీదుగా దక్షిణ తమిళనాడు వరకు మరో ద్రోణి కొనసాగుతున్నట్లు తెలిపింది.



శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు

భారత ఉపరాష్ట్రపతి

శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు

తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి
విచ్చేస్తున్న సందర్భంగా

హార్దిక స్వాగతం

పౌర సన్మానం

మరియు

ప్రధానమంత్రి పట్టణ గృహ నిర్మాణ పథకం క్రింద 2లక్షల 25వేల గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

26 ఆగస్టు, 2017, ఉదయం 11.00 గం॥లకు, స్థలం: సచివాలయం, వెలగపూడి, అమరావతి.

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ప్రజాశక్తి
www.prajasakti.com

సంపాదకీయం

గోప్యత హక్కుకు రక్షణ

పౌరుల వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనంటూ దేశ సర్వోన్నత న్యాయస్థానం గురువారం వెలువరించిన తీర్పు హర్షణీయం. కేవలం ఆధార్‌కార్డును అడ్డం పెట్టుకొని ప్రజలకు ఇస్తున్న అరకొర సబ్సిడీలకు కోత పెట్టేందుకు వెంపర్లాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పథకాలన్నింటికీ ఆధార్‌ను అనుసంధానిస్తున్న తరుణంలో పౌరుల వ్యక్తిగత హక్కు ఉల్లంఘన జరుగుతోందంటూ 2015లో సుప్రీంకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వాటిపై విచారణ చేపట్టిన ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అవునా కాదా అనే అంశంపై చర్చించింది. ఈ విషయంపై తొమ్మిది మందితో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఈ ఏడాది జులై 18న ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో వ్యక్తిగత గోప్యత ఉందో లేదో నిర్ధారించాలని, అది తేలాకనే ఆధార్‌పై దాఖలైన పిటిషన్లపై విచారిస్తానని పేర్కొంది. మూడు వారాల్లో ఆరు రోజులు వాదనలు విన్న ధర్మాసనం ఆగస్టు 2న తీర్పును రిజర్వ్ చేసి గురువారం తన నిర్ణయాన్ని వెల్లడించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో పౌరుల జీవించే హక్కును నిర్వచించిందని, దాని ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛ ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జన బాహుళ్యంలో వ్యక్తిగత గోప్యత వివరాలు దుర్వినియోగమయ్యే అవకాశాలున్నాయంది. వ్యక్తిగత గోప్యతపై సుప్రీంకోర్టులో చర్చకు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలో 1954, 1963లో రెండు వేర్వేరు కేసుల్లో వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు కిందకు రాదని రెండు ధర్మాసనాలు తీర్పులు చెప్పాయి. 1970, 1980లలో ఈ అంశంపై విచారించిన బెంచ్‌లు ఆ రెండు తీర్పులకు విభిన్నంగా స్పందించినా అవి చిన్న బెంచ్‌లు కావడంతో పాత రెండు తీర్పులే అమలయ్యాయి. ప్రస్తుతం ఆధార్‌పై దాఖలైన పిటిషన్ల సందర్భంగా మరోసారి వ్యక్తిగత గోప్యత చర్చనీయాంశమైంది. తుదకు వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనంటూ స్పష్టీకరించిన రాజ్యాంగ విస్తృత ధర్మాసనం గతంలో ఇచ్చిన రెండు తీర్పులను కొట్టేసి సంశయాలు, గందరగోళాలకు తెరదించడం ఆహ్వానించదగింది.

ఎలాంటి చట్టబద్ధతా లేకుండానే 2009 జనవరిలో యుపిఎ-1 సర్కారు ప్రజలకు 12 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు బయోమెట్రిక్ ఐడి సిస్టంను ప్రవేశపెట్టింది. అందుకోసం కాంగ్రెస్ నేత నందన్ నిలేకనీ సారథ్యంలో యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) సంస్థను నెలకొల్పింది. మన్మోహన్ సర్కారు ఆధార్ కేవలం గుర్తింపు కోసమేనని నమ్మబలికింది. యుపిఎ-2 హయాంలో 2012లో కొన్ని ప్రభుత్వ పథకాలకు నగదు బదిలీ అనడంతో ఆధార్ అసలు లక్ష్యం రాయితీలకు కోతలు పెట్టడమని జనానికి బోధ పడింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి ఆధార్‌ను, నగదు బదిలీని తీవ్రంగా తప్పుబట్టింది. నాటి బిజెపి పక్ష నేత ఎల్‌కె అద్వానీ సహా ఆ పార్టీ నాయకులు ఆధార్ వద్దేవద్దని ఉపన్యాసాలు దంచారు. తదుపరి అధికారంలోకొచ్చిన బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ కంటే వాయువేగంతో ఆధార్ అనుసంధానం కావిస్తోంది. ప్రభుత్వ పథకాల్లో అవకతవలను అరికట్టేందుకంటూ ఆహారభద్రత, ఆదాయపన్ను, బ్యాంక్ ఖాతా, పాన్, ఎల్‌పిజి, రైల్వే రాయితీలు, రైతు రుణాలు, ఇపిఎఫ్‌ఒ ఇలా ప్రతిదానికీ ఆధార్‌ను తప్పనిసరి చేసింది. అంతేనా, ఆధార్‌ను ప్రభుత్వ పథకాలకు, సర్వీసులకు తప్పనిసరి చేస్తూ 2016లో లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టగా అక్కడ ఎన్‌డిఎకు మెజార్టీ ఉండటంతో ఆమోదింపజేసుకుంది. రాజ్యసభలో సిపిఎం నేత సీతారాం ఏచూరి, ఇంకా మరికొంత మంది వ్యక్తిగత సమాచారం అందరికీ అందుబాటులో ఉండటంపై ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా కొన్ని కీలక సవరణలు ప్రతిపాదించారు. లోక్‌సభ వాటిని నిర్ద్వందంగా తోసిపుచ్చింది.

సాంకేతికత బాగా అభివృద్ధి చెందిన ఈ కాలంలో ఆధార్ ఆధారంగా వ్యక్తుల సమాచారం బహుళజాతి కంపెనీలకు చేరి దాన్ని దుర్వినియోగం చేసే అవకాశాలు రానురాను ఎక్కువవుతున్నాయి. విద్రోహులకు సాంకేతిక పరిజ్ఞానం యధేచ్ఛగా అందుబాటులోకొస్తున్న ఈ రోజుల్లో వ్యక్తిగత సమాచారం బహిర్గతపర్చడం ప్రమాదకరం. ప్రపంచవ్యాప్తంగా హ్యాకర్లు ఏ విధంగా సమాచార వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నారో అనుభవమే. కార్గిల్ యుద్ధం సమయంలో వాజపేయి సర్కారు దేశంలో పౌరులందరికీ గుర్తింపుకార్డులిస్తామంది. సరిహద్దు రాష్ట్రాల్లో చొరబాట్లను అరికట్టేందుకు ఆ పని చేస్తామనగా ఆ చర్య అత్యంత వివాదాస్పదమైంది. ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం కావడంతో వాజపేయి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. మోడీ సర్కారు ఇప్పుడు ఆధార్‌ను తలకెత్తుకుంది. ప్రస్తుతం సుప్రీం కోర్టు వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా పేర్కొంటూ చారిత్రాత్మక తీర్పు చెప్పింది. తదుపరి ఆధార్ అనుసంధానంపై దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టనుంది. విచారణలోనూ సుప్రీంకోర్టు నుంచి జనబాహుళ్యానికి మేలు కలిగించే, ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించే తీర్పు ఇస్తుందని ఆశిద్దాం.

మహనీయుల మాట



వినయం, శీలం లేని విద్యావంతుడు మృగం కంటే ప్రమాదకరం.

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

వీధుల్లో భక్తి ప్రదర్శనలా!

ప్రజాగళం

పూర్వం దేవాలయాలను కొండలపై నిర్మించేవారు. కాలక్రమేణా భూ స్వాములు, గ్రామ పెద్దలు స్థలాలు సేకరించిగాని, స్వంత భూములు ఇచ్చిగాని గ్రామ కూడళ్ళల్లో వీటిని నిర్మించారు. ఇప్పుడేమో వీధికో గుడి వెలిసింది. ఆలయాలు వ్యాపార కేంద్రాలయ్యాయి. రాజకీయ రంగు పులుముకొన్నాయి. గడిచిన 25 ఏళ్ళల్లో ముంబాయి, హైదరాబాదు వంటి పట్టణాల్లోనే వినాయక చవితి, దసరా, శ్రీరామనవమి ఉత్సవాలు జరిగేవి. కానీ ఇప్పుడు ఎక్కడపడితే అక్కడ పందిళ్ళు వేసి, రోజుల తరబడి ఉత్సవాలు చేస్తున్నారు. ఆ పేరుతో చందాల దందాలు పెరిగిపోయాయి. రానురాను సంస్కృతి, సాంప్రదాయాలను దిగజారుస్తూ, విష సంస్కృతిగా మారుస్తున్నారు. ఇక ఉత్సవాల ఆఖరు రోజున చెప్పనవసరం లేదు. ఎవరిష్టం వచ్చినట్టు వారు రహదారులపైనే భోజనాలు, కిలోమీటర్ల కొద్దీ ఊరేగింపులు, మధ్యమధ్యలో



బాణాసంచా కాల్చడాలు ఇలా ఒకటేమిటి ఎన్నో చూస్తాం. ఒక పక్క ట్రాఫిక్‌జామ్‌తో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మరో పక్క పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది. పేదవాడు ఆకలితో అలమటిస్తున్నా పట్టించుకోని ఈ మహానుభావులు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి మరీ వీటిని నిర్వహించడంలో ఆంతర్యమేమిటి?

మోతుకూరి అరుణ కుమార్, విజయవాడ.

అక్షర చిరుజల్లు


నా తెలుగు
పుడమి పూదోటలో పూసిన
అక్షర కుసుమం
ఉగ్గుపాల నుండి గోరు ముద్దల దాకా
అమ్మ పాడిన పాట
మదిని మంత్రించు మదన గీతం
అనపు తెరలు చీల్చుతూ
వెలుగును నింపిన ఉషోదయం
పదాలు తెలియని పెదాలకు
అమ్మ అని నేర్పింది
మకరంద మాధుర్యపు సాహిత్య సంపద
సుశ్యామల మధురపు పలుకులు
అక్షర వనంలో సాహిత్య సవ్వడి
సంగీత స్వర మధురిమల వెలుగు
సాహిత్య కెరటాల చిరుగాలుల చల్లదనం
పరాయి భాషల వేడిల మధ్య
వెన్నెల హాయిదనం
అమ్మ మాటలు నేర్పితే
నా తెలుగు సంస్కారం నేర్పింది



నవీన్ అచ్యుత

మొక్కలు నాటు.. నరకకు...

రోడ్ల విస్తరణ పేరుతో సర్కారు వారు ఎన్నో చెట్లను నరికివేస్తున్నారు. ప్రభుత్వంతో పాటుగా ఈ రాష్ట్రంలోని ప్రజలంతా అభివృద్ధిని కోరుకునేవారే. కానీ ప్రభుత్వం ఒక వైపు చెట్లు నాటేందుకు కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చుపెడుతూనే మరో వైపు వందల ఏళ్ళ చరిత్ర గల మహా వృక్షాలను కూల్చివేస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి గారు కూడా కూల్చిన చెట్లను వేరే చోట నాటేందుకు ఏర్పాట్లు చేయమని సూచన చేశారు. కానీ మరుసటి రోజే విజయవాడ బందరు రోడ్డులో అనేక చెట్లు నేలకొరిగాయి. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీరు-చెట్టు కార్యక్రమంలో నాటిన వేలాది మొక్కల్లో 10 శాతం కూడా బతకలేదు. జనం కోసం ఏదో ఒక ప్రకటన ఇవ్వడం కాకుండా చిత్తశుద్ధితో దాన్ని అమలు చేయాలి. పర్యావరణ పరిరక్షణ గురుతర బాధ్యత ముమ్మాటికీ ప్రభుత్వాలదే. పర్యావరణాన్ని కాపాడేందుకు కృషిచేయక ప్రాణవాయువును ఉన్నంత వరకు మనమే పీల్చేస్తే భవిష్యత్తు తరాల మనుగడే ప్రశ్నార్థకమౌతుంది. మానవాళి ఉనికికే ప్రమాదం కలిగే ఈ చెట్ల నరికివేతను నేటి యువత ఉద్యమ స్ఫూర్తితో అడ్డుకోవాలి.



-జోస్యుల వేణుగోపాల్

'మరుగు'బాధ్యత మీదే

'వీధులన్నీ శుభ్రంగా ఉండాలి, ప్రతి ఊరూ సుందరంగా మారాలి, బహిరంగ మల మూత్ర విసర్జనకు వెళ్ళకూడదు'. అదే కదా స్వచ్ఛభారత్ నినాదం. ఈ స్వచ్ఛభారత్ ప్రజలకు మేలు చేకూర్చేదే. కానీ మన భారత దేశం ఎంత వరకు స్వచ్ఛంగా వుంది? గ్రామాల్లో కానీ, పట్టణాల్లో కానీ ఎన్ని మరుగుదొడ్లున్నాయి? గ్రామాల్లో ఉండే ప్రజలకు వీటి పట్ల అవగాహన ఎంత? ఒక వేళ ఉన్నా వారు బయటకు వెళ్లడానికే ఇష్టపడతారు. వారికి మరుగుదొడ్లు ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను చెప్పి చైతన్యపరచాలి. అంతేకాక పల్లెటూళ్ళ నుండి అనేక మంది వివిధ పనుల మీద ముఖ్యంగా బ్యాంకు పనులకు ప్రతి రోజూ పట్టణాలకు వస్తూ ఉంటారు. వచ్చిన ప్రతిసారీ ఎంతో కొంత సమయం అక్కడే ఉండాల్సి వస్తుంది. ఇక ఆ వ్యక్తి కనీస అవసరాలైన మరుగుదొడ్లకు ఎక్కడకు వెళతాడు? సౌకర్యాలు లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ బహిరంగ ప్రదేశాల్లోనే మల,మూత్ర విసర్జనలు చేస్తారు. పురుషులైతే సరే, మరి మహిళ పరిస్థితి ఏంటి? ప్రభుత్వరంగ బ్యాంకులైనా, ప్రభుత్వేతర బ్యాంకులైనా సర్వీస్ చార్జీలు వసూలు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ, తమ ఖాతాదారులకు కనీస సౌకర్యాలు చూపించడంలో పెట్టడం లేదు. ఇది కనబడటానికి చిన్న విషయంగా వున్నా, ఇదే కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించి బ్యాంకులన్నింటినీ సమాయత్తపరిచి ఈ విషయంపై చైతన్యం కలిగించాలి. పట్టణంలో ఉండే అన్నీ బ్యాంకులూ కలసి కనీసం కొన్ని మరుగుదొడ్లయినా నిర్మించాలి. అంతేకాక పట్టణాలకు, గ్రామాలకు మధ్యలో కొన్ని, జాతీయ రహదారుల పక్కన, రాష్ట్ర రహదారుల పక్కన కొన్ని మరుగుదొడ్లు ప్రభుత్వాలే నిర్మించాలి.



శ్రీనివాస్ కట్టా, నరసరావుపేట

నిండుకున్న కృష్ణా జలాలు: తిలా పాపం తలా కొంచెం!



వి శంకరయ్య

విశ్లేషణ

'ఆలస్యం అమృతం విషం' అనే నానుడిని నదీ జలాల వివాదాంశ విధానంలో ఏపి ప్రభుత్వం అక్షరాలా అమలు చేస్తోంది. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును పునఃపరిశీలన చేయించుకోవడంలో, తను ఇటీవల వరకు చెబుతూ వచ్చిన నీటి ఎద్దడి రోజుల్లో దామాషా పద్ధతిపై కృష్ణా జలాల పంపకం అంశాన్ని ట్రిబ్యునల్ విచారణ పరిధిలోకి తీసుకు రావడంలో ఏపి ముఖ్యమంత్రి వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది.

ఈ యేడు వర్షాభావం ఏర్పడింది. అయితే కృష్ణకు వచ్చిన వరదను మహారాష్ట్ర, కర్నాటక ప్రభుత్వాలు చక్కగా రిజర్వాయర్లలో నింపుకొన్నాయి. అదే సమయంలో పంట కాలువలకు నీళ్ళు వదిలిపెట్టాయి. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలకు దిక్కు లేకుండా పోయింది. మన రాష్ట్రంలో ఇదే పరిస్థితి మరో మాసం రోజులు కొనసాగితే జల వనరుల అత్యవసర పరిస్థితి ప్రకటించ వలసి వస్తుంది. ఇస్రోతో పాటు వాతావరణ శాఖ ప్రకటిస్తున్న అంచనాలు ఈ యేడు తలకిందులవుతున్నాయి. ముందుందు పరిస్థితి ఎలా వుంటుందో తెలియదు కానీ అత్యవసరంగా చేపట్టాల్సిన చర్యలు పక్కనబెట్టి ఈ నెలాఖరుతో జల వనరుల వద్ద 'జల సిరి హారతి' కార్యక్రమాన్ని అమలు జరపాలని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇంతవరకు కృష్ణా, గోదావరి నదులకు వరద వచ్చిన సమయంలో జల హారతి సాగించేవారు. ఈ నెలాఖరులో రాష్ట్రం లోని అన్ని గుంటలు, చెరువుల్లో నీరు లేకున్నా జలసిరి హారతి కింద కొన్ని కోట్లు ఖర్చు పెట్టనున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకం. నీళ్ల లేకున్నా పథకాన్ని ప్రారంభించి ఉత్తుత్తి ఎత్తిపోతల పథకంగా మార్చారు ముఖ్యమంత్రి. ఆ మధ్య వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు దామాషా పద్ధతిపై నదీ జలాల పంపకం జరగాలని పెద్ద ఎత్తున ఊదరకొట్టారు. ఇటీవల కాలంలో ఈ వాదన విన్పించలేదుగానీ ప్రస్తుతం నీటి ఎద్దడి ఏర్పడగానే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని, ఎగువ రాష్ట్రాల నుండి నీటిని విడుదల చేయించాలని కోరనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. దాహమేసినప్పుడు బావి తవ్విన చందంగా వుంది ప్రభుత్వ విధానం. ఎగువ రాష్ట్రాలు దయదలిస్తే నీరు కిందకు వస్తుంది. ప్రస్తుతం బచావత్ ట్రిబ్యునల్ అవార్డు అమలులో వుంది. అయితే గత కొన్నేళ్ళుగా ఎగువ రాష్ట్రాలలో కేంద్ర జలసంఘం అనుమతి లేకుండా మధ్య తరహా ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నా, ఇవి బచావత్ అవార్డుకు విరుద్ధంగా వున్నా ఉమ్మడి రాష్ట్రంలోనూ, ఈ మూడున్నరేళ్ళ కాలంలోనూ పట్టించుకున్న దాఖలా లేదు. లేని నీళ్ళ కోసం రెండు తెలుగు రాష్ట్రాలు పోట్లాడుకోవడంతో సరిపెట్టాయి. ఎగువ రాష్ట్రాల్లో జరుగుతున్న జల దోపిడి గురించి గళమెత్తిన పాపాన పోలేదు. ఈ రోజు నీటి ఎద్దడి ఏర్పడింది కాబట్టి రెండు తెలుగు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు కలవర పడుతున్నాయి. ప్రజల్ని సంతృప్తి పరిచేందుకు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో వచ్చిన నీటిని అప్పటికప్పుడు వాడుకోవడంతో ఏ జలాశయమూ నిండటం లేదు. కింద శ్రీశైలం జలాశయానికి చుక్క నీరు రావడం లేదు. ఈ యేడు ఇప్పటి వరకు 4.5 టిఎంసీల జలాలు శ్రీశైలానికి వచ్చినట్లు చెబుతున్నారు. గతంలో జరిగిన ఈ తప్పిదాలకు... రాష్ట్ర ప్రజలకు జరిగిన అన్యాయానికి ... కాంగ్రెస్‌తో పాటు తెలుగుదేశం పార్టీ కూడా జవాబు చెప్పాల్సి వుంది.



> **ఈ రోజు నీటి ఎద్దడి ఏర్పడింది కాబట్టి రెండు తెలుగు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు కలవర పడుతున్నాయి. ప్రజల్ని సంతృప్తి పరిచేందుకు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో వచ్చిన నీటిని అప్పటికప్పుడు వాడుకోవడంతో ఏ జలాశయమూ నిండటం లేదు. గతంలో జరిగిన ఈ తప్పిదాలకు... రాష్ట్ర ప్రజలకు జరిగిన అన్యాయానికి ... కాంగ్రెస్‌తో పాటు తెలుగుదేశం పార్టీ కూడా జవాబు చెప్పాల్సి వుంది.**


1976 ఏప్రిల్ 14వ తేదీన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సమక్షంలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య చెన్నయ్‌కు 15 టిఎంసీల తాగు నీరు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. తదుపరి 1977 డిసెంబరులో మూడు రాష్ట్రాల ప్రతినిధుల మధ్య జరిగిన ఒప్పందంలో వర్షాభావం ఏర్పడిన సందర్భంలో ఎగువ రాష్ట్రాలు ఒక్కొక్కటి 5 టిఎంసీల చొప్పున శ్రీశైలం జలాశయానికి నీరు విడుదల చేయాల్సి వుంది. ఈ మూడేళ్ళ కాలంలోగానీ, అంత క్రితం గానీ నీటి ఎద్దడి ఏర్పడిన ఏ సందర్భంలోనూ నికర జలాలు రాకున్నా ఎగువ రాష్ట్రాలు విడుదల చేయాల్సిన 10 టిఎంసీల నీరు కూడా కిందకు వదలమని కోరిన సందర్భం లేదు. ఇదిలా వుండగా భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని 'బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు'లోనైనా తగు న్యాయం సాధించాలని న్యాయ పరంగానే కాకుండా రాజకీయంగా కూడా అవసరమైన చర్యలను ఎపి ప్రభుత్వం చేపట్టలేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ 2010లో తాత్కాలిక అవార్డు, 2013లో తుది అవార్డు వెలువరించింది. దిగువ రాష్ట్రానికి మిగులు జలాలు కూడా లేకుండా పంపకం చేసి ఆల్మట్టి గేట్లు పెంచుకునేందుకు అనుమతించి వంద టిఎంసీల జలాలు కేటాయించింది. ఈ అవార్డును కేంద్రం నోటిపై చేయకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకెక్కి స్టే తెచ్చింది. తదుపరి ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం కూడా భాగస్వామి అయింది. ఈ సందర్భంలో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ పరిధి నాలుగు రాష్ట్రాల మధ్యనా లేక రెండు తెలుగు రాష్ట్రాల మధ్యనా? తెలియజేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. కేంద్రం నాలుగు నెలలు సాగదీసింది. ఈ సందర్భంలో ఎన్‌డిఎలో భాగస్వామిగా వున్న ఎపి ముఖ్యమంత్రి ఏం చేయాలి? కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాల్సింది. 'విచారణ పరిధి నాలుగు రాష్ట్రాల మధ్యనే వుండాలి. నీటి ఎద్దడి ఏర్పడిన రోజుల్లో దామాషా పద్ధతిపై నదీ జలాల పంపకం వుండాలి' లాంటి అంశాలు కూడా ట్రిబ్యునల్ విచారణ పరిధిలో వుండేలా కేంద్రం నుండి సుప్రీంకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేయించి వుంటే పరిస్థితి వేరుగా వుండేది. కానీ ముఖ్యమంత్రి నుండి ఆ స్పందన కన్పించలేదు. తుదకు కేంద్రం మహారాష్ట్ర, కర్ణాటక లాబీలకు లొంగిపోయి రెండు రాష్ట్రాల మధ్యనే విచారణ జరగాలని అఫిడవిట్ దాఖలు చేయడంలో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కూడా తన విచారణను రెండు తెలుగు రాష్ట్రాల మధ్యనే చేపట్టింది. ఇక్కడొక అంశం గుర్తించాలి. 2013లో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వెలువరించిన తీర్పును నోటిపై చేయకుండా సుప్రీంకోర్టు స్టే అయితే ఇచ్చింది కానీ ఈ వివాదాన్ని ట్రిబ్యునల్ వద్దనే తేల్చుకోవాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ వెసులుబాటును ఉపయోగించుకొని ఒక వైపు న్యాయ పరంగానూ, మరోవైపు రాజకీయంగానూ కేంద్రం వద్ద ఒత్తిడి తీసుకువచ్చి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పు పునఃపరిశీలన చేయించుకొనే విధంగా ఆ రోజుల్లో వ్యవహరించివుంటే పరిస్థితి మరోలా వుండేది. ఈ రోజు నీటి ఎద్దడి ఏర్పడినా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి ఉపశమనం పొందే అవకాశం వుండేది. ఈ అంశంపై పుణ్యకాలం గడిచిపోయిన తర్వాత ప్రస్తుతం సుప్రీంకోర్టుకెక్కాలని ఏపి ప్రభుత్వం వృధా ప్రయాసపడుతోంది. కేంద్ర నదీజలాల వివాద చట్టం ప్రకారం నదీజలాల వివాదానికి చెందిన ఏ అంశమైనా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించే అంశాల ఆధారంగా అది నియమించే ట్రిబ్యునల్స్ విచారణ చేసి తీర్పులు చెప్పాల్సి వుంది. ఒక దఫా ఈ తీర్పులు నోటిపై జరిగిన తర్వాత సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకునే అవకాశం లేదు. ఇలాంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం గానీ, సుప్రీంకోర్టు గానీ నేరుగా ఆదేశాలు జారీ చేసిన సందర్భం లేదు. ట్రిబ్యునల్ తీర్పులు అమలు కానప్పుడు మాత్రమే సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ఆయా రాష్ట్రాలకు ఆదేశాలిచ్చిన సందర్భాలున్నాయి. ఒకవేళ ఏపి ప్రభుత్వం సుప్రీంకోర్టుకెక్కినా తిరిగి కేంద్ర ప్రభుత్వం వైఖరిని అడగక తప్పదు. తిరిగి సమస్య కేంద్రం దగ్గరకే వస్తుంది. అలా కాకుండా రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లో ఈ అంశంపై కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరిన సందర్భంలో ఏపి ముఖ్యమంత్రి చురుకుగా వ్యవహరించి... నాలుగు రాష్ట్రాల మధ్య విచారణ పరిధిగా నీటి ఎద్దడి రోజుల్లో దామాషా పద్ధతిపై నీటి పంపకం విచారణాంశంగా కోరి అందుకనుగుణంగా ఆదేశాలు పొంది వుండవలసింది. ప్రస్తుతం ఆ పుణ్యకాలం పోయింది. ట్రిబ్యునల్ తీర్పులను ఎగువ రాష్ట్రాలు అమలు చేయకపోతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకొనేది.

ఇటీవల వరకు గోదావరి పెన్నా అనుసంధానం గురించి ముఖ్యమంత్రి మాట్లాడేవారు కాదు. ప్రస్తుతం కృష్ణానదిలో నీళ్ళు లేవు. పట్టిసీమ జలాలు డెల్టాకు కూడా సరిపోవడం లేదు. ఫలితంగా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు నీటికి కటకటలాడి పోతున్నాయి. ఈ జిల్లాల ప్రజల్లో చోటుచేసు కుంటున్న అసంతృప్తిని నివారించేందుకు... రూ.80 వేల కోట్లు వ్యయంగాగల ఒక పథకం, రూ.20 వేల కోట్లు వ్యయంగాగల మరొక పథకం గోదావరి పెన్న అనుసంధానం గురించి పదే పదే ప్రస్తావిస్తున్నారు. రాజకీయ అవసరార్థం నదీ జలాలను ప్రాజెక్టులను ఉపయోగించు కోవడంతోనే రాష్ట్రానికి ఈ దుస్థితి దాపురించింది. ప్రస్తుతం కేంద్రం కలగజేసుకుంటే ఎగువ రాష్ట్రాలు దయతలచి నీళ్ళు వదిలితే తప్ప మరో మార్గం లేదు. అదే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ పరిధిలో 'దామాషా పద్ధతిపై నీటి పంపకం' విచారణాంశంగా వుంటే ఇంతగా దేబిరించాల్సిన పరిస్థితి లేదు.

(రచయిత విశ్రాంతపాత్రికేయుడు),9848394013.

పురాణాలూ మానవ పరిణామ క్రమంలో భాగమే!

డాక్టర్ దేవరాజు మహారాజు



సమీక్ష

దేవుళ్ళకు ఏ కాలంలో రూపకల్పన జరిగి ఉంటుందంటే.. అది, ఆదిమ కాలం లోనే అయి ఉంటుంది. ఒక్క సారి దేవతా విగ్రహాల చేతుల్లో ఉన్న మారణాయుధాలు చూడండి. కత్తులు, బాణాలు, ఈటెలు వగైరా.. ఆ ఆయుధాలే చాలా విషయాలు చెప్తాయి. ఆది మానవుడి అజ్ఞానం, అభద్రతా భావం.. ఆధునిక సమాజం వరకు వారసత్వం గా వచ్చాయి. ఆ నమ్మకాలకు కొన్ని వర్గాల వారు కల్పితాలు, కట్టు కథలూ అల్లి, కష్టజీవు లను దోపిడీ చేశారు. ఇంకా చేస్తున్నారు. మతమనే అజ్ఞానాన్ని పెంచి, అస మానతల్ని సృష్టించి, సామాజిక నిర్మాణాన్ని తప్పుదారి పట్టించారు. దాన్నే ఇంకా కొనసాగిస్తు న్నారు. దేవతల ఆయుధాలైన ఖడ్గాలు, బల్లాలు, విల్లు, చక్రం, గద వగైరాలన్నీ మన ఆదిమానవులు ఉప యోగించి నవి! అణు ఆయుధాలు, ఆటంబాంబులు, కాదు గదా, ఏకే-47 గన్స్, మామూలు తుపాకులు, పిస్టల్స్ లాంటివి దేవతలకు లేవు. అంటే, ఆ కాలంలో ఆ దేవతల పాత్రల్ని సృష్టించి, ఆయా రచనలు చేసినవారికి ఆ ఆయుధాలు మాత్రమే తెలుసునన్నమాట! ఎందుకంటే వారి పూర్వీకులు వాడిన ఆయుధాలు అవే గనక! కర్ర, ఇనుములతో తయారు చేసుకున్నవి. వారి పరిజ్ఞానం మేరకు అవే ఆయుధాలను దేవతలకు ఆపాదించి కథలు చెప్పుకున్నారు. అవే రాసుకున్నారు. కానీ, దేవతలు ఆది మానవుడి కన్నా బలవంతులని రుజువు చేయాలి కాబట్టి, వారికి అభూత కల్పనలు, మహిమలు, అతీత శక్తులు ఆపాదించారు.

ఆది మానవుడు వాస్తవంలో జీవించాడు. వాడి ఆయుధాలు మోటుగా ఉంటాయి. ప్రకృతిని, ఇతర జంతు, వృక్ష జాతుల్ని అర్థం చేసుకుంటూ మనుగడ సాగించాడు. తమ కథల్లోని పాత్రలు అంత సాదాసీదాగా ఉంటే ఎట్లా అని తర్వాత కాలంలో, తొలి దశలోని రచయితలు, కవులు మంత్రశక్తులు, ఆత్మజ్ఞానాలు, దివ్యదృష్టులు ప్రవేశ పెట్టారు. ఆయుధాలు ప్రయోగించేప్పుడు మంత్రోచ్చారణ చేసి, తమ శక్తిని, తాము నమ్మిన దేవతల శక్తిని ఆ ఆయుధంలో ప్రవేశపెట్టి ప్రయోగించేవారన్నమాట! అంటే మనిషి తనకు లేని శక్తులను దేవతలకు ఆపాదించి రాసుకున్నాడన్న మాట! అభూత కల్పనలతో దేవతలను, రాక్షసులను బలశాలులురుగా తీర్చిదిద్దుకున్నాడు మనిషి.



ఈ పురాణ గాథలన్నీ ఎవరు రాశారు? ఎట్లా రాశారూ? అని ఆలోచిస్తే జవాబు సులభంగా దొరుకుతుంది. ఇవి భూగర్భం నుండో, సముద్రగర్భం నుండో, ఆకాశ గర్భం నుండో ఊడిపడి మనిషికి లభించలేదు. మనిషి తనను తాను అర్థం చేసుకుని, ప్రకృతిని అర్థం చేసుకుని, ఊహ పెంచుకుని, తనను తాను వ్యక్తీకరించుకునే దశకు వచ్చిన తర్వాత... అంటే ఎన్నో ఎన్నో దశలు దాటి వచ్చిన తర్వాత కథలు అల్లుకోవడం ప్రారంభించాడు.

తను చూసింది, తెలుసుకుంది మాత్రమే తన కథలలో ఉండడానికి ఆస్కారముంది. చూడలేనిది, ఊహకు అందనిది ఆ కథల్లో ఉండదు. అందుకే మన ఇస్రో రాకెట్ ప్రయోగం పురాణాల్లో లేదు. ఇది అప్పటి మనిషి ఊహకు అందని విషయం. అలాగే శరీరంలోకి మైక్రో కెమెరాలు పంపే ప్రక్రియ పురాణాల్లో కనిపించదు. అలాగే రాడార్లు లేవు. శతఘ్నులూ లేవు. మనం ఈ విషయాలు మాట్లాడుకునేది పురాణాల స్థాయి దేవతల స్థాయి తగ్గించాలని ఎంత మాత్రమూ కాదు. కానీ, ఆ గ్రంథాలు, ఆ పాత్రలు అప్పటి మనిషి అవగాహనా స్థాయిని బట్టి సృష్టించబడ్డాయన్నది మనం ఎంత సత్వరం గుర్తిస్తే అంత మంచిది.

అలాగే దేవతల వాహనాలను గమనించండి. గుర్రాలు, ఏనుగులు, ఎద్దులు, పులులు, హంసలు మొదలైనవి. అంటే ప్రకృతిలో మనిషికి అనుభవంలోకి వచ్చిన జంతువుల్ని, పక్షుల్ని దేవతలకు వాహనాలు చేశాడు. రాక్షసబల్లుల గురించి, అనకొండ లాంటి ఇతర జంతువుల ప్రసక్తి ఎందుకు లేదో ఆలోచించాలి. సూక్ష్మ క్రిములున్నాయని, మైక్రోస్కోపులు, టెలిస్కోపులు తయారవుతాయనీ ఆనాటి మానవులకు తెలియదు. కాబట్టి, వాటి ఊసే పురాణాలలో లేదు. మనిషి కోరికలు తీర్చడానికి ఒకప్పుడు 'కల్పవృక్షం' ఉంటే, ఆ తర్వాత కాలంలో 'అల్లా ఉద్దీన్ అద్భుతదీపం' వచ్చింది. ఇవన్నీ మనిషి ఊహాశక్తికి కొలమానాలు. ఇలాంటివి మన పురాణాల్లోనే కాదు. ప్రపంచ సాహిత్యంలో చాలా కనిపిస్తాయి. శిష్ట సాహిత్యానికి సమాంతరంగా వచ్చిన ప్రపంచ జానపద సాహిత్యంలోనూ దయ్యాలు, భూతాలు, రాక్షసులు విరివిగా సృష్టించబడ్డాయి. మనిషి ముఖంతో రెక్కలున్న ఎద్దు ఇతర దేశాల పురాతన గాథల్లో కనిపిస్తుంది. మనిషి శరీరానికి సింహం తల, ఏనుగు తల, గుర్రం తల గల దేవతలు మనందరికీ తెలుసు. ఇవన్నీ ఆలోచించినప్పుడు, మనిషి సృజనాత్మక శక్తికి జేజేలు పలకాలి. మన పూర్వీకుల ఊహాశక్తికి సంతోష పడాలి. అంతేగాని, వారు అమాయకంగానో, అవగాహన లేకో ఆపాదించిన 'శక్తుల్ని' మాత్రం ప్రశ్నించక తప్పదు. నిజం నిగ్గు తేల్చకా తప్పదు. సంస్కృతి-సంప్రదాయాల పేరిట వాటినే పట్టుకుని, ఊగిసలాడుతున్న వారిని ఆలోచించుకోండని హెచ్చరించకా తప్పదు.

> **తను చూసింది, తెలుసుకుంది మాత్రమే తన కథలలో ఉండడానికి ఆస్కారముంది. చూడలేనిది, ఊహకు అందనిది ఆ కథల్లో ఉండదు. అందుకే మన ఇస్రో రాకెట్ ప్రయోగం పురాణాల్లో లేదు. ఇది అప్పటి మనిషి ఊహకు అందని విషయం. అలాగే శరీరంలోకి మైక్రో కెమెరాలు పంపే ప్రక్రియ పురాణాల్లో కనిపించదు. అలాగే రాడార్లు లేవు. శతఘ్నులూ లేవు.**

మన పురాణాలన్నీ సంస్కృతంలోనే ఎందుకున్నాయి? బుద్ధుడు పాళీ భాషలో ఎందుకు బోధించాడు అంటే ఆ కాలంలో ఆయా భాషలు వర్ధిల్లాయి. జన సామాన్యానికి విషయం అందాలంటే ఆ ప్రాంతంలోని భాషల్లోనే రచనలు రావాలి. ఏ రచయిత అయినా అతనికి తెలియని భాషలో రచనలు చేయలేడు కదా? గాలిబ్ ఇంగ్లీషులో గజళ్ళు రాయలేదు. సోమర్‌సెట్ మామ్ ఉర్దూలో నవలలు రాయలేదు. అంటే రాసేవాళ్ళు ఆయా సమాజాల్లోంచే పుట్టి పెరుగుతారు. ఆయా సమాజాల్లోంచే తమకు కావల్సిన ముడి సరుకు - భాష, వస్తువులాంటివి తీసుకుంటారు. ఈ అనంత కాల గమనంలో ఒక్కో చోట ఒక్కో భాష ప్రామాణికమౌతుంది. కొంత కాలానికి ఆ భాష ఉనికి తగ్గిపోవచ్చు. సంస్కృతం ఇప్పుడు వాడుకలో లేదు కదా? అదంతా మళ్ళీ వేరే చర్చ. ప్రపంచంలోని భాషలన్నీ ఆయా ప్రాంతాల్లోని జనం కాలక్రమంలో రూపొందించుకున్నవే. అభివృద్ధి పరచుకున్నవే. మనకు అందుబాటులోకి వచ్చిన మత గ్రంథాలు, పురాణ కావ్యాలు అన్నీ మనిషి రాసుకుంటూ వస్తున్నవేనన్నది అర్థం చేసుకుంటే మంచిది.

ఇక్కడ లిపి గురించి సంక్షిప్తంగా కొన్ని వివరాలు ఎందుకు ఇచ్చానంటే ఏ భాషా దైవభాష కాదు. అన్నీ పరిణామ క్రమంలో మనిషి సృష్టించుకున్నవే.. అని చెప్పడానికి! తను రూపొందించుకున్న లిపితో పదాలు, వాక్యాలు ఏర్పరచుకుని కథలూ, కావ్యాలూ రాసుకున్నాడు తప్పిస్తే దేవుడనే వాడు మనిషికి ఏ భాషనూ బహూకరించ లేదు. వేదాల్ని, పురాణ కావ్యాల్ని సముద్ర గర్భంలోంచి ఏ దేవుడూ తెచ్చివ్వలేదు. ఈ కల్పనలన్నీ, భ్రమలన్నీ మనిషివే! సంస్కృతాన్ని 'దైవభాష' అని కొనియాడేవారు, మరిప్పుడు ఆ భాష ఎందుకు ప్రజాదరణ కోల్పోయిందో చెప్పాలి.

దేవుణ్ణి మనిషే సృష్టించుకున్నాడు కాబట్టి, ఆయన ఆకారం, వేషం, ఆభరణాలు, ఆయుధాలు అన్నీ మానవుడు సృష్టించుకున్నవే. అంతా మానవ లీలే. దైవ లీల అంటూ ఏదీ లేదు. భాషల విషయానికొస్తే అన్నీ మానవ భాషలే తప్ప, దైవ భాషలేవీ లేవు. దేవుడు ఫలాన భాష మాట్లాడేవాడని ఎవరు చెప్పుకున్నారు? మనిషే చెప్పుకున్నాడు. తమిళనాడు మధుర మీనాక్షి ఆలయంలో పూజారులు తమిళంలో హారతి ఇస్తారు. పూరీ జగన్నాథునికి అక్కడి పాండాలు ఒరియాలో పూజలు చేస్తారు. యాదగిరి గుట్ట మీద పంతుళ్ళు దేవుడితో తెలుగులో మాట్లాడుతారు. యూరోప్ దేశాల్లోని చర్చిలలో ఒక్కో దేశంలో ఒక్కో భాషలో ప్రార్థనలు జరుగుతాయి. అంటే ఏమిటీ? దేవుడికి ఒక భాష, ఒక వేషం ఏదీ లేదు. అవి మారుతూ ఉంటాయి. ఆ ప్రాంతంలో ఉన్న జనానికి సంబంధించిన నేపథ్యంలోంచి అవన్నీ ఏర్పడ్డాయి.

అందువల్ల ప్రపంచాన్ని ఎవరు సృష్టించారు? మత గ్రంథాలు ఎవరిచ్చారూ? వంటి పనికిరాని చర్చలు మానాలి. ప్రపంచం ఏర్పడింది. మత గ్రంథాలు మనిషే రాసుకున్నాడు. ఈ విషయాలు పక్కన పెడితే, అసలీ ప్రపంచాన్ని అన్ని రకాలుగా నాశనం చేస్తున్న విలన్‌లు ఎవరూ? అన్నది గుర్తిస్తూ ఉండాలి. వారికి ఎప్పటికప్పుడు బుద్ధి చెపుతూ ఉండాలి! అదీ నేటి అవసరం!! తనకు అధికార పీఠం దక్కితే చాలుననుకునేవాడు రాజకీయాలతో జనాన్ని గొర్రెల్ని చేస్తున్నాడు. తను బాగుంటే చాలు ప్రపంచమేమైతే నాకేంటి అనుకునేవాడు కాలుష్యాలు పెంచుతున్నాడు. ఏదో రకంగా తన ఆధిపత్యం కొనసాగితే చాలన్నట్టు మత గురువులు జనానికి వక్రభాష్యాలు చెప్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే, సామాన్యుడికి తల తిరిగిపోతోంది.

(రచయిత సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్స్ ప్రొఫెసర్), సెల్: 9908633949 .



ఫొటో : బాబి (ఒంగోలు)

అది మన రాష్ట్రంలో ఆ కొసన ఉన్న శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం. అందులో ఒక ఊరు పేరు బొరివంక. అక్కడో ఉద్దానం యూత్ క్లబ్ ఉంది. ప్రతి ఏటా ఒక సామూహిక సందర్భానికి వేదికగా నిలిచే వినాయక చవితిని కుల మతాలకు అతీతంగా సార్వజనీనంగా నిర్వహించడం వారి ఆనవాయితీ. అయితే పర్యావరణ వినాయకుడినే రూపొందించి ఉత్సవాలు చేసుకోవడం వీరి ప్రత్యేకత. గత ఏడేళ్లుగా ఇదే బాణీ వీరిది. కొబ్బరికాయలు, వరి నారు, నలుగు పిండి, మూలికలు, ధాన్యం గింజలు, పామాయిల్ కాయలు... ఇలా ఇవన్నీ విగ్రహాల తయారీకి వీరెంచుకునే ముడిసరుకు. ఈసారైతే గోధుమ మొలకలతో విగ్రహాన్ని రెడీ చేశారు. ఇలాంటి విశేషాలు చాలానే ఉన్నాయక్కడ.

ప్రకృతి గణపతి

"ఉద్దానం యూత్‌క్లబ్‌ని పదేళ్ల కిందటే మొదలెట్టాం. గ్రామంలోని చదువుకున్న యువతను సంఘటితం చేసి.. వారు ఎంచుకున్న మార్గంలో ముందుకు సాగడానికి దీనిని ఏర్పాటుచేశాం. విద్య లేకపోతే వికాసం లేదన్న విషయం మనందరికీ తెలుసు.. అందుకోసమే ఎలాంటి గ్రంథాలయం లేని మా ఊళ్లో మేమే ఒక లైబ్రరీని మొదలెట్టాం. చదువు సరే... సాంస్కృతిక అంశాలను నిర్వహిస్తేనే జనం సామూహికంగా పాల్గొంటారని అర్థంచేసుకున్నాం. ఆ భావన నుంచి పుట్టిందే.. ఎకో ఫ్రెండ్లీ గణపతి విగ్రహాలతో వేడుకలు చేయడం" అని చెప్పుకొచ్చారు దీనికి అధ్యక్షుడైన సతీష్.

పర్యావరణ హితం

ఈ ప్రాంతంలోని చాలామంది గణపతి ఉత్సవాలకు పక్కనే ఉన్న ఒడిసా రాష్ట్రానికి వెళ్ళి, అక్కడ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయనాలతో తయారుచేసిన భారీ విగ్రహాలు కొనుక్కొస్తారు. ఉత్సవాలు పూర్తయ్యాక వాటిని చెరువుల్లో నిమజ్జనం చేస్తుంటారు. దీనివల్ల చెరువులు రసాయనాలతో కలుషితమయ్యేవి. అందుకే ఏం చేయాలా..? అని ఆలోచించి, పర్యావరణ హితంగా, వినూత్నంగా విగ్రహాన్ని రూపొందించి.. ఆ విగ్రహాలతోనే ఉత్సవాలు జరపాలని తీర్మానించుకున్నాం.



వినూత్న ఆలోచన

"మా సంఘంలోనే ఒక విగ్రహ రూపశిల్పి భైరి తిరుపతిరావు అనే యువకుడు ఉన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టిన అతనికి చిన్నప్పటి నుంచే చిత్రాలన్నా, విగ్రహాలు రూపొందించడమన్నా ఎంతో ఇష్టం. గణపతి విగ్రహాన్ని ఎలా రూపొందించాలని చర్చలు చేసుకుంటున్న మాలో అతనూ ఉన్నాడు. "ఎవరూ చేయనంత కొత్తదనంతో చేద్దాం. భక్తి భావం కన్నా ప్రకృతి మీద ప్రేమతోనే చేద్దాం" అని అన్నాడతను. అనుకున్నదే తడవుగా వరిధాన్యంతో గణపతి విగ్రహాన్ని తయారుచేయాలని నిర్ణయించాం. మట్టినీ చాలా తక్కువగా వినియోగించి, దీనిని తయారుచేయడం తిరుపతిరావు ప్రత్యేకత. చాలా శ్రమపడి తయారుచేసినా బాగా రూపొందింది. రెండు మూడు నియోజకవర్గాల్లోని వందలాది గ్రామాల ప్రజలు దీన్ని చూడడానికి వచ్చారు. ఇదంతా ఏడేళ్ల క్రితం జరిగింది" అంటూ విగ్రహ రూపకల్పన వెనకున్న ఆలోచన చెప్పుకొచ్చారు సతీష్.

జాతీయ స్థాయిలో గుర్తింపు

"2012లో మరింత కొత్తదనంతో నారికేళ (కొబ్బరి కాయలతో) గణపతిని తయారుచేశాం. దీనికోసం రెండు వేల కొబ్బరికాయలు వినియోగించాం. భారీగా వచ్చిన విగ్రహానికి కొబ్బరితోనే చుట్టూ అలంకరణలు చేశాం. ఆ తర్వాత ఏడాది కేవలం నలుగుపిండి వాడి విగ్రహాన్ని తయారుచేశాడు తిరుపతిరావు. సుమారు వంద కిలోలకు పైగా నలుగుపిండిని దీనికోసం ఖర్చు చేశాం. 2014లో వీటికి భిన్నంగా ఎక్కడ ఎవరూ తయారుచేయని విధంగా వరినారుతో వినాయకుడిని తయారుచేశాం. దీంతో ఉద్దానం ప్రాంతంలో అంతా ఇదొక వింతగా మారింది. అందరూ వచ్చి చూసి వెళ్లేవారు. తిరుపతిరావు శ్రమ, మా ప్రయత్నం వృథా కాలేదు. 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో ఈ విగ్రహానికి స్థానం లభించింది. 2015లో మరింత వినూత్నంగా ఔషధ మొక్కలూ, వనమూలికలు సేకరించి, వాటితో గణపతి విగ్రహాన్ని తయారుచేశాం. గ్రామీణ వైద్య అవసరాలు గుర్తుచేసేలా ప్రచారం చేశాం. మా కృషికి 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్' నిర్వాహకులు గుర్తించి, ప్రశంసించడమే కాకుండా వారి జాబితాలో చోటు కల్పించారు. ఇలా దేశవ్యాప్తంగా రెండోసారీ మా కృషికి అందరి అభినందనలు అందాయి" అంటూ తాము రూపొందించిన వైవిధ్య గణపతుల గురించి వివరించారు సతీష్.

గోధుమ నారుతో

"గతేడాది ఐదువేల పామాయిల్ కాయలతో ఎనిమిది అడుగుల విగ్రహాన్ని రూపొందించి, తిరుపతిరావు ఆశ్చర్యపరిచారు. ఇదీ అందర్నీ ఆకట్టుకుంది. ఈ ఏడాది గోధుమనారుతో గణపతి విగ్రహాన్ని తయారుచేశాం. ముందుగా గోధుమలను విగ్రహ రూపంలో తీర్చిదిద్ది, రోజూ దానిని నీటితో తడుపుతూ.. నారు అందులోనే మొలిచేలా చేశాం. ఈ శ్రమంతా గ్రామంలో ఒక సాంస్కృతిక వాతావరణాన్ని కొనసాగించడానికే. ఈ ఉత్సవాలను కేవలం విగ్రహాలకే పరిమితం చేయడంలేదు. మా క్లబ్ ద్వారా విద్యార్థులకు, యువతకు ఎప్పటికప్పుడు సృజనాత్మక పోటీలు పెడుతున్నాం. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం వంటి లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాం" అని ముగించాడు సతీష్.

- బెందాళం క్రిష్ణారావు



పర్యావరణ హితంగా..

ఏ పనిచేసినా పర్యావరణానికి హాని కల్గించకుండా చేయాలనుకుంటా. ఒక చిత్రకారునిగా, శిల్పిగా విగ్రహాల రూపకల్పనలో ఈ అంశాలే పాటిస్తా. అయితే ఎకో ఫ్రెండ్లీగా విగ్రహాలు తయారుచేయడమంటే చెప్పినంత సులభం కాదు. చాలా జాగ్రత్తగా, సునిశితంగా గమనిస్తూ విగ్రహాన్ని రూపొందించాలి. అందుకు సహకారం కావాలి. ఊరి ప్రజలు, యువకుల ప్రోత్సాహంతోనే ఎకోఫ్రెండ్లీ విగ్రహాలు చేయగలుగుతున్నా.

- భైరి తిరుపతిరావు, శిల్పి

ఫేస్‌బుక్ వేదికగా ప్రయోజ్‌నం

ఏదైనా పని సంకల్పించే ముందు.. బాగా ఆలోచించాలి. అలా ఆలోచించే పనిలో ప్రయోజనం ఉండాలి. అందుకే.. వీరు చేసే పని ఏదైనా సమాజ ప్రయోజనం కోసమే. సమాజమంటే ఏమిటి..? వట్టి మనుషులేనా.. కాదంటారు వీళ్ళు. "సమాజమంటే మనుషులతోపాటు.. నీరు, నిప్పు, మట్టి, చెట్టు, పుట్ట.. పక్షి ఇలా అన్నీనూ.." అని చెప్పడమే వీరి ముఖ్యోద్దేశం. అందుకే.. నాలుగు మూలలుగా ఉన్న వీరంతా ఫేస్‌బుక్ వేదికగా ఒక్కతాటిపైకొచ్చి చేతులు కలిపి.. 'ప్రయోజ్' అనే వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రారంభించారు. అందులో భాగంగానే ఇప్పుడు 'ఎకో గణపతి'ని భుజానెత్తుకుని సోషల్ మీడియా ద్వారా 'సెల్ఫీబూత్' అనే కొత్త కాన్సెప్ట్‌తో ప్రజల్లో ప్రచారం సాగిస్తున్నారు. పదండి.. ప్రయోజ్ జనాల్లోకి తీసుకొచ్చిన 'సెల్ఫీబూత్' గురించి తెలుసుకుందాం!

ఫేస్‌బుక్ అనేది ప్రత్యామ్నాయ మాద్యమంగా మారుతోంది. సమాచార, ప్రచార, ప్రసారమాద్యమాల కంటే ఎక్కువగా జనాల్లోకి వెళుతున్న వేగవంతమైన మాద్యమంగా ఫేస్‌బుక్‌కు పేరుంది. దీన్ని ఆసరా చేసుకుని ప్రయోజ్ నిర్వాహకులు ఈ ఏడాది "వినాయక పండగలో మట్టి వినాయకుడ్ని వినియోగించండి!" అని చెప్పడానికి 'సెల్ఫీబూత్' అనే కాన్సెప్ట్‌ను ముందుకు తెచ్చారు.

సెల్ఫీబూత్ అంటే??

చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే.. ఎంతటివారైనా సెల్ఫీదాసులే.. అన్నట్టుగా మారిపోయింది నేటి సెల్ఫీల ట్రెండ్. ఈ సెల్ఫీల ట్రెండ్‌నే కాస్తంత ప్రయోజనకరంగా మారిస్తే బావుంటుందనే ఐడియాలోంచి పుట్టుకొచ్చిందే 'సెల్ఫీబూత్'. ఫేస్‌బుక్ పేజీని బ్యాక్‌డ్రాప్ చేసుకుని.. ఆ డిజైన్‌తో ఓ గదిలాంటి చట్రం రూపొందించి.. దాన్ని బస్టాండ్, కాలేజ్, వాణిజ్య కూడళ్ళు వంటి రద్దీ ప్రదేశాల్లో ఉంచి.. ఎకోఫ్రెండ్లీ వినియోగంపై ప్రచారం చేస్తున్నారు ప్రయోజ్ నిర్వాహకులు. "పండగకి ఓ నాలుగైదు రోజుల ముందు మాత్రమే చాలామంది ఏదైనా అవగాహన కార్యక్రమాలు చేస్తుంటారు. దానివల్ల చెప్పాలనుకున్న విషయం అందరికీ చేరదు. ఫలితాలు అంతంతమాత్రమే ఉంటాయి. అలా కాకూడదనే 'ప్రయోజ్' కాస్తంత ముందుగానే ఆగస్టు 1 నుంచి 'సెల్ఫీబూత్' అనే కాన్సెప్ట్‌తో ప్రచారం చేస్తోంది.

ఫేస్‌బుక్ ఇమేజెస్‌తో సెల్ఫీబూత్ రోడ్డుపై కనపడగానే.. దగ్గరకొచ్చి 'ఏంటి ఇది?' అని అడుగుతున్నారు. అలా వస్తున్నవారికి మట్టి వినాయకుడి వినియోగం, పర్యావరణం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తిగల వారంతా 'సెల్ఫీబూత్' దగ్గర నిలబడి, సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. అలా ఒకరి నుంచి మరొకరు సోషల్‌మీడియాలో ఎకోఫ్రెండ్లీ ఫెస్టివల్ చేసుకోవడం పట్ల అవగాహన కలుగుతుంది" అని ప్రయోజ్ నిర్వాహకుల్లో ఒకరైన మణి పోలవరపు తెలిపారు.

మేకింగ్ గణేశ!

సెల్ఫీబూత్ కాన్సెప్ట్‌తోపాటు స్కూల్ పిల్లల్లో అవగాహన కల్గించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా 'మేకింగ్ గణేశ' అనేది ఒకటి. "పిల్లలు మట్టితో బొమ్మలు చేయడాన్ని చాలా ఇష్టపడతారు. అందులో గణేశుడి బొమ్మలంటే వారికింకా ఇష్టం. అలా పిల్లలు చేసే బొమ్మలపై పెద్దలకూ శ్రద్ధ పెరుగుతుంది. దీంతో మట్టి వినాయకుడి విగ్రహాల వినియోగంపై పెద్దలకూ అవగాహన కలుగుతుంది. అంతేకాదు 'మేకింగ్ గణేశ' వల్ల పిల్లల్లో దాగిన సృజనాత్మక వెలుగులోకి వస్తుంది. నిజంగానే పిల్లల నుంచి ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది" అంటూ ప్రయోజ్ వాలంటీర్ ప్రత్యూష వల్లభనేని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

చెట్టూ ముఖ్యమే

కేవలం పండగంటే.. మట్టి గణేషుడ్ని మాత్రమే వినియోగించండి! పర్యావరణం గురించి మేలు జరుగుతుందని చెప్పడం.. ఒక్కటేకాదు.. పండగ పేరుతో ఇతరత్రా జరిపే పనులూ ప్రకృతికి హాని కలిగించకూడదంటారు ప్రయోజ్ వాలంటీర్లు. భారీ విగ్రహాలు వద్దు అనుకుని.. మట్టితో చేసిన చిన్న విగ్రహాలనే వినియోగిస్తున్నాం. అలాంటప్పుడు అలంకరణకు వినియోగించే పత్రినీ తక్కువగా వాడటం ఉత్తమం. పత్రి పేరుతో తెలియకుండానే అరుదైన చెట్లు నరికేస్తున్నాం. దానివల్ల ఏటా కొన్ని వందల, వేల చెట్లు మోడుబారిపోతున్నాయి. అందుకే ప్రకృతికి హాని కలిగించకుండా ఉండాలంటే వివిధ చెట్ల నుంచి సేకరించే పత్రీ వీలైనంత తక్కువగా వాడాలనేది ప్రయోజ్ చేస్తున్న ప్రచారంలో ఒక భాగం. స్టూడెంట్స్, ఉద్యోగస్తులు, బిజినెస్ పీపుల్, గృహిణులు ఇలా.. పలువురి కలయికతో ఏర్పడిన 'ప్రయోజ్' చేస్తున్న 'సెల్ఫీబూత్' కాన్సెప్ట్‌ను నిజంగానే అభినందించాలి.



- గంగాధర్ వీర్ల



'జీవన'పై మీ స్పందన

'జీవన' పేజీలు మీకెలా అన్పిస్తున్నాయి? ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారు? మీ కుటుంబసభ్యుల, మిత్రుల, బంధువుల స్పందన ఎలా ఉంది? 'ప్రజాశక్తి' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు మాకు తెలియజేయండి.
మా చిరునామా: జీవన, ప్రజాశక్తి దినపత్రిక,
హౌస్ నెం : 7-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2, ఇ మెయిల్ jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006 మీ ప్రశ్నలకు 12-6 గంటల వరకు ఫోనులో చెప్పవచ్చు. ఆదివారం సెలవు.



జీవన సౌరభం

కష్టపడి చదువుకుంటేనే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోగలం.

మీ కోసం

నిమ్మ ఆకుల్ని రెండు కప్పుల నీటిలో ఉడకబెట్టి, ఆ నీటితో పుక్కిలిస్తే పంటినొప్పి తగ్గుతుంది.



సెన్సెక్స్ ▲ 28
31,596

నిఫ్టీ ▲ 05
9,857

రూపాయి ▲ 09 పైసలు
ఒక అమెరికా డాలరుకు రూ. 64.03



ఫార్మా, ఐటి షేర్ల పరుగు

- సెన్సెక్స్ 28 పాయింట్ల పెరుగుదల
- నేడు మార్కెట్లకు సెలవు

ముంబయి : ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ కాంట్రాక్టుల గడువు ముగియడంతో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపరు. దీంతో రియాల్టీ, ఎఫ్ఎంసిజి షేర్లు నిరాశపరిచాయి. మరోవైపు ఫార్మా షేర్ల ర్యాలీకి తోడు ఇన్ఫోసిస్‌లోకి నందన్ నిలేకనీ పునరాగమనం ఇవ్వబో తున్నట్టుగా వస్తున్న వార్తల నేపథ్యంలో గురువారం మార్కెట్లలో సానుకూల చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో బిఎస్ఇ సెన్సెక్స్ 28.05 పాయింట్లు లాభపడి 31,596.06 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఇ నిఫ్టీ 4.55 పాయింట్లకు పెరిగి 9,857.05 వద్ద ముగిసింది. వినాయక చవితి సందర్భంగా శుక్రవారం మార్కెట్లకు సెలవు. బిఎస్ఇలోని రంగాల వారిగా హెల్త్ కేర్ సూచీ 2.53 శాతం పెరిగాయి. ఇదే క్రమంలో ఐటి సూచీ 0.69 శాతం, టెక్ 0.54శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.53 శాతం లాభపడ్డాయి. మరోవైపు రియాల్టీ సూచీ 0.83శాతం, ఎఫ్ఎంసిజి 0.24శాతం, అయిల్ అండ్ గ్యాస్ 0.12శాతం చొప్పున నష్టపోయాయి. బిఎస్ఇ సెన్సెక్స్‌లో లూపిన్ 3.87శాతం, సన్ ఫార్మా 3.1శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.88శాతం, సిప్లా 2.47శాతం, ఇన్ఫోసిస్ 2.01శాతం చొప్పున అధిక లాభాలను అర్జించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు అదానీ పోర్ట్స్ 1.32శాతం, బజాజ్ ఆటో 1.04శాతం, రిలయన్స్ 0.88శాతం, హెచ్‌డిఎఫ్‌సి 0.73శాతం, హెచ్‌యు ఎల్ 0.72శాతం చొప్పున అధిక నష్టాలను చవి చూసిన వాటిలో మందు వరుసలో నిలిచాయి.

కోత బాటలో బిఒఐ

న్యూఢిల్లీ : సేవింగ్ ఖాతాల డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గిస్తున్న జాబితాలో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) కూడా చేరింది. పొదుపు ఖాతాల్లో రూ. 50 లక్షల కంటే తక్కువ ఉన్న నిల్వలపై వడ్డీరేటును 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టి 3.5 శాతానికి పరిమితం చేసింది. వడ్డీ తగ్గింపునపై రెండంచెల విధానాన్ని అనుసరిస్తున్నట్లు బిఒఐ పేర్కొంది. ఇందులో భాగంగా రూ. 50లక్షల కంటే తక్కువ ఉన్న నగదు నిల్వలపై 3.5శాతం వడ్డీ అమలు చేయనుంది. కాగా రూ. 50లక్షలు పైబడిన సేవింగ్ డిపాజిట్లపై యధావిధిగా 4శాతం వడ్డీరేటు ఉంటుందని ఆ బ్యాంకు తెలిపింది. ఎస్‌బిఐతో మొదలైన వడ్డీ రేట్ల తగ్గింపు బాటలో ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కర్నాటక బ్యాంక్, యస్ బ్యాంకు తదితర విత్త సంస్థలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

జియోఫోన్ వెబ్‌సైట్ క్రాష్


న్యూఢిల్లీ : రిలయన్స్ జియో చౌక ధరలో రూ.1500కే అందుబాటులోకి తెస్తోన్న ఫీచర్ ఫోన్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం 5.30గంటలకు జియో ఫ్రీ ఫోన్ బుకింగ్ ప్రారంభం కాగా ఒక్కసారిగా లక్షలాదిమంది వినియోగదారులు ఫోన్ బుకింగ్స్ కోసం ప్రయత్నించారు. తాకిడిని తట్టుకోలేక ఆ జియో వెబ్‌సైట్ క్రాష్ అయ్యింది. దీంతో వినియోగదారులు అసంతృప్తికి లోనయ్యారు. జియో.కామ్ తెరువగానే కంటెంట్ సర్వర్ ఎర్రర్ అని చూపించింది. కొంతమంది వినియోగదారులు జియో.కామ్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నిస్తే, అసలేమీ కనిపించడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారు. దాదాపు 50కోట్ల మంది యూజర్లు జియో ఫోన్ కోసం ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మై జియో యాప్ కూడా జియో ఫోన్ బుకింగ్స్ చూపడం లేదంటూ ఫిర్యాదులు చేస్తున్నారు.

నందన్ నిలేకనికి ఇన్ఫోసిస్ పగ్గాలు

సిఇఒగా నియామకం

- అధికారకంగా వెల్లడించిన కంపెనీ
- సంస్థలో రెండో ఇన్నింగ్స్

ముంబయి/ బెంగళూరు : ఊహించిందే జరిగింది. దేశీయ ఐటి దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్‌లో ఏర్పడిన సంక్షోభానికి తాత్కాలికంగా సంస్థ మాజీ చైర్మెన్ నందన్ నీలేకని తెర దించారు. కంపెనీని చక్కబెట్టేందుకు గాను సంస్థలో తన రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. నందన్ నీలేకనిని కంపెనీ బోర్డు ఛైర్మన్‌గా, నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కూడా నియమిస్తున్నట్టు ఇన్ఫోసిస్ గురువారం రాత్రి పొద్దుపోయాక మార్కెట్ నియంత్రణ సంస్థకు పంపిన వర్తమానంలో తెలిపింది. కంపెనీ వ్యవస్థాపకులు ఎన్.ఆర్ నారాయణ మూర్తి తర్వాత 2002 ఏప్రిల్ నుంచి 2009 చివరి వరకు నీలేకని ఇన్ఫీ సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించారు. తన హయాంలో ఆయన ఇన్ఫీ అభివృద్ధిలో తనదైన ప్రత్యేక ముద్ర వేశారు.నీలేకని సంస్థలోకి తిరిగి రానున్నారన్న వార్తల నేపథ్యంలో ఇప్పటి వరకు ఇన్ఫీ చైర్మెన్‌గా వ్యవహరిస్తున్న ఆర్.శేషశాయి, కొ-చైర్మెన్ రవి వెంకటేశన్‌లు తమ పదవులకు రాజీనామా చేశారు. వీరిలో రవి వెంకటేశన్ స్వతంత్ర డ్కెరెక్టర్‌గా కొనసాగుతారని సంస్థ తెలిపింది. వీరతో పాటు మాజీ సీఎండీ, విశాల్ సిక్కా, జెఫ్రీ ఎస్ . లెహ్మన్, జాన్‌ఎట్కెమెండీలు కూడా బోర్డు నుంచి నిష్క్రమించారు. ప్రస్తుతం నీలేకనికి సంస్థలో దాదాపు 2.29 శాతం వాటాలు ఉన్నాయి.



నందన్ నిలేకని

చాలా సంతోషంగా ఉంది: నీలేకని

నా మాతృ సంస్థ ఇన్ఫోసిస్‌లోకి తిరిగి అడుగుపెట్టడం నాకు చాలా సంతోషంగా ఉందని నీలేకని అన్నారు. నేటి నంచి నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా నా వంతు బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తాను. సహచరులతో కలిసి ఇన్ఫీ బంగారు భవిష్యత్త కోసం కృషి చేస్తానని తెలిపారు. సంస్థ ఖాతాదారులకు, వాటాదారులకు, ఉద్యోగులకు, మేటి ఫలితాలను అందిచడంమే లక్ష్యంగా.కృషి చేస్తాను అయిన నీలేకని అన్నారు.

ఇన్ఫీలో వినూత్న కల్పనలు కష్టమే : సిక్కా

ఇన్ఫోసిస్ ఇకపై వినూత్న కల్పనదార్ల (ఇన్నోవేటర్స్) కంపెనీగా కొనసాగడం కష్టమేనని విశాల్ సిక్కా అన్నారు. దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీగా ఉన్న ఇన్ఫోసిస్‌కు సిఇ, ఎండిగా వ్యవహరించిన విశాల్ సిక్కా అనుహ్యంగా రాజీనామా చేసిన తర్వాత తొలిసారి స్పందించారు. ఇన్నోవేటర్స్ కంపెనీగా ఉండకపోయినా ఐటి రంగంలో ఐకానిక్‌గా నిలిచి గెలుస్తుందన్నారు. తన రాజీనామా తర్వాత దాదాపుగా 72 గంటలు నిద్ర పోలేదన్నారు. ఆ సమయంలో కేవలం 6 గంటలు మాత్రమే పడుకున్నానని తెలిపారు. ఇన్ఫోసిస్‌కు రాజీనామా చేసిన తర్వాత తొలిసారి ఫోర్బ్స్ ఇండియాకు సిక్కా ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా సిక్కా మాట్లాడుతూ ఇన్ఫోసిస్‌ను వీడడం తన జీవితంలో అతి బాధాకరమైన సంఘటన అని పేర్కొన్నారు. అనివార్య పరిస్థితుల వల్లే వైదొలగాల్సి వచ్చిందన్నారు. తన జీవితంలో అతి కష్టతరమైన నిర్ణయాల్లో ఒక్కటని తెలిపారు. కానీ ఇదే సమయంలో తనకు లభించిన మద్దతు, స్పందన చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. రాజీనామా తర్వాత కలిగిన ఒత్తిడిని జయించడానికి తన 50వ జన్మదినం సందర్భంగా తన గురువులాంటి, గొప్ప స్నేహితుడు ఇచ్చిన హెర్మాన్ హెస్సే పుస్తకంతోపాటు, జిడ్డు కృష్ణ మూర్తి రాసిన ఫ్రీడమ్ ఆఫ్ ది నోన్ పుస్తకాలను చదువుకున్నానని తెలిపారు. గతాన్ని మర్చిపోవడం ద్వారా కొత్తదనాన్ని ఆలింగనం చేసుకోవచ్చున్నారు. గతం నుంచి స్వేచ్ఛ పొందడం మనల్ని మనం కొత్తగా అన్వేషించుకోవడానికి సాయ పడుతుదంటూ తాత్వికంగా మాట్లాడారు. దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేసిన విషయాలపై దృష్టి పెట్టడానికి తనకు ప్రస్తుతం కొంత సమయం కావాలన్నారు. ముఖ్యంగా పుస్తకాలను చదవాలనుకుంటున్నానని పేర్కొన్నారు. తన కుటుంబంతో సమయాన్ని వెచ్చించాలని కోరుకుంటున్నానని తెలిపారు.

1996లో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుండి కృత్రిమ మేధస్సు (ఎఐ) లో పిహెచ్‌డి చేశారు సిక్కా. సిలికాన్ వ్యాలీలో ఐ బ్రెయిన్, బోధా అనే రెండు సొంత సంస్థలను ప్రారంభించారు. ఆ సమయంలో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ ఎన్.ఆర్.నారాయణ మూర్తి , మరో వ్యవస్థాపకుడు నందన్ నీలేకని సిక్కాకు రోల్‌మోడల్ హీరోలుగా ఉన్నారు. తనకు కృత్రిమ మేధస్సు అంటే చాలా ఆసక్తి అని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో ఏదో సాధించాలని ఆశిస్తున్నానని, దీనికి సంబంధించి ప్రపంచంలో మార్పునకు నాందిపలికేలా చేయాలనుకుంటున్నానని అన్నారు. అయితే ఈ రంగంలో ఏది సాధించాలనేది ఇప్పటికీ స్పష్టత లేదని. అయినా ఆ వైపుగా పయనం సాగించాలని యోచిస్తున్నానని తెలిపారు.

కొత్త శిఖరాలకు ఎఐని చేర్చుదాం




ఎయిర్ ఇండియా కొత్త సిఎండి రాజీవ్ బన్సాల్

ముంబయి: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా (ఎఐ) కొత్త సిఎండిగా రాజీవ్ బన్సాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎఐ సిఎండిగా ఉన్న అశ్వీన్ లొహానీని రైల్వే బోర్డు చైర్మెన్‌గా పంపిన సర్కారు.. ఆయన స్థానంలో రాజీవ్ బన్సాల్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. బన్సాల్ 'ఇండియాన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్-1988' బ్యాచ్‌కు చెందిన వారు. సంస్థను లాభాల బాట పట్టించేందుకు గాను ఉత్సాహంతో అంకితభావంతో పని చేసేందుకు తాను కట్టుబడి ఉన్నట్టుగా బన్సాల్ వివరించారు. ప్రయాణికుల సంతృప్తిని కాపాడుకుంటూ సంస్థ పని తీరును మెరుగుపరచుకునేందుకు కృషి చేయనున్నట్టుగా ఆయన ఈ సందర్భంగా వివరించారు. జాతీయ విమానయాన సంస్థ అయిన ఎయిరిండియాను కొత్త శిఖరాలకు చేర్చేందుకు గాను భారతీయులందరి సహకారాన్ని తాను ఆశిస్తున్నట్టుగా ఆయన ఈ సందర్భంగా తెలిపారు. బన్సాల్ పెట్రోలియం, సహజ వాయువు శాఖలో (ఆర్థిక వ్యవహారాల విభాగపు) అదనపు కార్యదర్శి బాధ్యతలతో పాటుగా ఎఐ బాధ్యతలను కూడా పర్యవేక్షించనున్నారు.

రెండంకెల వృద్ధితో కష్టాలే

ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ హెచ్చరిక




న్యూఢిల్లీ : రెండంకెల వృద్ధి రేటు ఆశించడమంటే అప్పుల భారాన్ని పెంచుకోవడమేనని రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్ వైరల్ ఆచార్యా అన్నారు. వేగవంతమైన వృద్ధి వెనుక ఆర్థిక వ్యవస్థ సంక్షోభానికి గురైయ్యే అవకాశాలు లేకపోలేదన్నారు. ప్రస్తుతం సంస్థాగత ఆర్థిక వ్యవస్థపై దృష్టి కేంద్రీకరించడం మంచిదన్నారు. 9 నుంచి 10 శాతం వృద్ధి రేటు సాధించడమంటే అప్పుల ఆధారిత ఆస్తులను పెంచుకోవడమేనని తన అభిప్రాయంగా పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన ఆసియా సొసైటీ కార్యాక్రమంలో ఆచార్యా మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి రేటు తొమ్మిది, పది శాతం పెరగడమంటే ఆందోళనతో కూడుకున్న అంశమేనన్నారు. ఈస్థాయిలో వృద్ధి సాధించడమంటే స్వల్ప కాలంలో భారీగా ఉత్పత్తిని పెంచడమేనన్నారు.

ఫైనాన్సింగ్ విధానం మారాలి

ప్రాజెక్టుల రుణాలపై చందా కొచ్చర్




ముంబయి : పెట్టుబడుల పునర్జీవానికి వీలుగా ప్రస్తుత ప్రాజెక్టులకు అనుసరిస్తున్న విత్త విధానాన్ని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసిఐసిఐ బ్యాంకు సిఇఒ చందా కొచ్చర్ అన్నారు. ప్రాజెక్టుల ఫైనాన్సింగ్ విధివిధానాల్లో మార్పులు చేయాలన్నారు. ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ రాకేష్ మోహన్ రచించిన ఓ పుస్తకావిష్కరణకు హాజరైన కొచ్చర్ మాట్లాడుతూ ఒక సంస్థకు రుణం ఇవ్వాలంటే ఆ కంపెనీ ప్రాజెక్టుకు ముందూ, వెనకటి సమగ్ర సమాచారం, స్థల లభ్యత, సహజ వనరులు, ఆర్థికాంశాలు కీలకమైనవన్నారు. ఇవన్నీ ఉంటే బ్యాంకులు వేగిరంగా అప్పులివ్వచ్చున్నారు. 2016-17లో భారత్‌లో రుణాల జారీ వృద్ధి 5.08 శాతానికి పతనమయ్యింది. ఇది 1953 నాటి అత్యంత కనిష్ట స్థాయి. ఆ కాలంలో కనిష్టంగా 1.8 శాతం పెరుగుదల మాత్రమే చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనూ రుణాల డిమాండ్ వృద్ధి 6 శాతానికే పరిమితమయ్యింది.



బ్యాంకింగ్ అవేర్‌నెస్ (ఐబిపిఎస్, పిఒ'స్, క్లర్క్స్)

What is an Indian Depository Receipt (IDR)?

MODEL QUESTIONS



1. Who is appointed as the 24th Governor of the Reserve Bank of India in place of Mr. Raghuram Rajan?
a) H.R. Khan b) N.S. Vishwanathan
c) R. Gandhi d) S.S. Mundra
e) Urjit Patel

2. Which is the other bank that will be merged with SBI besides its five subsidiary banks?
a) City Union Bank
b) Karur Vysya Bank
c) South Indian Bank
d) Bharatiya Mahila Bank
e) IDBI

3. Which of the following products launched by most of the banks help farmers in getting instant credit for various agricultural purposes?
a) Kisan Credit Card b) Personal loan
c) Business loan d) Only (a) and (b)
e) None of the above

4. Banks have started opening biometric ATMs now. Such ATMs will prove most beneficial for which of the following categories of customers?
a) Govt. employees b) HNIs
c) NRIs d) Students
e) Illiterate people

5. Which of the following institution provides long run finance to industries?
a) UTI b) LIC
c) GIC d) IDBI
e) All of the above

6. In banking terminology the word "Co - obligant" means:
a) A person who has guaranteed the account of another person(s)
b) A person who has executed an indemnity bond in a bank's favour
c) A person who has assumed obligations of contract jointly with other person(s)
d) A person/ business undertaking opening a documentary letter of credit
e) None of the above

7. Which of following is the first such company of the country which offers services for the resolution of Non - performing assets upon acquisition from bankers?
a) CIBIL b) ARCIL
c) ECGC d) CRISIL
e) IDFC

8. Who among the following has been appointed as Executive Director of the RBI, replacing N.S. Vishwanathan, who recently was elevated as Deputy Governor of the RBI?
a) M.D. Patra b) S.Ganesh Kumar
c) Chandan Sinha d) U.S. Paliwal
e) Deepali Pant Joshi

9. Account payee crossing is a direction of the drawer:
a) to collecting banker b) to drawee banker
c) to payee d) to all endorsees
e) paying Banker

10. Govt. proposes to do away the ___ for its fiscal affairs management from fiscal 2017-18.
a) Plan and Non - Plan classification
b) Revenue receipts and Capital receipts classification
c) Tax and non tax receipts classification
d) Only (a) and (b)
e) None of these

11. The advantages of securitization for a Bank is:
a) It provides liquidity to the issuing Bank
b) The Bank capital does not get blocked
c) Securitization proceeds can be used for fresh lending
d) Only (a) and (b)
e) (a), (b) and (c)

12. Example of the product line of a Bank is:
a) Car loan b) Personal loan
c) Home loan d) Mortgage loan
e) All of the above

13. As per Prevention of Money Laundering act, the banks are required to maintain record of transactions for a minimum period of ____ from date of cessation of the transaction.
a) 2 years b) 5 years
c) 10 years d) 20 years
e) 25 years

14. Statutory cash reserve ratio for scheduled banks is regulated by Reserve Bank of India under powers conferred upon it by?
a) Reserve Bank of India act, 1934
b) Banking Regulation act, 1949
c) Companies act, 1956
d) Union Ministry of Finance
e) Negotiable Instruments act, 1881

15. The commercial paper can be issued by:
a) All banks
b) All corporate
c) All corporate with net worth of at Rs. 1 crore
d) All corporate with net worth of at least Rs. 4 crores
e) Other than those given as options

16. "Ek Bharat Shreshtha Bharat" programme is meant for linking ___ to connect people through exchanges in areas of language, trade, culture, travel and tourism:
a) States and Cities
b) States and Districts
c) Cities and Towns
d) Districts and Villages
e) None of the above

17. Grameen Bank and Micro Credit are associated with which person?
a) Manmohan Singh
b) Bill Gates
c) Md. Yunus
d) Aung San Su Ki
e) Acharya Vinobha Bhave

18. Many a time we read a term MSS in relation to banking transactions. What is the full form of MSS?
a) Money Stabilization Scheme
b) Market Stabilization Scheme
c) Maturity and Standardization Service
d) Money Stabilization Service
e) None of the above

19. RBI's open market operation transactions are carried out with a view to regulate?
a) Liquidity in the economy
b) Prices of essential commodities
c) Inflation
d) Only (a) and (c)
e) (a), (b) and (c)

20. What is an Indian Depository Receipt (IDR)?
a) A deposit account with a Public Sector Bank
b) A deposit account with any of depositories in India
c) It is a financial instrument denominated in Indian currency and are issued by a domestic depository and the underlying equity
d) Shares are secured with a custodian
e) None of the above

21. Which among the following banks/ banks in India have set up the Financial Literacy and Credit Counseling Centers?
a) Reserve Bank of India
b) Scheduled Commercial Banks
c) Foreign Banks working in India
d) NABARD
e) None of the above

22. Which of the following bank was not nationalized in 1969?
a) Canara Bank b) United Bank of India
c) UCO Bank d) Punjab National Bank
e) Andhra Bank

23. Which of the following comes under RBI's quantitative measures?
a) Bank Rate Policy
b) Open Market Operation
c) Cash Reserve Ratio
d) Statutory Liquidity Ratio
e) All the above

24. Prior to the establishment of the Reserve Bank of India, the Government banking business was conducted by:
a) Bank of India
b) Central Bank of India
c) National Bank of India
d) Imperial Bank of India
e) Punjab National Bank

25. The assets of the banks will be classified as Standard, Sub-standard, Doubtful and Loss assets. Wherein assets which have remained NPA for a period less than or equal to 12 months, are termed as:
a) Substandard assets b) Doubtful assets
c) Loss assets d) Provisional assets
e) Other than those given as options

26. Govt. has proposed to assist the Start-ups through ___ deduction of profits for 3 out of 5 years for startups set up during April 2016 to March 2019.
a) 40% b) 60% c) 80% d) 25% e) 100%

27. In banking parlance there are certain terms like Demand Deposits and Term Deposits. Term Deposits include:
a) Fixed deposits
b) Recurring deposits
c) Time liabilities portion of saving bank deposits
d) SDR (Short Term Deposits)
e) All of the above

28. Which of the following is not associated with risks related to risk management in banks?
a) Credit risk b) Market risk
c) Profit risk d) Operational risk
e) None of these

29. Which of the following is not an authorized mode in Banks to Transfer Money, Know the balance, in the account, etc.?
a) Online b) Mobile
c) Phone d) Video Conferencing
e) None of the above

30. A trust is a legal entity authenticated by a:
a) Title deed b) Sale deed
c) Trust deed d) Partnership deed
e) Power of attorney

31. Banks allow some important customers to withdraw without clear credit balance. Such facility is known as:
a) Zero Balance b) Current Account
c) Overdraft d) Demand draft
e) Promissory

32. To open a savings account in the name of a minor, we should ensure:
a) The person can independently read, write and sign
b) Only operated by self; either physical visits or through ATMs
c) An undertaking furnished by the major guardian
d) Only (a)
e) (a), (b) and (c)

33. Certificate of incorporation of a company is like a:
a) License b) Permit
c) Clearance d) Birth certificate
e) Statutory approval

34. To open the account of a public charitable trust, the key document required is:
a) Permission of Charity Commissioner
b) Permission of Local Authority
c) Permission of Court of Law
d) All of the above
e) None of the above

Answers : 1) e, 2) d, 3) a, 4) e, 5) d, 6) c, 7) b, 8) b, 9) e, 10) a, 11) e, 12) e, 13) b, 14) b, 15) d, 16) b, 17) c, 18) b, 19) e, 20) c, 21) b, 22) e, 23) e, 24) d, 25) a, 26) d, 27) e, 28) c, 29) d, 30) c, 31) c, 32) e, 33) d, 34) a. ★

ఉద్యోగాలు

ఓఎన్‌జీసీలో 27 ఖాళీలు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో వివిధ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

పోస్టుల పేరు-ఖాళీలు : హ్యూమన్ రీసోర్స్ ఎగ్జిక్యూటివ్-20, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్-5, అఫిషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్-2.

వేతనం : రూ.24,900-రూ.50,500.

అర్హతలు : సంబంధిత పోస్టులను అనుసరించి 60 శాతం మార్కులతో ఎంబీఏ/ పీజీ డిగ్రీ/ పీజీ డిప్లొమా/ పీజీ. దీంతోపాటు యూజీసీ నెట్ (నవంబర్ 2017) ఉత్తీర్ణత.

వయోపరిమితి : 2017, జనవరి 1 నాటికి 30 ఏళ్ల మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : విద్యార్హతలు, యూజీసీ నెట్ మార్కులు, ఇంటర్వ్యూ.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులకు చివరి తేదీ : సెప్టెంబర్ 19, 2017.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : www.ongcindia.com

విఆర్ఏలకు వేతనాలు పెంచాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు డిమాండ్
- విజయవాడలో రిలే దీక్షలు ప్రారంభం
- సర్కారు స్పందించకుంటే నిరవధిక దీక్షలు



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న వి. ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. సమావేశాలు, అలంకరణల పేరుతో వందల కోట్లు దుబారా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, విఆర్ఏల వేతనాల పెంపు గురించి పట్టించుకోకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. విఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన గురువారం ఉదయం ధర్నా చౌక్‌లో రిలేదీక్షలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ ఐదో తేదీ వరకూ ఈ దీక్షలు కొనసాగుతాయి. తొలిరోజు దీక్షలో కడప జిల్లా నాయకత్వం పాల్గొంది. దీక్షలను ప్రారంభించిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్యాలయాల అధునికీకరణ పేరుతో అమరావతి నిర్మాణం పేరుతో ఏమీ లేని వాటికీ ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కన్సల్టెంట్లకే ఇంతవరకు సుమారు రూ.400 కోట్ల వరకు ఖర్చు చేసిందని తెలిపారు. దీంట్లో రెండో వంతు ఇచ్చినా వేలాదిమంది విఆర్ఏల సమస్యలు పరిష్కారమైవుండేవన్నారు. గ్రామాల్లో ఏ చిన్న సమస్య వచ్చినా విఆర్ఏలు లేకపోతే పరిష్కారం కాదని, కీలకమైన వీరిని ప్రభుత్వం చిన్న చూపు చూడటం సరైంది కాదని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రధాన కార్యదర్శి బాలకాశి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 27 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరి వేతనాలను రూ. 18 వేలకు పెంచాలన్నారు. తెలంగాణలో ఇప్పటికే వేతనాలు పెంచారని గుర్తుచేశారు. విద్యార్హతల ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని కోరారు. నామినీలను విఆర్ఏలుగా నియమించి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచిన ప్రభుత్వం విఆర్ఏలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. నిరాహారదీక్షలకు ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.పెద్దన్న మాట్లాడుతూ అతి తక్కువ జీతంతో ఎక్కువ పనిచేస్తున్న విఆర్ఏలు గ్రామ పరిపాలనలో కీలకమని తెలిపారు. వేతనాల గురించి మూడేళ్లుగా ప్రభుత్వానికి వందలసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విఆర్ఏలు విధుల్లో లేకపోతే గ్రామ పరిపాలన దాదాపు నిలిచిపోతుందని, ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘ నాయకులు జి.ధైర్యం, జయరాజు, ఏసురత్నం, రామకృష్ణయ్య, ప్రసాదు, బోగేశ్వరయ్య, పవన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'సాగర్'లో హైదరాబాద్ యువకుడు మృతి

ప్రజాశక్తి - విజయపురిసౌత్ (గుంటూరు)

హైదరాబాద్ నుంచి విజయపురిసౌత్‌కు విహారయాత్రకు వచ్చిన యువకుడు మృత్యువాత పడ్డాడు. విజయపురిసౌత్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన ఇర్ఫాన్ బిన్ ఉస్మాన్(25), మరో నలుగురు కలిసి ప్రత్యేక వాహనంలో మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చారు. వీరంతా కలిసి కృష్ణవేణి ఘాట్ వద్ద స్నానం చేసే క్రమంలో ఇర్ఫాన్ బిన్ ఉస్మాన్ కాలుజారి నీటిలో పడిపోయాడు. గమనించిన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే నీటిలో మునిగిన ఇర్ఫాన్ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ వాసు తన సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని గజ ఈతగాళ్లను రంగంలోకి దించారు. కొద్దిసేపటికి ఇర్ఫాన్ మృతదేహాన్ని వెలుపలికి తీశారు.

17న విజయవాడలో రైతు రక్షణ యాత్ర-రైతాంగ సమర భేరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతు సమస్యలపై సెప్టెంబర్ 17న విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో 'రైతు రక్షణ యాత్ర-రైతాంగ సమర భేరి' పేరిట మహా సభను నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎపి రైతు సంఘం అధ్యక్షులు వై కేశవరావు తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటీ హాల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పంట ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతం గిట్టుబాటు ధర కల్పించాలని, ఎంఎస్ స్వామినాథన్, రైతు కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లోపభూయిష్ట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులకు పెరిగిన రుణాలను రద్దు చేయాలన్నారు. అవసరానికి మించి ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూ సేకరణను వెంటనే మానుకోవాలన్నారు. పారదర్శకతతో కూడిన భూ సేకరణ, న్యాయమైన పరిహారం చట్టానికి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయన్నారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్ని ఆమోదించరాదని, వ్యవసాయ ఎగుమతి, దిగుమతుల్ని రైతులకు మేలు కలిగేలా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయివేటు రుణాలను జాతీయ బ్యాంకులకు బదిలీ చేయాలన్నారు. రైతు సమర భేరికి రైతులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

26 నుంచి కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ ఉత్సవాలు

ప్రజాశక్తి - విజయనగరం

నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకానికి 125 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జాతీయోత్సవాలు నిర్వహించడానికి విజయనగరం జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈనెల 26, 27, 28 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, మొజాయిక్ సాహిత్య సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివేక్‌యాదవ్ తెలిపారు. 26, 27 తేదీలలో విశాఖపట్నం ఆంధ్ర విశ్వ విద్యాలయం ప్లాటినమ్ జూబ్లీ హాల్‌లో చర్చాగోష్ఠి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంఆర్ కళాశాల గురజాడ విగ్రహం వద్ద 28న ఉదయం 10 గంటలకు నివాళ్లు అర్పించి, అక్కడి నుంచి గురజాడ స్మారక భవనం వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రముఖులు, యువత పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి పి.అశోక్ గజపతిరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర గనులు, భూగర్భజల శాఖామంత్రి ఆర్‌వి సుజయ్‌కృష్ణ రంగారావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ శోభస్వాతిరాణి, ఎమ్మెల్యే గీత హాజరవుతారని తెలిపారు. గౌరవ అతిధులుగా శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డి.విజయ్‌భాస్కర్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఎన్నికల విధులకు వెళ్లి ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

మధుమేహంతో బాధపడుతున్నప్పటికీ ఎన్నికల విధులు నిర్వర్తించి ఇంటికొచ్చిన అనంతరం వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో ఓ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలలోకి వెలితే.. కర్నూలు జిల్లా నందికొట్కూరు రోడ్డు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన బొగ్గూరి చక్రపాణి (46) జూపాడు బంగ్లా మండలం తరిగోపుల గ్రామంలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఆయనకు మధుమేహ వ్యాధి ఉండడంతో క్రమంగా ఇన్సులిన్‌ను వాడేవారు. తాను మధుమేహంతో బాధపడుతున్నానని విన్నవించుకున్నప్పటికీ డ్యూటీ తప్పనిసరి అని అధికారులు చెప్పడంతో వెళ్లాడు. విధులు ముగించుకొని బుధవారం అర్ధరాత్రి దాటాక ఇంటికి చేరాడు. గురువారం సాయంత్రం వ్యాధి తీవ్రమై అపస్మారకస్థితికి చేరుతుండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య వేణి సుజాత, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. రూ.200 నోటు
2. ఐదు
3. శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్
4. షేర్ బహద్దూర్ దేవ్‌బా
5. మార్క్ వాల్ బర్గ్

ప్రాణాలు పోయినా భూములివ్వం

సబ్ కలెక్టర్‌కు స్పష్టం చేసిన జక్కంపూడి రైతులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి

ప్రాణాలు పోయినా భూములిచ్చేది లేదని రూరల్ మండలం జక్కంపూడి గ్రామ రైతులు స్పష్టం చేశారు. అర్బన్ హౌసింగ్ స్కీంలో గృహ నిర్మాణానికి అవసరమైన భూ సమీకరణపై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జక్కంపూడి రైతులతో ఆర్‌డిఒ ఎస్.హరీష్ గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. భూములు తీసుకునేందుకు ప్రయత్నిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా జక్కంపూడిలో హౌసింగ్ కాలనీ ఏర్పాటుకు ల్యాండ్ పూలింగ్ ద్వారా 60:40 నిష్పత్తిలో భూములు తీసుకున్నారని గుర్తు చేశారు. రైతులకు ప్లాట్లను అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పిన హామీ ఇప్పటికీ పూర్తి స్థాయిలో నెరవేర్చలేదన్నారు.

అభివృద్ధికి సహకరించాలి : ఆర్‌డిఒ హరీష్

జక్కంపూడిలో ఫైనాన్షియల్ సిటీ ఏర్పాటు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, అభివృద్ధికి సహకరించాలని ఆర్‌డిఒ హరీష్ తెలిపారు. అర్బన్ హౌసింగ్ స్కీంలో గృహ నిర్మాణం చేపట్టేందుకు 230 ఎకరాల ప్రభుత్వ భూములు కేటాయించిందని తెలిపారు. ఈ నగరం ఏర్పాటుకు రూరల్ మండలం జక్కంపూడి, వేమవరం గ్రామాల్లో మరో 190 ఎకరాలు వంద మందికి పైగా రైతుల నుంచి సమీకరించాల్సి ఉందని అన్నారు. భూములిచ్చే రైతులకు ఎకరానికి 1800 గజాలు కేటాయిస్తామన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలని ఐద్వా ర్యాలీ

ప్రజాశక్తి-తగరపువలస, విశాఖ

మహిళలపై దాడులను అరికట్టాలని, ప్రేమోన్మాది చేతిలో మృతి చెందిన పొట్నూరు రూప కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యాన గురువారం తగరపువలసలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.ద్రాక్షాయని మాట్లాడుతూ మంటల్లో చిక్కుకున్న రూపను రక్షించే ప్రయత్నంలో మృతురాలి తమ్ముడు ఉపేంద్ర(15) కూడా మృత్యువుతో పోరాడి మరణించడం అత్యంత బాధాకరమన్నారు. మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, బ్లాక్‌మెయిలింగ్‌లు, కిడ్నాప్‌లు, ప్రేమ పేరుతో ఉన్మాదుల దాడులు, సైబర్ నేరాలు, వరకట్న హత్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కె.నాగరాణి మాట్లాడుతూ ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు అమల్లోకొచ్చిన తర్వాత మహిళలపై దోపిడీ, అణచివేత వికృత రూపం దాల్చుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.లక్ష్మి, సిఐటియు డివిజన్ నాయకులు ఎస్.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తే ఊరుకోం

సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి గఫూర్

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తే చూస్తూ ఊరుకోబోమని సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.ఎ.గఫూర్ హెచ్చరించారు. ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్న పరిశ్రమలను అభివృద్ధి చేయాల్సింది పోయి, కొత్త పరిశ్రమలను తీసుకొస్తామని చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నాయని ఎద్దేవా చేశారు. నవరత్న కంపెనీగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారానికి ఇప్పటిదాకా సొంతగనులు కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. సొంతగనులు లేని కారణంగా ఉత్పత్తి వ్యయం అధికమవుతోందని, దీంతో ప్లాంట్ ఆర్థికంగా నష్టపోతోందని చెప్పారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గనులు కేటాయించాలని కోరారు. విదేశీ ఉక్కు దిగుమతితో దేశీయ ఉక్కు పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాల రాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలపై ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 10న విజయవాడలో అన్ని ట్రేడ్ యూనియన్లు కలిపి రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహిస్తున్నాయని తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిఐటియు జాతీయ నాయకులు ఎన్.రామారావు, స్టీల్ సిఐటియు అధ్యక్షుడు జె.అయోధ్యరాం పాల్గొన్నారు.

రైతులు, నాయకులపై పోలీసుల జులుం

- వ్యర్థ జలాలను వదలొద్దన్నందుకు పైశాచికం
- అక్రమంగా నాయకుల అరెస్టు, విడుదల
- నెల్లూరు జిల్లా దేవిస్‌పేటలో ఉద్రిక్తత



కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొట్టేపాలెం చంద్రమౌళిని జీపులో ఎక్కిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఆక్వా పరిశ్రమల వ్యర్థ జలాలను పంటకాలువల్లోకి వదలొద్దని రైతు సంఘాలు చేపట్టిన ఆందోళన పోలీసుల జోక్యంతో ఉద్రిక్తతకు దారితీసింది. రైతులు, నాయకుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. అదేమని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేశారు. దాంతో గ్రామస్తులు తిరగబడ్డారు. నాయకులను, గ్రామస్తులను పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం విడుదల చేశారు. కొందరు నాయకులకు లోదెబ్బలు తగిలాయి. పోలీసుల దమన కాండను ఈసందర్భంగా రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం కౌలురైతు సంఘాల నాయకులు ఖండించారు. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం దేవిస్‌పేటలో ఫైవ్‌స్టార్, సాయిమెరైన్, స్టార్ ఆక్వా ప్రాసెసింగ్ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలను పంట కాలువల్లోకి వదులుతున్నారని రైతులు, గ్రామస్తులు రైతు సంఘాల నాయకులకు తెలిపారు. వారం క్రితం నాయకులు వెళ్లి గ్రామాన్ని పరిశీలించారు. ఆక్వా పరిశ్రమల వ్యర్థ జలాలతో గ్రామంలోని రైతులు, గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. పంట పొలాల్లోకి వ్యర్థాలను వదలకుండా చూడాలని ఆయా పరిశ్రమల యాజమాన్యాలను హెచ్చరించారు. పది రోజుల్లోగా పైపులను తొలగించకపోతే గ్రామస్తులతో కలిసి తాము వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. యాజమాన్యాలు స్పందించలేదు. దాంతో గ్రామస్తులు, రైతులు కలిసి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య, జిల్లా నాయకులు, డివైఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో ఆక్వా వ్యర్థజలాల పైపులను తొలగించేందుకు ప్రయత్నించారు. దాంతో పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. అదేమని ప్రశ్నించినందుకు వారిని అరెస్టు చేశారు. అభ్యంతరం చెప్పినవారిని బలవంతంగా కిందపడేసి ఈడ్చుకెళ్లారు. కిందేసి కాళ్లతో తొక్కి కర్కశంగా వ్యవహరించారు. ఆందోళన చేస్తే అణచివేస్తామని ఎస్ఐ బలరామిరెడ్డి అసభ్యకర పదజాలాన్ని ఉపయోగించారు. ఎస్ఐ అధికార మదంతో తమపై దౌర్జన్యానికి దిగారని, ఆక్వా యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని నాయకులు పేర్కొన్నారు. తొలుత గ్రామంలో రైతులు, గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున నాయకులు ప్రదర్శన నిర్వహించారు.

ప్రయివేట్ విద్యాసంస్థల రక్షణకు చట్టం తేవాలి



గుంటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రైవేటు విద్యాసంస్థల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని కోరుతూ ప్రైవేటు విద్యా సంస్థలు గురువారం చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ సంపూర్ణంగా జరిగింది. కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టారు. పలుచోట్ల ర్యాలీలు చేశారు. విజయనగరం జిల్లా ప్రైవేటు స్కూలు యాజమాన్యాలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవిఆర్ కృష్ణాజి, అధ్యక్ష, కార్యదర్శులు పాకలపాటి మురళి, శేఖర్‌లు మాట్లాడారు. కర్నూలు జిల్లాలో పదో తరగతి విద్యార్థిని ఓ ప్రైవేటు స్కూల్లో మరణిస్తే ప్రైవేటు స్కూలు యాజమాన్య సంఘం రాష్ట్ర కార్యదర్శి పులయ్య, జిల్లా సంఘం నాయకులు వెళితే విద్యార్థి సంఘం నాయకులు ఆసుపత్రి వద్ద దాడి చేసి, కారు అద్దాలను పగలు కొట్టడం దారుణమన్నారు. ఏలూరులో అపుస్మా ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. భీమడోలు జంక్షన్ వరకూ ప్లకార్డులతో ర్యాలీ చేసి, అక్కడ మానవహారం నిర్వహించారు. పాలకొల్లులో ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ చేశారు. ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్య సంఘాల రాష్ట్ర నాయకుడు రామారెడ్డిపై దాడిని నిరసిస్తూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, జగ్గంపేట ప్రాంతాల్లో బంద్ పాటించాయి. శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల జంక్షన్ నుంచి పొట్టి శ్రీరాముల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేశారు. కర్నూలు జిల్లాలో బంద్‌ను పాటించారు. గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయులు, యాజమాన్యాలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఆర్ఓ నాగబాబు, విద్యాశాఖ, పోలీసు అధికారులకు వినతిపత్రాలిచ్చారు. సత్తెనపల్లి, పిడుగురాళ్లలోనూ ప్రదర్శన నిర్వహించారు. విజయవాడలోని కొన్ని విద్యా సంస్థలు మాత్రమే సెలవులు ప్రకటించగా మిగిలిన కార్పొరేట్ విద్యా సంస్థలు యథావిధిగా పనిచేశాయి. ప్రయివేటు స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని 140 స్కూళ్లు సెలవు ప్రకటించాయి. కృష్ణాజిల్లాలో మచిలీపట్నం, గుడివాడ, విజయవాడ, నూజివీడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ప్రయివేటు విద్యాసంస్థలు బంద్ ప్రకటించడంతో మూతపడ్డాయి.

జీతాలు చెల్లించాలని న్యూట్రీషియన్ కౌన్సిలర్ల ధర్నా

ప్రజాశక్తి - నిజాంపట్నం (గుంటూరు జిల్లా)


ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ న్యూట్రీషియన్ కౌన్సిలర్లు గుంటూరు జిల్లా నిజాంపట్నం మండలం పల్లపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. కార్యాలయాన్ని సిఐటియు ఆధ్వర్యంలో ముట్టడించి తాళం వేసి సిబ్బంది లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీనిపై సిడిపిఒ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిజాంపట్నం ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఆందోళన విరమించకుంటే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కరించే వరకూ కదిలేది లేదని స్పష్టం చేస్తూ కౌన్సిలర్లు వర్షంలోనూ ఆందోళన కొనసాగించారు. దీంతో సిడిపిఒ, ఎస్ఐ ఉన్నతాధికారులను సంప్రదించారు. ఐసిడిఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీతో ఫోన్‌లో మాట్లాడారు. జీతాలను పదిరోజుల్లో విడుదల చేస్తామని జిల్లా పీడీ హామీనివ్వడంతో మధ్యాహ్నం 1.30 గంటలకు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సిఐటియు రేపల్లె డివిజన్ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ.. జీతాల కోసం మహిళలు రోడ్డుపైకి వచ్చేలా ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఏడాదిగా జీతాలివ్వకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. అధికారుల హామీ మేరకు జీతాలను విడుదల చేయకుంటే కార్యాలయాన్ని మళ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు.

రైల్వేను అమ్మకానికి పెడుతున్న కేంద్రం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం భారతీయ రైల్వేలను అమ్మకానికి పెడుతూ దేశ వ్యాప్తంగా 13 లక్షల మంది కార్మికుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. రన్నింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ విజయవాడ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని డిఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాజమండ్రి, బిట్రగుంట, విజయవాడ ప్రాంతాలకు చెందిన కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. ధర్నాలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కీలకమైన రైల్వేలను లీజు అమ్మకాలు, ఎఫ్‌డిఐ, పిపిపి ద్వారా విదేశీ, స్వదేశీ బడా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. రైల్వే కార్మికులకు నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని, స్పాడ్ కేసుల విషయంలో ఉద్యోగం నుంచి తొలగింపు విధానానికి స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ అసోసియేషన్ డివిజనల్ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. నాగపూర్‌లో జరిగిన సెంట్రల్ వర్కింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికనుగుణంగా దేశ వ్యాప్తంగా అన్ని డివిజనల్ రైల్వే మేనేజర్ల కార్యాలయాల ఎదుట డిమాండ్స్ డే (కోర్కెల దినం)గా నిరసన ధర్నాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం డిఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ డివిజనల్ అధ్యక్షులు ఎం.వెంకటేశన్, జోనల్ ప్రధాన కార్యదర్శి ఎస్.గురుమూర్తి, గార్డ్స్ కౌన్సిల్ డివిజనల్ కార్యదర్శి బిసిఎస్ ప్రసాద్, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.సుబానీ, ఈస్ట్ కోస్ట్ రైల్వే యూనియన్ గౌరవాధ్యక్షులు వివిఎల్.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టరును ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

విభజన హామీలపై 27న రాష్ట్ర స్థాయి సదస్సు

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన చట్టంలోని హామీలను నేరవేర్చాలని, రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈ నెల 27న విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సదస్సు పోస్టర్‌ను స్థానిక శ్రీశ్రీ భవన్‌లో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన చట్ట ప్రకారం రాష్ట్రంలో రైల్వేజోన్, కడపలో ఉక్కు పరిశ్రమ, శ్రీకాకుళం నుండి చెన్నై వరకు పారిశ్రామిక కారిడార్, అనంతపురంలో సెంట్రల్, విజయనగరంలో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తామని కేంద్రప్రభుత్వం హామీలిచ్చిందని గుర్తు చేశారు. వీటన్నిటి వల్లా రాష్ట్రంలోని యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగం తార స్థాయికి చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేసిందని, దీనికి టిడిపి కూడా వంత పాడుతోందని విమర్శించారు. ఇటీవల కేంద్ర మంత్రి మండలి ఎనిమిది రాష్ట్రాలకు హోదా పునరుద్ధరించిందని, వాటికి లేని అడ్డంకులు ఏపికి ఎందుకో చెప్పాలని ప్రశ్నించారు. వెంటనే హోదా ఇచ్చి ఆంధ్రప్రజల మనోభావాలను నిలబెట్టాలని డిమాండ్ చేశారు. యూత్ పాలసీ తీసుకొస్తామని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి టిడిపి అధికారంలోకి వచ్చిందని, తరువాత వీటిని మరచిపోయిందని విమర్శించారు. ఉద్యోగాల కల్పన , విద్యాసంస్థల్లో ఎన్నికలు, కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాలు వంటి అంశాలో స్పష్టత ఉండాలని కోరారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో.. ప్రభుత్వం నిర్లక్ష్యం: సిపిఎం

ప్రజాశక్తి - పాలకొండ (శ్రీకాకుళం జిల్లా)

వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి తెలిపారు. రెండు వేల మంది పోలీసులతో నిర్వాసితులను, వారి పోరాటాలను అడ్డుకుని పనులు చేయించడం దుర్మార్గమన్నారు. గురువారం శ్రీకాకుళం జిల్లా పాలకొండలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంశధార నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, 2013 చట్టం ప్రకారం పరిహారం అందించాలని సుప్రీం కోర్టు ఆదేశాలున్నాయని గుర్తు చేశారు. పునరావాసం, ప్యాకేజీ ఇవ్వకుండా వారిని వెళ్లగొడుతున్నారని విమర్శించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే నిర్వాసితులపై లాఠీఛార్జికి పాల్పడారన్నారు. ఆయనతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, దావాల రమణారావు ఉన్నారు.

'శ్రీ జన్' స్కామ్‌పై సిబిఐ దర్యాప్తు

స్వచ్ఛంద సంస్థ కార్యాలయం సీజ్



పాట్నా: బీహార్‌లో తాజాగా వెలుగులోకి వచ్చిన శ్రీజన్ కుంభకోణం కేసును సిబిఐ స్వీకరించింది. సుమారు రూ. వెయ్యి కోట్లు అక్రమ లావాదేవీలకు సంబంధించిన ఈ కేసులో దర్యాప్తుకు ఆదేశిస్తూ సిబ్బంది వ్యవహారాల శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మరోవైపు భాగల్‌పూర్ జిల్లాలోని శ్రీ జన్ మహిళా సహయోగ్ సమితి అనే స్వచ్ఛంధ సంస్థ కార్యాలయాన్ని అధికారులు గురువారం సీజ్ చేశారు. ఇందులో కుంభకోణానికి సంబంధించిన ఫైళ్లు వున్నట్లు సమాచారం. 2007-13 మధ్యలో బీహార్ ప్రభుత్వ ఖజానా నుంచి సుమారు రూ. వెయ్యి కోట్లు శ్రీజన్ సంస్థ ఖాతాల్లోకి అక్రమంగా తరలించినట్లు ఆరోపణలొచ్చాయి. ఆ సమయంలో బిజెపి నేత సుశీల్ మోడీ ఆర్థిక మంత్రిగా ఉన్నారని, దీనికి బాధ్యత వహిస్తూ సిఎం నితీశ్, డిప్యూటీ సిఎం సుశీల్ కుమార్‌లు రాజీనామా చేయాలని ఆర్జేడీ నేతలు డిమాండ్ చేశారు. అయితే 2003 నుంచే శ్రీజన్ సంస్థ ఖాతాల్లోకి పెద్ద మొత్తంలో డబ్బు చేరిందని, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ భార్య రబ్రీ దేవి ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్నారని బిజెపి నేతలు పేర్కొన్నారు. దీంతో ఈ కేసులో దర్యాప్తునకు నితీశ్ కుమార్ గత వారం ఆదేశించిన సంగతి తెలిసిందే.

రైల్వే బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అశ్వని లోహని



న్యూఢిల్లీ : రైల్వే బోర్డు నూతన చైర్మన్‌గా అశ్వని లోహని బాధ్యతలు స్వీకరించారు. భద్రతకు, స్టేషన్ల ఆధునీకరణకు ప్రాధాన్యత ఇస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అపరిశుభ్రత, విఐపి సంస్కృతి, అవినీతిని అంతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఎయిర్ ఇండియాలో రెండేళ్లు పని చేసిన అశ్వని, ఎకె మిటల్ రాజీనామా చేయడంతో రైల్వే బోర్డు చైర్మన్‌గా నియమించబడ్డారు. ఈ నెల 19న ముజఫర్‌నగర్ వద్ద కళింగ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనలో 22 మంది మృతి చెందగా, బుధవారం అయిరియా వద్ద కైఫియత్ ఎక్స్‌ప్రెస్‌కు జరిగిన ప్రమాదంలో 70 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాలకారణంగా ఎకె మిటల్ రాజీనామా చేశారు. 1980 బ్యాచ్ అధికారి అయిన లోహని 2007లో నాలుగు ఇంజనీరింగ్ డిగ్రీలు పొంది లిమ్కా రికార్డుల్లో చోటు సాధించారు. 1998లో ప్రపంచంలోనే ప్రాచీన అవిరి యంత్రాన్ని నడిపి గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోనూ స్థానం దక్కించుకున్నారు. 1996లో రైల్వే నేషనల్ అవార్డును కూడా సాధించారు. యునెస్కో ప్రపంచ హెరిటేజ్ సైట్‌లో డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే నామినేషన్ పొందడంలో లోహని కృషి ఎంతో వుంది. రైల్వే మ్యూజియంకు, భారత పర్యాటక అభివృధి కార్పొరేషన్ చైర్మన్‌గానూ లోహని పనిచేశారు. రైల్వే చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన లోహనికి రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభు ట్విట్టర్ ద్వారా స్వాగతం పలికారు.

స్వదేశంలోనే యుద్ధ హెలికాప్టర్ల తయారీ

హెచ్‌ఎఎల్‌లో యూనిట్‌ను ప్రారంభించనున్న జైట్లీ



బెంగళూరు: సాధ్యమైనంత వేగంగా సైన్యం అవసరాలను భర్తీ చేసేందుకు భారత్‌లోనే హెలికాప్టర్ల తయారీ త్వరలో ప్రారంభం కానుంది. 15 తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల తయారీకి తొమ్మిది నెలల క్రితం రక్షణ పరికరాల సమకూర్పు కమిటీ(డిఎసి) ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్(హెచ్‌ఎఎల్)లో హెలికాప్టర్ల ఉత్పత్తి యూనిట్‌ను ప్రభుత్వం ప్రారంభించనుంది. రక్షణ మంత్రి అరుణ్‌జైట్లీ శనివారం సాయంత్రం ఆరు గంటలకు ఈ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. దీని కోసం రూ.2,911 కోట్లను రక్షణ శాఖ కేటాయించింది. దేశీయంగా రూపొందిన, అభివృద్ధిపరిచిన ఆయుధాల కేటగిరీలో వీటిని తయారు చేయనున్నట్లు హెచ్‌ఎఎల్ అధికారులు చెప్పారు. ఆయుధ నియంత్రణను పైలట్, కోపైలట్ మధ్య అనుసంధానించేలా వ్యవస్థను రూపకల్పన చేశామని పేర్కొన్నారు. 5.8 టన్నుల సామర్థ్యముండే ఈ హెలికాప్టర్‌లో అధునాతన సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలిపారు. 20మిమీ టరెట్ గన్, 70మిమీ తుపాకీ, గాల్లోనే లక్ష్యాలను ఛేదించే క్షిపణి, హెల్మెట్ పాయింటింగ్ వ్యవస్థలు కూడా ఇందులో ఉంటాయని హెచ్‌ఎఎల్ పరిశోధక శాస్త్రవేత్తలు చెప్పారు.

జోనల్ విధానంపై వెల్లువెత్తుతున్న నిరసన

న్యూఢిల్లీ: దేశంలో అత్యున్నత స్థాయి ఉద్యోగాల్లో జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రతిపాదించడంతో పలువురు విశ్రాంత, ప్రస్తుత ఐఎఎస్‌ల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. కొత్త విధానంలో 26 కేడర్లకు బదులుగా ఐదు జోనల్‌ను ఏర్పాటు చేశారు. ఎన్‌డిఎ 'వన్ నేషన్' విధానంలో ఇది భాగంగా ఉంది. ఈ విధానంలో వారి కెరీర్ మొత్తం ఒకే జోన్‌లో పనిచేయాల్సి ఉంటుంది. ఖచ్చితంగా ఇది సమూల మార్పు అయినప్పటికీ సంస్కరణ పరిధి సక్రమంగా లేదు అని యుపిఎ హయాంలో కేబినేట్ కార్యదర్శిగా పనిచేసిన బి.కె.చతుర్వేది పేర్కొన్నారు. ఇక కొత్త జోనల్ విధానంపై మాజీ హోంశాఖ కార్యదర్శి గోపాలకృష్ణ పిళ్లై మాట్లాడుతూ దక్షిణ భారతదేశ అధికారులు అదే ప్రాంతానికి చెందిన జోన్‌లు, ఉత్తర భారతదేశంలోని అధికారులు అదే ప్రాంతానికి చెందిన జోన్‌లను ఎన్నుకోవడం వల్ల సంకుచిత తత్వం అలవడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో అత్యున్నత స్థాయి అధికారుల్లో భారీ మార్పులు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కొత్త విధానం రాజకీయ నాయకులు, ఉద్యోగులకు మధ్య వైషమ్యాలను తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత కేడర్ విధానంలో ఉన్న సానుకూలతలను నూతన విధానం హరించేస్తుందని మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక సీనియర్ ఐఎఎస్ అధికారి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి పి.ఉమాశంకర్ మాట్లాడుతూ నూతన విధానం సివిల్స్‌లో పెద్ద సంస్కరణేమి కాదనీ, అధికారులు ఏ జోన్‌లు ఎన్నుకోవాలో తెలియజేస్తుందని అన్నారు.

అసమ్మతి ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసులు

దినకర్ శిబిరంపై వేటుకు స్పీకర్ సిద్ధం

చెన్నై: అన్నాడిఎంకెలోని దినకరన్ శిబిరంలోని 19 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పార్టీ విప్ ఎస్.రాజేంద్రన్ అసెంబ్లీ స్పీకర్‌ను కోరారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు చేపడుతున్న నేపథ్యంలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కాగా దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా స్పీకర్ ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. ఆ ఎమ్మెల్యేలు పళనిస్వామి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించారని రాజేంద్రన్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 14న పళనిస్వామిని అన్నాడిఎంకె శాసనసభ పక్షనేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారనీ, ఇందులో ఏ మార్పు లేదని అన్నారు. ఇలా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న శాసనసభ్యులను రాజ్యాంగం ప్రకారం అనర్హులుగా ప్రకటించాలన్నారు. 19 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఆయన లేఖ సమర్పించారు. వారు గవర్నర్‌ను కలవడం కూడా ఏకపక్షంగా సాగిపోయిందనీ, వారు తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. పళనిస్వామి, పన్నీరు సెల్వం ఒక్కటైన వెంటనే దినకరన్ శిబిరం తిరుగుబాటు బావుటా ఎగరవేసిన సంగతి తెలిసిందే.

వరద ముంపు ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు

ఏఐకేఎస్ డిమాండ్

న్యూఢిల్లీ : తీవ్ర వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలని ఆలిండియా కిసాన్‌సభ (ఏఐకేఎస్) డిమాండ్ చేసింది. తీవ్ర వరద ప్రభావానికి గురైన బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 749 మంది మృతిచెందారని తెలిపింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రత్యేకంగా బీహార్, పశ్చిమబెంగాల్, అసోం, తూర్పు యూపీలలోని అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. తీవ్ర వరద పరిస్థితుల్లో సాధారణ జీవితం అస్తవ్యస్థమైంది. త్రిపుర, మణిపూర్, అరుణాచరల్ ప్రదేశ్ వంటి ఈశాన్య రాష్ట్రాలు కూడా వరద ప్రభావానికి గురయ్యాయి. ఈ రాష్ట్రాల్లోనూ మరణాలు సంభవించాయి. వేలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. ఒక్క బీహార్‌లోనే ఆగస్టు 22 నాటికి 361 మంది మృతిచెందారనీ, పశ్చిమబెంగాల్‌లో 152, అసోంలో 154, తూర్పు యూపీలో 82 మంది చనిపోయారనీ ఏఐకేఎస్ పేర్కొంది. కాగా, ప్రధాన స్రవంతి జాతీయ మీడియాలో వరద పరిస్థితుల తీవ్రత గురించి పెద్దగా వార్తలు రాలేదని అభిప్రాయపడింది. వరద నీట మునిగిన ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని, ఈ నాలుగు రాష్ట్రాల్లోనే దాదాపు 3.42 కోట్ల మంది డెంగ్యూ బారిన పడినట్టు తెలిపింది. ఒక్క బీహార్‌లోనే దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూమి నీటి మునిగిందని పేర్కొంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం.. 4.38 లక్షల మంది ప్రజలు సహాయక శిబిరాల్లో ఆశ్రయం పొందగా, ఇందులో బీహార్‌లో శిబిరాల్లో ఉన్న వారి సంఖ్య 3.27 లక్షలు. అసోంలో 68 వేల మంది ప్రజలు ఇంకా సహాయ శిబిరాల్లోనే తలదాచుకుంటున్నట్టు ఏఐకేఎస్ తెలిపింది. తీవ్ర వరద పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రాంతాలను ఆదుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని విమర్శించింది. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు సిద్ధమై ఉంటే, ఇన్ని మరణాలు సంభవించేవికావని ఆరోపించింది. రుతుపవనాల సీజన్ ప్రారంభమైన తొలి దశలో మే-జులైలో దేశవ్యాప్తంగా దాదాపు 700 మంది మరణించారని గుర్తు చేసింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కదిలి యుద్ధప్రాతిపదికన సహాయకచర్యలను చేపట్టాలని డిమాండ్ చేసింది. జాతీయ విపత్తుగా ప్రకటించి వరదల్లో మృతిచెందిన వారి కుటుంబానికి రూ. 5 లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.2 లక్షలు చెల్లించాలని కోరింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సమాచార వ్యవస్థలను వెంటనే పునరుద్ధరించాలని, బాధితులకు ఆహారం, బట్టలు సరఫరా చేయాలని డిమాండ్ చేసింది.

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

న్యూఢిల్లీ: రాయ్‌పూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరతతో నలుగురు శిశువులు మరణించిన ఘటనపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి జాతీయ మానవహక్కుల సంఘం(ఎన్‌హెచ్‌ఆర్‌సి) గురువారం నోటీసులు జారీ చేసింది. అంబేద్కర్ ఆసుపత్రిలో నవజాత శిశువలు ఆక్సిజన్ కొరతతో ఆదివారం మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై నాలుగు వారాల్లోగా పూర్తి వివరణతో కూడిన నివేదిక అందించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆ నోటీసుల్లో పేర్కొంది. యుపిలోని బిహెచ్‌ఆర్‌డి కళాశాల ఆసుపత్రిలోనూ ఇటీవల ఆక్సిజన్ కొరతతో 80మందికిపైగా మరణించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇది జరిగిన కొన్ని రోజులకే ఛత్తీస్‌గఢ్‌లోనూ ఇదే తరహా ఘటన పునరావృతమవడంపై ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు కూడా నోటీసులు జారీ చేసింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో ఆక్సిజన్ కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొంది.

167 మహిళా స్టడీ సెంటర్స్‌కు నిధులు నిలిపివేత

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో వున్న 167 మహిళా స్టడీ సెంటర్స్‌కు సెప్టెంబరు 30 నుంచి యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిధులు నిలిపివేయనుంది. ఈ స్టడీ సెంటర్ల భవిష్యత్‌పై ఇండియన్ వుమెన్ స్టడీస్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. మహిళా విద్యకు ప్రోత్సాహకంగా ఆరవ పంచవర్ష ప్రణాళికలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. యుజిసి ప్రత్యేక నిధులతో ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబరు 30 నుంచి ఈ కేంద్రాలకు నిధులు నిలిపివేస్తున్నట్లు మార్చి 29న యుజిసి ప్రకటించింది. ఈ నిర్ణయంపై బుధవారం జరిగిన జాతీయ సమావేశంలో అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. నిధులను కొనసాగించాలని యుజిసికి విజ్ఞప్తి చేసింది.

టోల్ ప్లాజాను దోచుకున్న పోలీసులు

- సిబ్బందిపైనా దాడి



ఆగ్రా: దోపిడీలను అరికట్టాల్సిన పోలీసులే బరితెగించి దోపిడీకి తెగబడ్డారు. ఆరుగురు పోలీసులు ఢిల్లీ-ఆగ్రా జాతీయ రహదారి నంబరు 2లో వున్న ఒక టోల్ ప్లాజా సిబ్బందిపై దాడి చేసి కౌంటర్‌లోని సొమ్మును దోచుకున్నాను. ఆ దృశ్యాలు సిసి ఫుటేజీలో నమోదయ్యాయి. ఈ ఘటనపై ఆ ప్లాజా అసిస్టెంట్ మేనేజర్ ఒపి యాదవ్ మాట్లాడుతూ సర్కిల్ అధికారి సహా ఆరుగురు పోలీసులు బుధవారం రాత్రి ప్లాజా సిబ్బందిపై దాడి చేసి సొమ్ము దోచుకుపోయారనీ, దీనికి సంబంధించిన ఫిర్యాదుతో పాటు సిసిటివి రికార్డులను పోలీసులకు అందజేశామని తెలిపారు. అయితే ఈ ఆరోపణలను సిఒ నితిన్ సింగ్ ఖండించారు. తాను పెట్రోలింగ్ విధుల్లో ఉండగా టోల్ ప్లాజాలో ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని తనకు ఫిర్యాదు అందిందనీ, దీనిపై తాము కేసు కూడా నమోదు చేశామన్నారు. విధుల్లో ఉన్న మేనేజర్ వినయ్ యాదవ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తున్నాం

బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఈఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బిశ్వాస్ తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో మోడీ తీసుకొస్తున్న సంస్కరణలన్నీ అనాలోచితమైనవని విమర్శించారు. జీఎస్టీ ప్రభావంతో బ్యాంక్ ఖాతాదారులపై సర్వీస్ చార్జీలను పెంచడం తగదన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొంది ఎగవేతకు పాల్పడుతున్న పారిశ్రామికవేత్తలపై, వ్యాపారులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. బ్యాంకు రుణాల ఎగవేతకు పాల్పడ్డవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బిశ్వాస్ డిమాండ్ చేశారు. మొండి బకాయిల వసూళ్ల కోసం పార్లమెంటరీ కమిటి సూచించిన ప్రతిపాదనలను అమలు చేయాలని కోరారు. బ్యాంక్ బోర్డు బ్యూరో విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీన ప్రతిపాదనను యునైటెడ్ మూవెంట్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ (యూఎఫ్‌బీయూ) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు మంగళవారం దేశవ్యాప్తంగా బ్యాంకుల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్న సంగతి తెలిసిందే. వచ్చేనెల 15న ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్టు యూఎఫ్‌బీయూ ప్రకటించింది. ఇదిలా ఉండగా, పీఎస్‌బీ విలీన ప్రక్రియ కోసం మంత్రుల కమిటీతో ప్రత్యామ్యాయ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

శబ్దకాలుష్య కేసును మరో బెంచికి బదలాయించండి

బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం వినతి



ముంబయి: శబ్దకాలుష్యానికి సంబంధించిన కేసుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా డివిజన్ బెంచ్ పక్షపాతంగా వ్యవహరిస్తోందనీ, ఈ కేసులను మరో బెంచ్‌కు బదలాయించాలని మహారాష్ట్ర ప్రభుత్వం గురువారం బాంబె హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కోరింది. ఆ మేరకు ప్రభుత్వ తరపు న్యాయవాది జనరల్ అశుతోష్ కుంభకోణి చీఫ్ జస్టిస్‌కు పిటిషన్ దాఖలు చేశారు. డివిజన్ బెంచ్‌లోని ఎఎస్ ఒకా, రియాజ్ చాగ్లాపై ఆయన ఆరోపణలు గుప్పించారు. దీనిపై బెంచ్‌లోని న్యాయమూర్తులు షాక్‌కు గురయ్యారు. పిటిషన్‌లోని విషయాన్ని తెలుసుకొని తాము నిజంగా షాక్‌కు గురయ్యామనీ, తమకు వ్యతిరేకంగా ఆరోపణలున్నాయనీ ఎఎస్‌ఒకా పేర్కొన్నారు. అయితే తమను రెచ్చగొట్టే అలాంటి ఆరోపణలతో సంయమనం కోల్పోమన్నారు. ఈ కేసుకు సంబంధించి చీఫ్ జస్టిస్‌ను కలవాల్సిందిగా బెంచి ప్రభుత్వానికి సూచిస్తుందన్నారు. అయితే ప్రభుత్వం కూడా సాధారణ లిటిగెంట్‌గా వ్యవహరిస్తూ తమకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసిందని ఎఎస్ ఒకా పేర్కొన్నారు. ధ్వని కాలుష్య నివారణ చట్టాలను కఠినంగా అమలుచేయాలని పిటిషన్‌లు దాఖలయ్యాయనీ, వాటిపై ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కోర్టు తీర్పు వెనకగల ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొని ఉండాల్సిందని ధర్మాసనం పేర్కొంది. పాఠశాలలు, కోర్టులు, తదితర సముదాయాలున్న ప్రాంతాల్లో శబ్దకాలుష్యం లేకుండా చూడాలని గతంలో కోర్టు ఆదేశించింది.

బాలిక చేయి నరికిన ఉన్మాది

యూపీలో దారుణం

లక్నో: ప్రేమను అంగీకరించక పోవడంతో పాటు లైంగికదాడి యత్నాన్ని తిప్పి కొట్టిందన్న అక్కసుతో అందరూ చూస్తుండగానే బాలిక చేయి నరికాడు ఓ దుర్మార్గుడు. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ జిల్లాలో చోటు చేసుకున్నది. ఎస్పీ ఎస్. చెన్నప్ప వెల్లడించిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ఫతేపూర్ ప్రాంతానికి చెందిన రోహిత్ చౌహారియా.. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలిక(15)ను కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం బాలిక సెల్‌ఫోన్ చార్జర్‌ను రోహిత్ దొంగిలించాడు. చార్జర్ కావాలంటే తన ఇంటికి రావాలంటూ ఒత్తిడి చేశారు. కాగా అతడి నివాసానికి వెళ్లిన బాలికపై రోహిత్ అఘాయిత్యానికి యత్నించాడు. దీన్ని ప్రతిఘటించి బాలిక బయటకు పరుగులు తీసింది. కోపోద్రిక్తుడైన రోహిత్ కత్తి తీసుకొని ఆమెను వెంబడించి చేయి నరికాడు. ఘటనలో తల, మరో చేతికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని హుటాహుటిన జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం లక్నోకు తరలించారు. వైద్యులు తీవ్రంగా శ్రమించి బాధితురాలి చేయిని తిరిగి అతికించారు. మరోవైపు.. నిందితుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

కర్ణాటకలో వేడి పుట్టిస్తున్న సర్వేలు

కాంగ్రెస్‌కే ఆధిక్యం : సి ఫోరం

బెంగళూరు: వచ్చే ఏడాది ప్రథమార్ధంలో జరగబోయే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఇప్పటి నుంచే వరుసగా వెల్లడౌతున్న సర్వేలు రాజకీయంగా వేడి పుట్టిస్తున్నాయి. ఇటీవల సి ఫోరం అనే ప్రయివేటు సంస్థ ఓటర్ల నాడిపై సర్వే నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం కాంగ్రెస్ అధికారంలోకి రానున్నట్లు సి ఫోరం తెలిపింది. కాంగ్రెస్‌కు గరిష్టంగా 115 నుంచి 120 సీట్లు వస్తాయని, బిజెపి 70 సీట్లు మించి రావని, జెడిఎస్‌కి 25 సీట్లు వచ్చే అవకాశముందని పేర్కొంది. అయితే ఈ సర్వేపై జెడిఎస్ నేతలు విమర్శలు చేశారు. సి ఫోరం సంస్థ కర్ణాటక సిఎం సిద్ధరామయ్య సన్నిహితునికి చెందిందని, అందుకే ఆయనకు అనుకూలంగా సర్వే ఫలితాలు ప్రకటించిందని పేర్కొంది. అయితే ఇటీవల బిజెపి జాతీయాధ్యక్షుడు అమిత్ షా కర్ణాటకలో పర్యటించిన సందర్భంగా నిర్వహించిన సర్వేలోనూ బిజెపికి 70కి మించి సీట్లు రావని తేలినట్లు సమాచారం. అమిత్‌షాకు అత్యంత సన్నిహితులు ఈ సర్వే నిర్వహించడం విశేషం. దీనికి తోడు తాజాగా రెండు నియోజకవర్గాలకు జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించడంతో కాంగ్రెస్ గెలుపుపై ధీమాగా ఉంది.

బిజెపి, జెడిఎస్‌లకు వరుస షాక్‌లు

కాంగ్రెస్ మరోసారి గెలుస్తుందని సర్వేలు తేల్చిచెప్పడంతో బిజెపి, జెడిఎస్‌లు తమ వ్యూహాల్ని మార్చాయి. ప్రభుత్వాన్ని రాజకీయంగా దెబ్బకొట్టేందుకు యత్నిస్తున్నాయి. దీంతో సిద్ధరామయ్య ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలను ప్రధానాస్త్రంగా మార్చుకోవాలని భావిస్తున్నాయి.

అయితే ఈ ప్రయత్నాల్లో బిజెపి, జెడిఎస్‌లకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. అర్కావతి లేఅవుట్ డీనోటిఫికేషన్ స్కామ్‌పై దర్యాప్తు చేయాలని ప్రతిపక్ష పార్టీలు ఒత్తిడి తెచ్చాయి. అయితే ఇందులో అధికారులు చేసిన చిన్న తప్పులు మినహా రాజకీయ నేతల ప్రమేయమేమీ లేదని జస్టిస్ కెంపన్న కమిషన్ తేల్చి చెప్పింది. దీంతో డిఎస్‌పి గణపతి ఆత్మహత్య కేసును తెరపైకి తీసుకొచ్చింది. ఈ కేసులో మంత్రి కెజె జార్జ్ ప్రధాన నిందితుడు కావడంతో సాక్ష్యాలు రూపుమాపేందుకు ఫోరెన్సిక్ నివేదికను దాచిపెట్టారని బిజెపి, జెడిఎస్‌లు ఆరోపించాయి. అయినప్పటికీ సిద్ధరామయ్య ప్రభుత్వం దీనిపై పెద్దగా స్పందించకపోవడంతో ఈ రెండు పార్టీలు పోటాపోటీగా ఎత్తుగడలు వేస్తున్నాయి.

కాంగ్రెస్ నేతల నివాసాలపై ఇడి దాడులు

సాయంత్రం వరకూ కొనసాగిన సోదాలు

న్యూఢిల్లీ: దేశరాజధానిలోని కాంగ్రెస్ నేతల నివాసాలపై ఎన్‌ఫోర్స్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు దాడులు నిర్వహించారు. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం(ఫెమా) కింద గురువారం ఈ దాడులు జరిగినట్లు సమాచారం. ఢిల్లీ మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే సుమేష్ షోకీన్ ఇంటితో సహా నగరవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో ఇడి అధికారులు సోదాలు నిర్వహించారు. సాయంత్రం వరకూ దాడులు కొనసాగినట్లు సమాచారం.

హర్యానా, పంజాబ్‌లో భద్రత కట్టుదిట్టం

రామ్ రహీమ్ సింగ్ లైంగిక వేధింపుల కేసులో నేడు తీర్పు

చండీగఢ్: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్‌పై లైంగికవేధింపుల కేసుకు సంబంధించి తీర్పు వెలువడనున్న నేపథ్యంలో హర్యానా, పంజాబ్, చండీగఢ్‌లలో భద్రతను కట్టుదిట్టం చేశారు. గుర్మీత్ రామ్ రహీం సింగ్‌పై నమోదైన లైంగిక వేధింపుల కేసులో పంచకులలోని సీబీఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. వేల సంఖ్యలో ఆయన మద్దతుదారులు ఇప్పటికే పంచకులకు చేరుకున్నారు. దీంతో నగరంలో దాదాపు ఐదు వేల మంది పోలీసులను మోహరించారు. రామ్ రహీం సింగ్‌కు వ్యతిరేకంగా తీర్పు వస్తే పెద్దఎత్తున హింసాత్మక ఘటనలు చోటుచేసుకునే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సైనిక బలగాలతో చర్చలు జరిపింది. రెండు రాష్ట్రాల్లో 150 కంపెనీల పారామిలటరీ బలగాలను రంగంలోకి దించారు. పంచకులలో పాఠశాలలు, కళాశాలలకు బుధవారం నుంచి శనివారం వరకూ సెలవు ప్రకటించారు. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను రద్దుచేశారు. డ్రోన్‌ల సహాయంతో నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

యూపీ ఎన్‌కౌంటర్‌లో ఎస్ఐ మృతి


ముగ్గురు దోపిడీ దొంగల అరెస్టు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో పోలీసులకు, దోపిడీ దొంగలకు మధ్య గురువారం భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఎస్ఐ ప్రాణాలు కోల్పోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎట్టకేలకు ముగ్గురు దోపిడీ దొంగలను బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. బుందేల్‌ఖండ్ రీజియన్‌లో బందిపోటు బాబ్లీకోల్ ముఠా కొన్నేండ్లుగా అక్రమాలు, అరాచకాలకు తెగబడుతున్నది. బాబ్లీ కోల్ తలపై ప్రభుత్వం రూ.5 లక్షల రివార్డు కూడా ప్రకటించింది. ఇదిలా ఉండగా చిత్రకూట్ జిల్లాలోని నిహీ చిరాజ్య అటవీ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున బాబ్లీ కోల్ ముఠా సభ్యులకు, పోలీసులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో చిత్రకూట్ జిల్లాకు చెందిన పోలీసు బృందాలు పాల్గొన్నాయి. కాగా ఎదురుకాల్పుల్లో బుల్లెట్ గాయాలై ఎస్ఐ జై ప్రకాశ్‌సింగ్ ప్రాణాలు కోల్పోయారు. మరో ఎస్ఐకి తీవ్ర గాయాలయ్యాయి. అయితే దోపిడీ దొంగలను పట్టుకునేందుకు స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) బలగాలు రంగంలోకి దిగాయి. ముఠాలో కీలక వ్యక్తి అయిన రాజు కోల్‌తో సహా ముగ్గురిని అరెస్టు చేశాయి. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు దోపిడీ దొంగలకు కూడా బుల్లెట్ గాయాలైనట్టు పోలీసు అధికారి ఎస్ఎన్ సాబాత్ వెల్లడించారు.

రూ.2 వేల నకిలీ నోట్లు స్వాధీనం

బెంగాల్‌లో ముగ్గురి అరెస్టు

కోల్‌కతా: బెంగాల్ రాజధాని కోల్‌కతాలో పెద్ద ఎత్తున రూ.2000 నకిలీ నోట్లను స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. నకిలీ కరెన్సీని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఈ మేరకు అరెస్టు చేశారు. సీజ్ చేసిన కరెన్సీ విలువ రూ.9.46 లక్షలు ఉంటుందని వెల్లడించారు. అరెస్టయిన వారు.. మాల్దా జిల్లాకు చెందిన ఆలమ్ షేక్, గోలప్ షేక్, సెరౌల్ షేక్‌లుగా గుర్తించినట్టు ఎస్‌టీఎఫ్ డిప్యూటీ కమిషనర్ మురళీధర్ శర్మ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి తమ కస్టడీకి అప్పగించాలని కోరుతామని ఆయన వివరించారు. వారిని ప్రశ్నిస్తే నకిలీ కరెన్సీ రాకెట్‌కు సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకొస్తాయని చెప్పారు.



విడుదలకు ముందే బయటకు వచ్చిన రూ. 50 నోటు

ముంబయి : రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా తర్వలో విడుదల చేయనున్న కొత్త రూ. 50 నోటు విడుదల చేయకుండానే బయటకు వచ్చింది. ముంబయిలో ఒక వ్యక్తి వద్ద దీన్ని స్వాధీనం చేసుకున్నారు. మహాత్మ గాంధీ న్యూ సిరీస్‌లో భాగంగా కొత్త రూ. 50 నోటును త్వరలో విడుదల చేయనున్నట్లు గతంలోనే రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. కొత్త రూ. 50 నోటులో వెనకవైపున హంపీ రథం ముద్రించబడి వుంది. నోటు ఫ్లోరెసెంట్ బ్లూ కలర్‌లో వుంది. 66 మీ.మీ+135 మీ.మీ సైజులో వుంది. కాగా, గత నెలలోనే రూ. 50. రూ. 200 నోట్ల చిత్రాలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఈ నెల 25న కొత్త రూ. 200 నోటును విడుదల చేయనున్నారు.

మకావులో తుపాను, వరదలు

16మంది మృతి

మకావు : దక్షిణ చైనాలోని మకావులో తుపాను, వరదల కారణంగా 16మంది మరణించగా, 150మందికి పైగా గాయపడ్డారు. హటో తుపాను ప్రభావంతో ఈదురుగాలులు వీస్తున్నాయని, కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ఆకస్మికంగా వరదలు సంభవించడంతో నష్టం ఎక్కువగా వుందని మకావు ఎంపి జోస్ పెరిరా తెలిపారు. తుపాను తర్వాత ఇప్పటికీ విద్యుత్, తాగడానికి నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పూర్వపు పోర్చుగీస్ కాలనీ అయిన మకావు పాత బసీలో ఇరుకు రోడ్లు కావడంతో అక్కడ వరద పరిస్థితి మరింత అధ్వాన్నంగా వుందన్నారు. నీళ్ళలో ఈదుతున్న ప్రజలు సాయం కోసం ఎదురుచూస్తున్నారని, ఎక్కడా బోట్లు లేవని, వరద ఒక్కసారిగా ముంచెత్తడంతో ప్రజలు నిస్సహాయ స్థితిలో పడిపోయారని తెలిపారు. నగర అధికార యంత్రాంగం సరిగా స్పందించడం లేదని ఆయన విమర్శించారు. యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రభుత్వ చీఫ్ ఎగ్జిక్యూటివ్ చూయి సై అధికారులను ఆదేశించారు. రోడ్లపై కూలిన చెట్లు, సగం వరకు నీళ్లలో మునిగిన బస్సులు, ఈదుతున్న ప్రజలతో పరిస్థితి చాలా భయంకరంగా వున్నట్లు టివి ప్రసారాల ద్వారా వెల్లడవుతోంది.

ఫుకుషిమా సంస్థపై కేసు దాఖలు చేసిన అమెరికన్లు

500కోట్ల డాలర్ల నష్టపరిహారానికై డిమాండ్

ఫుకుషిమా : ఆరేళ్ళ క్రితం సంభవించిన ఫుకుషిమా అణు ప్రమాదంపై మరో కేసును ఎదుర్కొంటున్నట్లు టోక్యో విద్యుత్ సంస్థ టెప్కో గురువారం తెలిపింది. నష్టపరిహారంగా 500కోట్ల డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 157మంది అమెరికన్లు కేసు దాఖలు చేశారు. 2011లో సంభవించిన సునామీ కారణంగా ఫుకుషిమా అణు విద్యుత్ కేంద్రం దెబ్బతింది. ఫుకుషిమా అణు బాధితులకు అండగా నిలబడిన వీరు కాలిఫోర్నియా జిల్లా కోర్టులో టెప్కోపై ఈ నెల ప్రారంభంలో కేసు వేశారు. అణు విపత్తు సంభవించిన వెంటనే అమెరికా బలగాలతో పాటు సహాయక చర్యల్లో పాల్గొన్న వీరు, అణు ధార్మికతకు తాము గురయ్యామని పేర్కొన్నారు. దీన్నుండి బయటపడేందుకు అవసరమయ్యే చికిత్సకు, వైద్య పరీక్షలకు గానూ ఈ మొత్తాన్ని ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారని టెప్కో ఒక ప్రకటనలో పేర్కొంది. భౌతికంగా, మానసికంగా, ఆర్థికంగా తమకు కలిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు. అయితే వారి వివరాలేవీ తెలియరాలేదు. 2013లో 200మంది ఇలాగే ఫుకుషిమాపై కేసు దాఖలు చేశారు. ఇది రెండో కేసు.

ఇరాన్‌తో కతార్ దౌత్య సంబంధాలు

స్పందించని అరబ్ దేశాలు



దోహా : ప్రాంతీయంగా సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఇరాన్‌తో పూర్తి స్థాయిలో దౌత్య సంబంధాలు పునరుద్ధరించినట్లు కతార్ గురువారం ప్రకటించింది. కాగా, జూన్ నుండి అరబ్ దేశాలతో కొనసాగుతున్న దౌత్య సంక్షోభాన్ని ఈ సందర్భంగా కతార్ ప్రస్తావించలేదు. త్వరలో కతార్ రాయబారి టెహరాన్‌కు వెళతారని కతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. సౌదీ అరేబియా షియా మత పండితుడిని ఉరి తీసిన తర్వాత కతార్ తమ రాయబారిని 2016లో వెనక్కి పిలిపించింది. ఆ తర్వాత ఇరాన్‌లో ఇద్దరు సౌదీ దౌత్యవేత్తలపై దాడులు కూడా జరిగాయి. ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌తో అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టపరుచుకునేందుకు కతార్ ప్రభుత్వం కృత నిశ్చయంతో వుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా ఈ పరిణామాన్ని ధృవీకరించింది. కానీ అంతకుమించి ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. 2016లో రాయబారిని వెనక్కి పిలిపించినప్పటికీ ఇరాన్, కతార్‌లు వాణిజ్య సంబంధాలు కొనసాగించాయి. జూన్‌లో అరబ్ దేశాలతో దౌత్య వివాదం తలెత్తినప్పటి నుండి కతార్‌కు ఇరాన్ ఆహార సరఫరాలను పంపింది. కాగా, తాజాగా కతార్ తీసుకున్న నిర్ణయంపై అరబ్ దేశాల నుండి వెంటనే ఎలాంటి ప్రతిస్పందన రాలేదు. తీవ్రవాద కార్యకలాపాలకు నిధులు అందిస్తుందన్న ఆరోపణలతో పాటు ఇరాన్‌కు సన్నిహితంగా వుండడం అరబ్ దేశాలకు నచ్చలేదు. అందుకే కతార్‌తో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నాయి.

ఇరాన్‌లో దౌత్య కార్యాలయాలను మూసివేయాలనే డిమాండ్‌తో సహా 13డిమాండ్లను అరబ్ దేశాలు చేశాయి. కానీ వాటిపై కతార్ ఇంతవరకు ప్రతిస్పందించలేదు. ఇచ్చిన గడువు ముగిసినా ఏమీ తేల్చకపోవడంతో ప్రస్తుత ప్రతిష్టంభన నెలకొంది. కువైట్, అమెరికా మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేసినా ఫలితమివ్వలేదు. కాగా, దోహాలో తమ ఎంబసీని మూసివేస్తున్నట్లు బుధవారం సెంట్రల్ ఆఫ్రికన్ దేశం చాద్ ప్రకటించింది. తమను అస్థిరపరిచేందుకు కతార్ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఇదిలావుండగా, వార్షిక హజ్ యాత్రకు కతార్ జాతీయులను అనుమతిస్తామని సౌదీ అరేబియా ప్రకటించింది.

యురోపియన్ న్యాయ స్థానం పరిధిలో బ్రిటన్ వుండదు

- తేల్చి చెప్పిన ప్రధాని థెరిస్సా
- మా సొంత చట్టాలు మావేనని స్పష్టీకరణ



లండన్ : బ్రెగ్జిట్ అనంతరం యురోపియన్ న్యాయ స్థానం (ఇసిజె) పరిధిలో బ్రిటన్ వుండదని బ్రిటన్ ప్రధాని థెరిస్సా మే స్పష్టం చేశారు. ఇసిజె ప్రత్యక్ష పరిధి నుండి తప్పుకోవడానికి తమకు అనేక అవకాశాలు, మార్గాలు వున్నాయని థెరిస్సా తెలిపారు. 40ఏళ్ల ఇయు సభ్యత్వం నుండి వైదొలగేందుకు జరపతలపెట్టిన చర్చల్లో ప్రధాని థెరిస్సా మే ప్రస్తావించనున్న కీలకమైన అంశాల్లో ఇదొకటి. 2019 మార్చిలో ఇయు నుండి బయటకు వచ్చిన తర్వాత తలెత్తే వివాదాలు పరిష్కరించుకోవడానికి, తమ సొంత చట్టాలను అమలు చేసేందుకు అంగీకారం కుదుర్చుకోవాలని బ్రిటన్ భావిస్తోంది. దీనిపై ఒక పత్రాన్ని కూడా రూపొందించింది. అందులో కోర్టు ప్రత్యక్ష పరిధిలోకి రాని అనేక ఇయు ఒప్పందాలను ప్రస్తావించింది. బ్రిటన్ ఇసిజె పరిధిలోకి రాకుండా వుంటే సొంత చట్టాలు చేసుకోవడానికి, వాటిని బ్రిటీష్ కోర్టులు, న్యాయమూర్తులు అమలు చేయడానికి అవకాశం వుంటుందని థెరిస్సా అభిప్రాయపడుతున్నారు. బ్రిటన్ కోర్టులు, పార్లమెంట్ నుండి ఇసిజె నెమ్మదిగా అధికారాలను లాక్కుంటుందని కన్జర్వేటివ్ పార్టీలోని సొంత సభ్యులే థెరిస్సాపై ఆగ్రహం వ్యకం చేస్తున్నారు. వారిని శాంతింప చేసేలా ఆమె మాట్లాడారు. చట్టాలను తమ ఆధీనంలోకి తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. ఇయు నుండి వైదొలగడమంటే పూర్తిగా వైదొలగడమే, అందులో ఎలాంటి సందేహం లేదు. దీనిపై ప్రభుత్వ పూర్తి స్థాయి నిబద్ధతను తాము స్వాగతిస్తున్నామని బ్రెగ్జిట్ అనుకూల ప్రచార గ్రూపు వ్యాఖ్యానించింది. అయితే బ్రిటీష్ న్యాయ వ్యవస్థలో ఇసిజెకి భవిష్యత్తులో ఎలాంటి పాత్ర వుండకుండా జాగ్రత్త పడాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపింది.

యెమెన్ రాజధానిపై హుతీ రెబెల్స్ దాడి : 30 మంది మృతి

దుబాయ్ : యెమెన్ రాజధాని సానా వెలుపల హుతీ రెబెల్స్ ఆధీనంలోని ఔట్‌పోస్ట్ వద్ద గల హోటల్‌పై జరిగిన వైమానిక దాడుల్లో 35మంది మరణించారు. హుతి రెబెల్స్‌పై బుధవారం దాడులు నిర్వహించినట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి ప్రతినిధి తెలిపారు. సానాకు ఉత్తరంగా అర్హబ్ జిల్లాలో సైనికంగా కీలకమైన లక్ష్యాలపై దాడి చేసినట్లు ఆయన చెప్పారు. ఈ దాడిలో మరణించిన వారందరూ సాయుధ రెబెల్‌గ్రూపు సభ్యులేనని తెలిపారు. ఇరాన్‌తో చేతులు కలిపిన హుతీ రెబెల్స్‌ను ప్రస్తావిస్తూ ఆ ప్రతినిధి పై వ్యాఖ్యలు చేశారు. దాడిలో హోటల్ పై కప్పు కూలిపోవడంతో రెండు మృతదేహాలు పైనుండి వేలాడుతూ కనిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా 46మంది మృతి చెందినట్లు యెమెన్ ప్రభుత్వం ప్రకటించిందని సాయుధ హుతీ గ్రూపు నిర్వహణలోని అల్ మజీరా టివి తెలిపింది. ఈ దాడిలో ప్రజలెవరైనా మరణించారా లేదా అనేది తెలియరాలేదు. దాడి జరిగిన సమయంలో హోటల్‌లో దాదాపు వంద మంది వరకు వున్నారు. 35మృతదేహాలు స్వాధీనం చేసుకున్నామని, ఇంకా కొంతమంది హోటల్ శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలిపారు. యెమెన్ జాతీయులను లక్ష్యంగా చేసుకున్నారని ఈ దాడితో వెల్లడైనట్లు తెలుస్తోందని అన్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వంపై హుతీలు పోరాటం సల్పుతున్నారు.

అమెజాన్ రిజర్వ్ ఏరియాలో తవ్వకాలకు బ్రెజిల్ అనుమతి

బ్రసీలియా : పెద్ద మొత్తంలో ఖనిజ సంపద వున్న అమెజాన్ ప్రాంతంలో తవ్వకాలకు బ్రెజిల్ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. 46వేల చదరపు కిలోమీటర్లు గల ఈ ప్రాంతంలో బంగారం, ఇతర ఖనిజాలు సమృద్ధిగా వున్నాయని భావిస్తున్నారు. ఈ ఏరియాలోనే వున్న రక్షిత అటవీ ప్రాంతం, ఆదిమవాసుల ప్రాంతాలతో సహా 9 రిజర్వ్ ప్రాంతాలను మాత్రం చట్టబద్ధంగా పరిరక్షించడం కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే తవ్వకాలకు అనుమతి ఇస్తే ఈ ప్రాంతాలు కూడా దెబ్బతింటాయని పర్యావరణ పరిరక్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రక్షిత ప్రాంతం (నేషనల్ రిజర్వ్ ఆఫ్ కాపర్ అండ్ అసోసియేట్ -రెంకా) విస్తీర్ణంలో డెన్మార్క్ కన్నా పెద్దది. ఇందులో 30శాతం భూభాగాన్ని ఇప్పుడు తవ్వకాలకు అనుమతిస్తున్నారు. పెట్టుబడులను ఆకర్షించడం ఈ చర్య లక్ష్యమని బ్రెజిల్ ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా గత 50ఏళ్ళ కాలంలో అమెజాన్‌పై జరిగిన అతి పెద్ద దాడిగా ప్రతిపక్షం విమర్శిస్తోంది. తవ్వకాలకు అనుమతించడం వల్ల అడవులు, జల వనరులు ధ్వంసమవుతాయని, జీవ వైవిధ్యం దెబ్బ తింటుందని, భూ ఘర్షణలు తలెత్తుతాయని పేర్కొంటోంది.

అమెరికా సైన్స్ రాయబారి రాజీనామా

వాషింగ్టన్ : అమెరికా విదేశాంగ శాఖలో సైన్స్ రంగానికి సంబంధించిన ముగ్గురు రాయబారుల్లో ఒకరు గురువారం రాజీనామా చేశారు. ఇటీవల వర్జీనియాలోని చార్లెట్స్‌విల్లెలో జరిగిన హింసాకాండపై ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన వైదొలగారు. శ్వేత జాతీయుల, నయా నాజీల వైఖరిని ఖండించడంలో ట్రంప్ విఫలమయ్యారని కాలిఫోర్నియా యూనివర్శిటీ ప్రొఫెసరైన డేనియల్ కామెన్ తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. తద్వారా అమెరికన్లతో పాటు అంతర్జాతీయ సమాజం సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. సైన్స్ రంగానికి సంబంధించి రాయబారులుగా వ్యవహరించే వీరు స్వచ్ఛంద కార్యకర్తలుగా పనిచేస్తారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వయేతర సైన్స్ సంస్థలతో కలిసి పనిచేస్తారు. పారిస్ వాతావరణ ఒప్పందం నుండి బయటకు రావాలన్న ట్రంప్ నిర్ణయాన్ని కూడా ఆయన తీవ్రంగా విమర్శించారు.



బ్రెజిల్ నదిలో బోటు మునిగి

10మంది మృతి, పలువురి ఆచూకీ గల్లంతు

బ్రసీలియా : ఉత్తర బ్రెజిల్‌లో నదిలో బోటు మునిగి 10మంది మరణించగా, పలువురి ఆచూకీ తెలియరాలేదని బుధవారం అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో బోటులో 70మంది ప్రయాణిస్తున్నారు. బోటు మునిగిన వెంటనే 15మంది ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా, 10మృత దేహాలను వెలికితీసినట్లు ప్రజా భద్రతా కార్యాలయం తెలిపింది. మిగిలినవారి ఆచూకీ తెలియరాలేదు. గ్జిన్‌గూ నదిలో మంగళవారం రాత్రి బోటు మునిగింది. ప్రమాదానికి గల కారణం ఏమిటో ఇంకా తెలియరాలేదని అధికారులు చెప్పారు. శాంటరెమ్ నుండి విక్టోరియాకు బయలుదేరిన ఈ బోటు దెబ్బతిన్న కారణంగా వెంటనే మునిగిందని ఈ ప్రమాదం నుండి బయటపడిన బ్రూనో కోస్టా (29)తెలిపారు. కుండపోతగా కురుస్తున్న వర్షాల కారణంగా టార్పాలిన్ కింద కూర్చున్న వారు నీళ్ళలో పడిన వెంటనే ఆ టార్పాలిన్ అడ్డుపడడంతో వారు మునిగిపోయారని కోస్టా తెలిపారు. ఎక్కువమందికి లైఫ్ జాకెట్లు కూడా లేవని, దాంతో ప్రాణనష్టం ఎక్కువగా వుందని చెప్పారు.



నేపాల్ ప్రధాని దేవ్‌బాతో ప్రధాని మోడీ

నేపాల్‌తో 8 ఒప్పందాలు

న్యూఢిల్లీ : మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ను అడ్డుకోవడంతో పాటు వివిధ అంశాలపై ఎనిమిది ఒప్పందాలను నేపాల్‌తో భారత్ కుదుర్చుకుంది. నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాతో భారత ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. ఇరువురు ప్రధానులు రిమోట్ ద్వారా నేపాల్ సరిహద్దుల్లో పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్స్‌ను ప్రారంభించారు. ఇరు దేశాల ప్రధానులు సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మోడీ మాట్లాడుతూ నేపాల్‌తో ద్వైపాక్షిక సంబంధాలు సానుకూలంగానూ, నిరంతరాయంగానూ సాగుతున్నాయని అన్నారు. దేవ్‌బాతో చర్చలు చాలా సానుకూలంగా జరిగాయని, నేపాల్ అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో సహకారం వుంటుందని అన్నారు. ద్వైపాక్షిక ఒప్పందాల్లో భద్రత, రక్షణ అంశాలకు కూడా ప్రాధాన్యత వుందన్నారు. నేపాల్‌కు ఎప్పుడూ సహాయం చేస్తామని, ఇటీవల వరదల సమయంలోనూ సహాయం చేసామన్నారు. నేపాల్ ప్రధాని దేవ్‌బా మాట్లాడుతూ నేపాల్ గడ్డపై ఎటువంటి భారత వ్యతిరేక కార్యక్రమాలను అనుమతించమని తెలిపారు. అంతకు ముందు నేపాల్ ప్రధానికి రాష్ట్రపతి భవన్ వద్ద రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ప్రధాని మోడీ ఘనంగా స్వాగతం పలికారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం భారత్‌కు దేవ్‌బా చేరుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత దేవ్‌బాకు ఇదే తొలి విదేశీ పర్యటన.

ఐటిలో లక్ష ఉద్యోగాలు : లోకేష్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతికి విశాఖపట్టణం ముఖ్య కేంద్రం కానుందని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. మహేంద్ర టెక్ హబ్‌లో అంజర్, డిజిపబ్, ఐటి అనలిటిక్స్, ఇన్సూరెన్స్ బాక్స్, ఇన్వెంట్రాక్స్, పిజిఎస్-ప్రొపిజిల్, వర్చువల్ ఆఫ్ సోర్, విస్మయా ఫ్రీ మీడియా అను 8 కంపెనీలను లోకేష్ గురువారం ప్రారంభించారు. ఆయా సంస్థల సిఇఒలతో చర్చించారు. మరో రెండు కంపెనీల ఏర్పాటుకు అవగాహనా ఒప్పంద పత్రాలను కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 18 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఐటిలో లక్ష ఉద్యోగాలు, ఒక్క విశాఖలోనే 70 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి రాష్ట్రంలో 10 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్లు, వచ్చే ఏడాది చివరికి 50 లక్షల కనెక్షన్లు అందిస్తామన్నారు. తద్వారా ఈకో సిస్టమ్ అభివృద్ధి అయి ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. దీనివల్ల ప్రతి ఇంటికి ఒక్కో యాప్ సృష్టించవచ్చన్నారు. ఐటి అంటే ఉద్యోగాలు సృష్టించడానికి మాత్రమే కాకుండా ఐటి ఫలాలను పేదలకు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు తయారు చేస్తున్నారన్నారు. ప్రతి పేద కుటుంబం కనీసం రూ.10 వేలు సంపాదన ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. విశాఖలోని కాపులుప్పాడలో సైబర్ సిటీని నిర్మించేందుకు 200 ఎకరాలు కేటాయించామన్నారు. ఆ ప్రాంతంలో ఐటి ఉద్యోగులకు హౌసింగ్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న కంపెనీలే 70 శాతం ఉద్యోగాలు కల్పిస్తున్నాయని, ఐటిలోనూ ఆ దిశగా ఉద్యోగాలు కల్పించేందుకు చిన్న కంపెనీలకు అనుకూలంగా పాలసీని రూపొందించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి ఏడాదికి రూ.2 వేల కోట్ల ఐటి ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని, రెండేళ్లలో రూ.20 వేల కోట్ల ఎగుమతులయ్యేలా లక్ష్యం పెట్టుకున్నామని అన్నారు. రాష్ట్రంలో 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటి సంస్థలున్నాయని, రాబోయే రోజుల్లో మరో 90 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి పెంచుతామని తెలిపారు. ఏపిలో ఐటి కంపెనీల్లో రాష్ట్రంలోని వారికే కాకుండా ఇతర రాష్ట్రాల వారికి అవకాశాలు కల్పించాలన్నారు. అప్పుడే రాష్ట్రం ఆర్థికంగా వృద్ధి సాధిస్తుందన్నారు.

శిల్పా చక్రపాణిరెడ్డిపై దాడికి యత్నం

మొదటి పేజీ తరువాయి

పరామర్శించి వస్తుండగా టిడిపి నాయకులు అభిరుచి మధు కూడా మాబాష కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో శిల్పా వాహనానికి మధు అడ్డంగా వాహనాన్ని పెట్టి తొలగించమని చెప్పారు. అభిరుచి మధు కార్యకర్తలు, శిల్పా కార్యకర్తలు ఒకరికొకరు తోపులాట జరిగింది. అక్కడ పరిస్థితి విషమించి పోతుందని మధు గన్‌మెన్ రెండుసార్లు గాలిలోకి కాల్పులు జరిపాడు. శిల్పా కార్యకర్తలు ప్రాణభయంతో చెల్లాచెదురై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. అభిరుచి మధు కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. . మధుకు దిక్కుతోచక తన పక్కన ఉన్న టెంకాయల కత్తిని తీసుకొని వైసిపి వర్గీయులపైనా, శిల్పా చక్రపాణిపైనా దాడికి యత్నించారు. కత్తితో నడిరోడ్డుపై వీరాంగం సృష్టించి గీత గీశారు. 'ఈ గీత దాటి వస్తే మీ అంతు చూస్తాను' అంటూ మధు మీసాలు తిప్పాడు. అక్కడున్న ఒకరిద్దరు పోలీసులు ఈపరిస్థితి చూసి పారిపోయారు. శిల్పా చక్రపాణిరెడ్డి 2వ పట్టణ పోలీసులకు ఫోన్ చేశాక సిఐ తన సిబ్బందితో వచ్చారు. సూరజ్ గ్రాండ్ హోటల్ వద్దకు చేరుకొని ఇరువురిని సముదాయించారు. ఇందులో గొడవకు కారకులెవరనేది స్పష్టంగా కనిపిస్తోంది.

శిల్పా చక్రపాణిరెడ్డిపై కేసు నమోదు

మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డిపై, అతని బావమరుదులు ఆదిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఇంకా ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సిఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం అభిరుచి మధు, శిల్పా చక్రపాణిరెడ్డి మధ్య ఘర్షణ కారణంగా అభిరుచి మధుపై శిల్పా వర్గీయులు దాడి యత్నానికి పాల్పడి మధు కారు అద్దాలు ధ్వంసం చేశారని అభిరుచి మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 147, 148, 149, 307, 341, 427 సెక్షన్‌ల కింద వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

న్యాయవిచారణ చేపట్టాలి : వైసిపి

ప్రజాశక్తి-హైదరాబాద్, అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నిక కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని వైసిపి ప్రధాన కార్యదర్శి శివకుమార్ ఎన్నికల సంఘాన్ని కోరారు. నంద్యాల కాల్పుల ఘటనపై గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 31 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ చాలా మంది ఆయుధాలు పోలీసులకు అప్పగించలేదని తెలిపారు. కర్నూలు జిల్లాలో మొత్తం 2,252 మందికి తుపాకీ లైసెన్సులు ఉన్నాయని, ఉపఎన్నిక సందర్భంగా కోడ్ అమల్లోకి రావడంతో 1,211 మంది మాత్రమే స్థానిక పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేశారని వెల్లడించారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం దష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. ఆయుధాలు డిపాజిట్ చేయని వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. నంద్యాలలో చోటుచేసుకున్న కాల్పుల ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న నంద్యాల ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో భద్రతను పెంచాలన్నారు. తెలుగుదేశం పార్టీకి ఓటమి ఖాయమని తేలిపోవడంతో అసహనంతో దాడులకు దిగుతున్నారని విమర్శించారు.

బాబు ప్రోత్సాహంతోనే ఫ్యాక్షనిజం : శ్రీకాంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతోనే రాష్ట్రంలో ఫ్యాక్షన్ పెరిగిపోతోందని వైసిపి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. రౌడీషీటర్లకు గన్ లైసెన్స్‌లు, గన్‌మెన్‌లను కేటాయిస్తూ రౌడీయిజాన్ని పెంచి పోషిస్తున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైసిపిలో చేరారనే కసితో శిల్పా చక్రపాణిరెడ్డిపై ప్రభుత్వమే కాల్పులు చేయించిందని ఆరోపించారు. అభిరుచి మధు వీరంగం చూసి పోలీసులు సైతం పారిపోయారని, కత్తులు పట్టుకొని 10 నిమిషాల పాటు హల్‌చల్ చేసినా ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీశారు.

ఓటమి భయంతోనే శిల్పా వర్గీయుల దాడి : మంత్రి సోమిరెడ్డి

ప్రతిపక్షనేత బాధ్యతల్ని విస్మరించి జగన్ నంద్యాలలో మకాం వేశారని, ఓడిపోతామన్న భయంతోనే గురువారం అభిరుచి మధుపై శిల్పా వర్గీయులు దాడికి పాల్పడ్డారని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. సిఎం చంద్రబాబుపై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలతోనే వైసిపి నేతలు హింసకు దిగుతున్నారన్నారు. నంద్యాలలో టిడిపికి 25వేల మెజారిటీ వస్తుందన్నారు.

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే

మొదటి పేజీ తరువాయి

వ్యక్తిగత హక్కును ఉల్లం ఘిస్తున్నారంటూ 2015లో సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఆధార్‌పై విచారించేందుకు ఏర్పాటు చేసిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మా సనం, ముందుగా వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కా, కాదా అన్న అంశాన్ని తేల్చాల్సి ఉందనే అభిప్రాయానికి వచ్చింది. దీనిపై స్పష్టత వచ్చాకే ఆధార్ అనుసంధాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ చేపడతామని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంపై చర్చించేందుకు తొమ్మిదిమంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనంను ఏర్పాటు చేస్తున్నట్లు జులై 18న సుప్రీంకోర్ట్ తెలిపింది. తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనంలో చీఫ్ జస్టిస్ ఖేహర్‌తో పాటు న్యాయమూర్తులు జాస్తి చలమేశ్వర్, ఎస్‌ఎ బాబ్డే, డీవై చంద్రచూడ్, ఎస్ అబ్దుల్ నజర్, ఆర్‌కే అగర్వాల్, రోహిన్‌టన్ ఫాలీ నారీమన్, అభర్ మనోహర్ సాప్రే, సంజయ్ కిషన్ కౌల్ ఉన్నారు. ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు అరవింద్ దాతర్, శ్యామ్ దివాన్, గోపాల్ సుబ్రమణ్యం, ఆనంద్‌గోవర్ వాదనలు వినిపించారు. వీరి వాదనలు పరిశీలించిన ధర్మాసనం వ్యక్తిగత గోప్యత రాజ్యాంగ హక్కేనని ఏకగ్రీవంగా తీర్పుఇచ్చిది. అయితే, ఇప్పటికే దేశవ్యాప్తంగా 80 శాతం ఆధార్ కార్డు ప్రక్రియ పూర్తయింది. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ కార్డును లింక్ చేసే గడువు ఈ ఏడాది చివరి వరకు ఉండగా, ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్‌లు ఫైల్ చేయాలంటే ఆధార్ నెంబర్ ఉండాలనే నిబంధన అమలు కూడా దాదాపు పూర్తయింది. పాన్‌కార్డులకు ఆధార్‌ను లింక్ చేసే ప్రక్రియను కూడా ప్రభుత్వం చేపట్టింది. ఇవన్నీ వ్యక్తిగత గోప్యత కిందకు వస్తాయా? వస్తే ప్రభుత్వం తప్పనిసరి చేస్తున్న ఆధార్ కార్డు వివరాలు మనం ఇవ్వకపోయినా ఫర్వాలేదా? అనే అంశాలపై సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది.

ఇదే మొదటిసారి కాదు...

వ్యక్తిగత గోప్యతపై సుప్రీం కోర్టులో చర్చ జరగడం ఇదే మొదటిసారి కాదు. 1954లో ఎంపీ శర్మ కేసులో భాగంగా వ్యక్తిగత గోప్యత అంశం చర్చకు వచ్చింది. దాల్మియా జైన్ ఎయిర్ వేస్ వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయని అప్పట్లో కేసు నమోదైంది. దీంతో దాల్మియా గ్రూపుకు చెందిన కొన్ని ప్రదేశాల్లో సోదాలు జరిపారు. అయితే సోదాల్లో రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ ఎంపీ శర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీం స్పందిస్తూ సోదాలు చేయడం అంటే తాత్కాలికంగా హక్కుల్లో జోక్యం చేసుకోవడమేనని, అయితే ఇది చట్టబద్ధంగా నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం జరిగితే తప్పులేదని అభిప్రాయపడింది. వ్యక్తిగత వివరాల గోప్యత ప్రాథమిక హక్కు కాదని, రాజ్యాంగంలో దీని ప్రస్తావన లేదని ఎనిమిదిమంది తో కూడిన ధర్మాసనం తీర్పు నిచ్చింది. ఆ తర్వాత 1963లో మరోసారి ఈ అంశం చర్చకు వచ్చింది. దోపిడి కేసులో తగిన సాక్ష్యం లేదని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఖారాక్ సింగ్‌ను విడుదల చేశారు. దీంతో యుపి పోలీసులు అతడిపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో తన ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నారంటూ ఖారక్ సింగ్ 1963లో సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అయితే ఆ సమయంలో ఆరుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఖారక్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. రాజ్యాంగంలో ఎక్కడా వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా పేర్కొనలేదని స్పష్టం చేసింది. అయితే ఈ రెండు తీర్పులను గురువారం నాడు తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన విస్తృత దర్మాసనం కొట్టివేసింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని స్పష్టం చేసింది.

నేటి నుంచి అందుబాటులోకి రూ.200 నోటు

(మొదటిపేజీ తరువాయి)

సెక్యూరిటీ థ్రెడ్ నోటులోపల ఉంటుంది. ఈ నోటును వంచి చూసినప్పుడు ఆకుపచ్చ రంగు నుంచి నీలం రంగులోకి మారుతుంది.

- అశోక చిహ్నం, మహాత్మాగాంధీ బొమ్మ ఒకింత ఉబ్బుగా కనిపిస్తుంది.
- ఈ కొత్తనోట్లు కూడా స్వచ్ఛభారత్ లోగోను కలిగి ఉంటాయి.
- ఈ కొత్త నోటును కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తొలిసారిగా అందుబాటులోకి తెస్తుండగా, ప్రధాని కార్యాలయం డిజైన్‌కు ఆమోదం తెలిపింది.

సంగీత చటర్జీ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్


రెడ్‌క్వీన్‌గా పేరుగాంచిన టివి నటి సంగీత చటర్జీ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎర్రచందనం కేసులో చిత్తూరు జైల్లో రిమాండ్‌లో ఉన్న ఆమె బాత్‌రూం క్లీనర్‌ను (హార్‌ఫిక్) తాగి ఆత్మహత్యా యత్నానికి పూనుకుంది. జైలు సిబ్బంది ఆమెను హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కడప జిల్లాకు చెందిన పేరుమోసిన ఓ ఎర్ర చందనం స్మగ్లర్‌కు సహకరించిన నేరం కింద సంగీత చటర్జీ ఐదు నెలలుగా చిత్తూరు సబ్‌జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఎంత ప్రయత్నించినా బెయిల్ మంజూరు కాలేదు. బెయిల్ మంజూరు కాలేదన్న ఆవేదనతో గురువారం సబ్‌జైల్లోనే బాత్‌రూం క్లీనర్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది.

గిరిజన గ్రూపు సభ్యులకు శిక్షణ

30, 31న ఏజెన్సీల్లో సెర్ప్ అధికారుల పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతి గిరిజన కుటుంబం నుంచి ఒక్కరైనా స్వయం సహాయక బృందంలో సభ్యులుగా చేరేందుకు ఏజెన్సీల్లో ఉన్న గ్రూపుల సభ్యులకు శిక్షణా తరగతుల్ని నిర్వహిస్తామని సెర్ప్ సిఇఒ కృష్ణ మోహన్ గురువారం ప్రకటనలో తెలిపారు. అలాగే వారి నివాసాలకు 5 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసే వన్ స్టాప్ సెంటర్లలో బ్యాంకింగ్ సేవల్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అందులో స్థానిక గిరిజనులనే కరెస్పాండెంట్లుగా నియమిస్తామని, అందులో మీ -సేవ సేవలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఇందు కోసం ఈనెల 30, 31 తేదీల్లో రంపచోడవరం, పార్వతీపురం ఏజెన్సీల్లో సెర్ప్ అధికారులు పర్యటిస్తారన్నారని పేర్కొన్నారు.



శర్వానంద్, మెహరీన్

'మహానుభావుడు' లక్షణాలు

శర్వానంద్ హీరోగా, మెహరిన్ హీరోయిన్‌గా మారుతి దర్శకత్వంలో యు.వి.క్రియోషన్స్ బ్యానర్‌లో వంశి, ప్రమెద్ నిర్మిస్తున్న చిత్రం 'మహానుభావుడు'. ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తిచేసుకుంది. కాగా, వినాయకచవితి సందర్భంగా చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. 'నా పేరు ఆనంద్ నాకో ఓసిడి వుంది. ఓ సిడి అంటే బిటెక్, ఎమ్ టెక్ టాంటి డిగ్రీలు కాదు డిజార్డర్. ఈ లక్షణాలు అతిశబ్రం, విపరీతమైన నీట్ నెస్.. అంటూ వాయిస్ ఓవర్‌తో స్టార్ట్ చేశారు.

నిర్మాతలు మాట్లాడుతూ.. మా బ్యానర్‌లో శర్వానంద్‌తో మూడవ చిత్రం. హాస్యాన్ని పండించగల దర్శకుడు మారుతి. టీజర్‌కూడా అదే తరహాలో వుంటుంది. ట్రైలర్ త్వరలో విడుదల చేస్తాం. నేటి నుంచి డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభించాం అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ.. టీజర్ అందర్ని ఆకట్టుకుంది. నా శైలిలో కొత్తగా వుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. శర్వానంద్ కెరీర్‌లో ఉత్తమ చిత్రంగా నిలుస్తుందని నమ్మకం వుంది. శర్వానంద్ పాత్ర వినోదాన్ని పండిస్తుంది. థమన్ బాణీలు ఆకట్టుకుంటాయి. మ్యూజికల్ లవ్ స్టోరిగా వుంటుంది. దసరాకి విడుదల చేయటానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారని అన్నారు.

'పైసా వసూల్' సెన్సార్ పూర్తి



'తమ్ముడూ... నేను జంగిల్ బుక్ సినిమా చూడల. కాని అందులో పులి నాలాగే ఉంటుందని చాలామంది చెప్పారు. అది నిజమో కాదో మీరే చెప్పాలి'. అంటూ డైలాగులతో, 'మావా.. ఏక్ పెగ్గు లా..' పాటతో నందమూరి బాలకష్ణ అభిమానులను ఖుషీ చేశారు. టీజర్, స్టంపర్‌తో 'పైసా వసూల్'పై భారీ అంచనాలు నెలకొనేలా చేశారు దర్శకుడు పూరి జగన్నాథ్. నిర్మాత వి. ఆనందప్రసాద్ రాజీపడకుండా నిర్మించారని టీజర్, స్టంపర్ చూపించాయి. భవ్య క్రియేషన్స్ పతాకంపై ఆయన నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 1న గ్రాండ్ రిలీజ్ కు సన్నాహాలు చేస్తున్నారు.

నిర్మాత మాట్లాడుతూ... సెన్సార్ బోర్డ్ యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చింది. సినిమా బాగా వచ్చింది. బాలకష్ణ అభిమానులు కోరుకునే అంశాలన్నీ పుష్కలంగా ఉన్నాయి. ఫుల్ ఎనర్జిటిక్ క్యారెక్టర్‌ని బాలయ్య పోషించారు. డూప్ లేకుండా ఆయన చేసిన యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులను థ్రిల్‌కు గురి చేస్తాయి. అభిమానులను ఖుషీ చేస్తాయి. పూరి జగన్నాథ్ ఓ కొత్త బాలయ్యను చూపించారు. అనూప్ రూబెన్స్ ఇచ్చిన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. మా బేనర్‌లో బాలయ్యతో మేం నిర్మించిన ఈ తొలి చిత్రం ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని' తెలిపారు. శ్రియ, ముస్కాన్, కైరా దత్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాలో ప్రముఖ నటుడు కబీర్ బేడి ప్రత్యేక పాత్ర పోషించారు. ఇంకా అలీ, పథ్వీ, పవిత్రా లోకేష్, విక్రమ్ జిత్ తదితరులు నటించారు.

'మళ్ళీ ప్రేమిస్తే'



భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్

రావహ రీల్స్ పతాకంపై జాన్ సుధీర్ పూదోట నిర్మాతగా 'ప్రేమిస్తే' భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'మళ్ళీ ప్రేమిస్తే'. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. సెప్టెంబర్ నెలలో విడుదల చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. 'ప్రేమిస్తే' తర్వాత భరత్ చేస్తున్న ప్రేమ కథా చిత్రం. తనను ప్రేమించిన అమ్మాయి మోసం చేస్తే భరత్ పడ్డ వేదనను ఆకట్టుకునేలా దర్శకుడు చిత్రీకరించారు. విజయ్ కురకాల సంగీత దర్శకత్వంలో ఐదు పాటలను రూపుదిద్దారు. 'ప్రేమిస్తే' చిత్రం తర్వాత ఈ చిత్రం అంత ఘన విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని దర్శక నిర్మాతలు వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ముజీజ్ మాలిక్, ఎడిటింగ్: నందమూరి హరిబాబు, సహ నిర్మాత: కిరణ్ తనమాల, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: రవి భార్గవన్.

సామాన్యుడికి అందని 'వివేకం'

చిత్ర సమీక్ష

నటీనటులు : అజిత్, కాజల్, వివేక్ ఒబెరాయ్ తదితరులు.
సంగీతం : అనిరుద్, నిర్మాత : సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్, టి.జి. త్యాగరాజన్, దర్శకత్వం : శివ

తమిల్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన తాజా చిత్రం 'వివేకం'. అజిత్ తో గతంలో 'వీరం, వేదాళం' వంటి సినిమాల్ని రూపొందించిన శివ ఈ సినిమాని డైరెక్ట్ చేశారు. భారీ అంచనాల నడుమ తమిళంతో పాటు తెలుగులో కూడా ఈరోజే విడుదలైన ఈ చిత్రం ఏ మేరకు ఆకట్టుకుందో ఇప్పుడు చూద్దాం..

కథ : యూరోపియన్ దేశాల్లో ఉండే కౌంటర్ టెర్రరిజం ఏజెన్సీలో పనిచేసే ఏకే (అజిత్ కుమార్) ప్రపంచంలోనే అత్యంత సమర్థుడైన, తెలివైన ఏజెంట్. ఏ దేశానికీ దొరకని టెర్రరిస్టుల్ని కనిపెట్టి, చంపడం అతని పని. అతనికి ఏజెన్సీ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన న్యూక్లియర్ ఆయుధాల్ని పేల్చడానికి కావాల్సిన కోడ్‌ను కలిగి ఉన్న హ్యాకర్ నటాషాను పట్టుకునే మిషన్‌ను అప్పగిస్తుంది. ఆ మిషన్‌ను పూర్తిచేసే కోడ్‌ను దక్కించుకునే సమయానికి అతనితో పనిచేసే స్నేహితులైన నలుగురు ఏజెంట్లు నమ్మక ద్రోహంతో అతన్ని చంపేప్రయత్నం చేస్తారు. కానీ ఎలాగో తప్పించుకున్న అతను బతికాడని తెలిశాక అతనిపై మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ముద్ర వేస్తారు. అది తెలుసుకున్న ఏకె ఎటువంటి వివేకాన్ని ప్రదర్శించాడన్నది మిగిలిన కథ.

విశ్లేషణ: ప్రపంచంలో వున్న దేశాలు, ఖండాలు, ప్రభుత్వాలన్నీ ఓ సీక్రెట్ ఆపరేషన్‌ను ఎలా చేస్తాయనేది ఈ చిత్రంలో చక్కగా చూపించడం విశేషం. రహస్య ఏజెంట్లు ఏవిధంగా పనిచేస్తారనేది జేమ్స్‌బాండ్ చిత్రాల్లో మనం చూశాం. కథ, కథనాలు ఆసక్తికరంగా వుండడంతో అవి విజయాన్ని సాధించాయి. కానీ, 'వివేకం'లో మాత్రం అది లోపించింది. ప్రధానంగా మైండ్‌గేమ్‌తో సాగే ఆట ఇది. ఎత్తులు పై ఎత్తులు వేస్తూ వివేకంగా హీరో చేసే విన్యాసాలు గగుర్పాటు కల్గించినా అవన్నీ సినిమాటిక్‌గా వుంటాయి. అయితే ఇందులో ఓ రహస్యాన్ని స్పష్టంగా చెప్పే ప్రయత్నం దర్శకుడు చేశాడు. దేశాలను పాలించేది పాలకులైనా శాసించేది మాత్రం బడా వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఏజెంట్లనే రహస్యాన్ని తెలియజేశాడు. మానవ హోమాన్ని సృష్టించి ప్రజల జీవితాలతో ఆడుకునే వ్యాపార వేత్తలు, ప్రపంచ దేశాలన్నీ కలిసి ఎలాంటి సపోర్ట్ లేని ఏకేనం

అసాంఘిక శక్తులు ఎన్నో అకృత్యాలను చేస్తుండడం తెలిసిందే. అయితే కృత్రిమ భూకంపాన్ని సృష్టించి ప్రకృతి వైపరీత్యంగా భ్రమకల్గించే సరికొత్త అంశాన్ని దర్శకుడు ఎంచుకోవడం విశేషం. ఇటువంటి కథకు కీలకమైన ఆధారం ఆధునిక సాంకేతిక. దానిలో ప్రావీణ్యం వున్న ఏజెంట్లు ఎంత చురుగ్గా వుంటారనేది ఏకె, అతని స్నేహితుల ద్వారా చూపించాడు. సినిమాకు ప్లస్ పాయింట్ హీరో అజిత్ నటన. ఏకే పాత్రలో అజిత్ ప్రతి ఫ్రేమ్‌లోను చాలా పవర్ ఫుల్‌గా కనిపిస్తూ ఆకట్టుకున్నాడు. యాక్షన్ సన్నివేశాల్లో అతను చేసిన కృషి, పోరాటాలు అద్భుతంగా అనిపిస్తాయి. తెలుగు దర్శకుడు శివ కూడా అజిత్‌నే ప్రధానంగా చేసుకుని ప్రతి సన్నివేశాన్ని హీరో ఇంట్రడక్షన్ సన్నివేశంలా రూపొందించాడు. సినిమా మొత్తాన్ని విదేశాల్లోనే చిత్రీకరించడం వలన హాలీవుడ్ స్థాయి విజువల్స్‌ను చూసిన ఫీలింగ్ కలిగింది. ప్రతి ఫ్రేమ్ రిచ్‌గా, అత్యున్నత సాంకేతికతతో ఉండి కనుల విందు చేశాయి. హీరో తన స్నేహితుల చేతిలోనే మోసపోయే సన్నివేశం ఎమోషన్‌గా బాగుంది. సెకండాఫ్ లో హీరో తన తెలివితో విలన్లను ఎదుర్కుంటూ, తన భార్య కాజల్ అగర్వాల్‌ను కాపాడుకునే సన్నివేశాలు కూడా ఆకట్టుకున్నాయి. ఇన్ని అంశాలున్నా కథ, కథనం సామాన్యుడికి అర్థమయ్యేరీతిలో వుండదు. దేశరహస్యాల్ని కాపాడే ఏజెంట్లు పనిచేసే కార్యాలయం వారు వాడే పదాలు, సన్నివేశాలు చకచకా జరిగిపోతుంటాయి. హైలెవల్‌లో ఆలోచించే మేధావికి ఈ చిత్రం కనెక్ట్ అవుతుంది. లేదంటే అర్థంకాని ఇంగ్లీషు సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుంది. సుమారు రెండున్నర గంటలపాటు ఉన్న ఈ సినిమాలో ఎక్కువ శాతం హీరోను పైకి లేపడానికి ఉపయోగించి, ముఖ్యమైన కథ, కథనాల కోసం కొంత రన్ టైమ్ మాత్రమే ఇవ్వడంతో చాలా చోట్ల చిత్రం సాగదీసిన ఫీలింగ్ కలిగింది. ప్రతి ఫ్రేమ్ వేగంగా కదులుతుండటంతో ఏ సన్నివేశం ఏ ప్రాంతంలో, ఎప్పుడు, ఎవరి మధ్య జరుగుతుందో అర్థం చేసుకునే సమయం దొరకలేదు. ఇక హీరో విలన్‌కు మధ్య నడిచే మైండ్ గేమ్ ఎక్కువైనట్లు అనిపించింది.

పట్టుకోలేకపోవడం అనేది లాజిక్స్‌కు దూరంగా ఉంటుంది. యాక్షన్ సీన్లు మినహా చాలా సన్నివేశాలు డ్రైగా అనిపిస్తాయి. ఇటువంటి కథకు వెట్రి కెమెరా పనితనం ఆకట్టుకునేలా ఉంది. ఫారిన్ లొకేషన్లో తీసిన ప్రతి సీన్, ప్రతి ఫ్రేమ్ చూడటానికి గొప్పగా అనిపించాయి. విజువల్స్, సీజీవర్క్ హాలీవుడ్ స్థాయిని పోలివున్నాయి. అనిరుద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పర్వాలేదు. అన్నింటికి మించి నిర్మాతలు పాటించిన నిర్మాణ విలువలు గొప్ప స్థాయిలో ఉన్నాయి.



అజిత్, కాజల్

పుట్టినరోజునాడే ఫస్ట్‌లుక్



పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న అంశాల్లో ఆయన తర్వాత సినిమా ఫస్ట్ లుక్ ఎప్పుడు, టైటిల్ ఏమిటి అనేవి ప్రధానంగా వున్నాయి. కొత్త చిత్రం చేస్తున్నట్లు ప్రకటించినప్పటి నుండి ఎదురుచూస్తున్న అభిమానుల్ని ఇకపై వెయిట్ చేయించడం ఇష్టంలేని టీమ్ మొదటిలుక్ విడుదలతేదీని ప్రకటించేసింది. సెప్టెంబర్ 2న పవన్ పుట్టినరోజు సందర్భంగా రిలీజ్ చేస్తున్నారు. దీంతో ఇప్పటి నుండే సోషల్ మీడియాలో అభిమానుల కోలాహలం మొదలైపోయింది. పవన్‌కు బాగా కలిసొచ్చిన దర్శకుడు త్రివిక్రమ్ డైరెక్ట్ చేస్తుండటం వలన ఈ సినిమా పై భారీ అంచనాలున్నాయి. హారికా హాసిని క్రియేషన్స్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ చిత్రం కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.



సెప్టెంబర్‌లో 'ప్రాజెక్ట్ జెడ్'


ఎస్.బి.కె ఫిల్మ్ కార్పోరేషన్ నిర్మిస్తోన్న చిత్రం 'ప్రాజెక్ట్ జెడ్'. సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి, జాకీష్రాఫ్ తదితరులు నటించారు. ఈ చిత్రానికి దర్శకుడు సి.వి.కుమార్. నిర్మాతలు ఎస్.కె. బషీద్, ఎస్.కె. కరిమున్నీసా. ఈ చిత్రం సెప్టెంబర్ రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. నిర్మాతల్లో ఒకరైన ఎస్.కె. బషీద్ చిత్ర విశేషాలను వివరిస్తూ... చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. యు,ఎ సర్టిఫికెట్‌ని సెన్సార్ సభ్యులు ఇచ్చారు. సందీప్‌కిషన్ డిఫరెంట్ రోల్‌లో నటించాడు. అతడి కెరీర్‌లో ఈ చిత్రం పెద్ద హిట్ చిత్రంగా నిలబడుతుందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే ఈ చిత్రం కాన్సెప్ట్ అంత కొత్తగా ఉంటుంది. జిబ్రాన్ చాలా మంచి మ్యూజిక్‌ని ఇచ్చాడు. రాబోయే పది సంవత్సరాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయనేదే ఈ చిత్ర కథ. త్వరలో ఆడియో ఫంక్షన్‌ని నిర్వహించి, సెప్టెంబర్ రెండోవారంలో చిత్రాన్ని ప్రేక్షుల ముందుకు తీసుకువస్తాం. ఈ చిత్రంతో పాటు మరో రెండు చిత్రాలు మా బ్యానర్‌లో రెడీ అవుతున్నాయని అన్నారు.

'తొంగి తొంగి చూడమాకు చందమామ'



దిలీప్, శ్రావణి, రాజ్‌బాల, అపర్ణ, బేబీ అక్షర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తొంగి తొంగి చూడమాకు చందమామ'. హరి వల్లభ ఆర్ట్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఏఎం. రెడ్డి నిర్మాత. గురు రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్టు సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఓ వినూత్న ప్రేమ కథతో దర్శకుడు ఆనంద్ కానుమోలు రూపొందిస్తున్నారు. బస్ స్టాప్ సాయి, జబర్దస్త్ మహేష్, అప్పారావు, జెమినీ సురేష్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ప్రేమను వ్యక్తీకరించడంతో అన్ని చిత్రాలు ప్రారంభమవుతాయి. అయితే ఈ సినిమాలో లవ్ ప్రపోజల్ చివరి అంశం. హీరో హీరోయిన్లు తమ ప్రేమను వ్యక్తీకరించుకోవడమే చిత్ర క్లైమాక్స్. తొలి షెడ్యూల్ పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ చిత్రీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు ఆనంద్ కానుమోలు మాట్లాడుతూ.. ఒక కాలనీలో జరిగే ప్రేమ కథ ఇది. ప్రేమ కథా చిత్రాల్లో ఓ వినూత్న ప్రయత్నం చేస్తున్నాం. తమ మధ్య ఉన్నది ఎలాంటి బంధమో తెలియని జంట, చివరివరకు ఒకరికి ఒకరు ఆ అనుభూతిని వ్యక్తీకరించుకోరు. తమ మధ్య ఉన్నది ప్రేమ అనే విషయం చివర్లో తెలుసుకుంటారు. ఈలోపు వాళ్లకు అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. ఈ జంట తమ ప్రేమను పరస్పరం తెలుపుకోవడంతో కథ ముగుస్తుంది. క్లైమాక్స్‌లో ప్రేమను చెప్పుకోవడం చిత్రానికి కొత్తదనాన్ని తీసుకొస్తుంది. లవ్‌తో పాటు 'జబర్దస్త్' నటులు మంచి వినోదాన్ని అందిస్తారు. బొబ్బిలి టీపీ కళాశాలలో తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరిపాం. సెప్టెంబర్ తొలి వారం నుంచి హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయాలని ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు.

'ప్రేమిక' కోసం తిప్పలు



తనీష్, శతి యుగళ్

తనీష్, శతి యుగళ్ జంటగా నటించిన చిత్రం 'ప్రేమిక'. దేశాల లక్ష్మయ్య నిర్మాత. మహేంద్ర దర్శకుడు. ఇందులోని పాటల ఆడియో హైదరాబాద్‌లో విడుదలైంది. మాంగో మ్యూజిక్ ద్వారా విడుదలయ్యాయి. 'కబాలి' తెలుగు ప్రొడ్యూసర్ గణేష్ మాస్టర్, త్రినాద్‌రావు ఆడియో సిడీ ఆవిష్కరించారు.

చిత్రసమర్పకుడు ఎస్‌విఎన్‌రావు మాట్లాడుతూ.... చక్కటి ప్రేమకథతో పాటు మదర్ సెంటిమెంట్‌తో రూపొందిన చిత్రమిది. సహజసిద్ధమైన ప్రాంతాల్లో అందమైన గ్రామీణ వాతావరణంలో తెరకెక్కించాం. అల్లరి చిల్లరగా తిరిగే యువకులకు, అమ్మాయిల్ని పెళ్లి చేసుకోవాలంటే ప్రేమిస్తే సరిపోద్ది, అదే అమ్మాయిని పోషించా లంటే సంపాదించాలన్న నిజం తెలుసుకున్న మరుక్షణం వాళ్ళ జీవితంలోకి ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? అన్నది ముఖ్య అంశం. ఉద్వేగ భరితంగా ఈ కథ రూపుదిద్దుకున్నది. మంచి మెలోడితో ఎనిమిది పాటలను నూతన సంగీత దర్శకుడు దిలీప్ బండారి కంపోజ్ చేశారని తెలిపారు.

చిత్ర దర్శకుడు: ఇది నా మొదటి సినిమా. మంచి ప్రేమ కథతో మీ ముందుకు రావడానికి నిర్మాత అవకాశం ఇచ్చారు. యువతను ఆలోచింపచేసే చిత్రమవుతుందని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ... యువతకు నచ్చే కథ. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు ముగింపు దశకు చేరుకున్నాయి. వచ్చేనెల ఎనిమిదిన విడుదల చెయ్యడానికి సిద్ధం చేస్తున్నామని అన్నారు. **తనీష్ :** కథ చెప్పినప్పుడు చేయగలనా? అనే సందేహం కలిగింది. కథ బాగా కనెక్ట్ కావడంతోపాటు దర్శకుడు ప్రోత్సాహంతో ముందుకు సాగాను. దిలీప్ సంగీతానికి ప్రాణం పోశాడని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ మాచినేని, ఎడిటర్: ప్రవీణ్ పూడి, విజువల్‌ఎఫెక్ట్స్ : నవీన్.

ఖరీఫ్‌లో ప్రతికూల పరిస్థితులెదురై సకాలంలో ప్రధాన పంటలు వేయలేకుంటే కంది, అపరాలు, చిరుధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటలను సూచిస్తుండగా, అవి కూడా దెబ్బతిని తీవ్ర కరువు ఏర్పడితే శీతాకాలంలో బంగాళదుంప సేద్యాన్ని చేపట్టే వీలుంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సెప్టెంబరు ఆఖరు నుంచి అక్టోబరు రెండో పక్షం వరకు బంగాళాదుంప సాగు చేపట్టేందుకు అనుకూలంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ఇది స్వల్పకాలంలో పండించేది. ఈ పంటను తెలుగు రాష్ట్రాల్లో ప్రధానంగా చిత్తూరు, మెదక్, కొద్దిగా రంగారెడ్డి జిల్లాలోనూ ఏటా 6637 హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు.




శీతాకాలపు పంట బంగాళదుంప

బంగాళదుంప సాగుకు చల్లని వాతావరణం అవసరం. పగటి ఉష్ణోగ్రత 32 సెల్సియస్, రాత్రిళ్లు 15-20 సెల్సియస్ మధ్య చాలా అనుకూలం. అధిక ఉష్ణోగ్రతలుండే ప్రాంతాల్లో దుంప పెరుగుదల ఉండదు.

నేలలు : నీటి పారుదల, మురుగు నీటి వసతి గల ఇసుక లేకుంటే ఎర్ర గరప నేలలు అనుకూలం. ఉదజని సూచిక (పిహెచ్) 5.2-7 వరకు ఉండే ఆమ్ల లక్షణాలు గల నేలలు, బరువైన నేలలు అనుకూలం కాదు.

రకాలు : ఈ దుంప రకాల్లో కుఫ్రీ పేరిట లాలిమ, బాద్‌షా, చంద్రముఖి తదితర రకాలుంటాయి. అయితే 110 రోజుల్లో పంటకొచ్చే కుఫ్రీ సింధూర్ రకం మనరాష్ట్రంలో పండించటానికి, నిల్వకు అనువైంది. ఇది లేట్ బ్లైట్ తెగులును తట్టుకుంటుంది. ఎకరాకు 9-10 టన్నుల దిగుబడినిస్తుంది. ఎస్-1, ఎస్-2 వంటి స్పెషల్ సెలక్షన్ రకాలూ మన రాష్ట్రంలో సాగు చేస్తున్నారు.



నేల తయారీ : నేలను 4-5 సార్లు దున్ని, ఎకరాకు 10-12 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. చదును చేయాలి. 50 సెంటీమీటర్ల ఎడంతో బోదెలు చేసి, కాలువలు తీయాలి.

త్వరగా మొలకెత్తటానికి (నిద్రావస్థను తొలగించడానికి) : శీతల గిడ్డంగుల నిల్వ నుండి తీసిన ఆలుగడ్డ విత్తన దుంపలు త్వరగా మొలకెత్తడానికి వీలుగా 30 సెం.మీ. మందం కన్నా మించకుండా నీడలో పరచి కనీసం 7-10 రోజుల పాటు ఆరనీయాలి. గాలి చొరబడడానికి 2-3 సార్లు విత్తన దుంపలను తిరగతిప్పాలి. పెద్ద సైజు దుంపలను శుభ్రంగా నీటిలో కడిగి 30-40 గ్రాములుండేలా ముక్కలుగా కోయాలి. 100 గ్రా. థయో యూరియా +10 మి.గ్రా. జిబ్బరిల్లిక్ ఆసిడ్ 10 లీటర్ల నీటిలో కలపాలి. ఈ ద్రావణంలో విత్తనం దుంపలను ముంచి తీసి బాగా ఆరబెట్టి, ఆ తర్వాత కుప్పగా చేసి 24-48 గంటలుంచిన తర్వాత విత్తుకోవాలి. ఈ ద్రావణంలో 500 కిలోల వరకు విత్తనాన్ని శుద్ధి చేయవచ్చు.

విత్తే విధానం : తెగులు సోకని, ఆరోగ్యమైన దుంపలను ఎంపిక చేసుకోవాలి. దాదాపు 30-40 గ్రా. బరువుతో, 2-3 కళ్లు ఉండి, అప్పుడే మొలకెత్తటం ప్రారంభించిన వాటిని విత్తటానికి ఎంపిక చేయాలి. ముక్కలు చేసిన విత్తన దుంపలు ఎకరాకు 6 నుండి 8 క్వింటాళ్లు అవసరం అవుతాయి. విత్తనాల ద్వారా వ్యాప్తి చెందే శిలీంధ్రాల నివారణకు విత్తనశుద్ధి తప్పని సరి. 25-50 గ్రా. బగలాల్ (మిథైల్ ఇథాక్సీ మెర్క్యురిక్ క్లోరైడ్) 10 లీ. నీటిలో కలిపిన ద్రావణంలో 2-5 నిమిషాల పాటు ఉంచాలి. ఒకసారి తయారుచేసిన మందు ద్రావణాన్ని మూడుసార్లు మాత్రమే విత్తన శుద్ధికి ఉపయోగించాలి. బోదెలకు ఒక పక్కగా కళ్లపై భాగంవైపు ఉండేలా దుంపలను నాటాలి. మొక్కల మధ్య 20 సెం.మీ., వరుసల మధ్య 50 సెం.మీ.ల ఎడం ఉండాలి. లీటరు నీటికి 3 గ్రా. మాంకోజెబ్ చొప్పున తయారు చేసిన ద్రావణంలో కూడా ఈ దుంపలను సుమారు 30 నిమిషములుంచి విత్తన శుద్ధి చేసుకోవాలి.

నీటి యాజమాన్యం : నేలను, వాతావరణాన్ని దష్టిలో ఉంచుకుని నీరు పెట్టాలి. చల్కా నేలల్లో మొలకెత్తడానికి ముందు 7-8 రోజుల వ్యవధితోనూ, దుంప ఏర్పడేటపుడు 4-5 రోజుల వ్యవధితోనూ నీరు పెట్టాలి.

కలుపు నివారణ, అంతరకృషి : అభివృద్ధి చెందుతున్న దుంపలపై సూర్యరశ్మి పడితే, దుంప ఆకుపచ్చ రంగుకు మారుతుంది. అందువల్ల విత్తిన 30 రోజుల తర్వాత సుమారు 3-4 సార్లు మట్టిని ఎగదోయాలి. విత్తిన 2-3 రోజుల్లో ఎకరాకు ఒక లీటరు అలాక్లోర్ పిచికారీ చేయాలి. అలాగే 300 గ్రా. మెట్రిబుజిన్ కూడా పిచికారీ చేసి కలుపు నివారించుకోవచ్చు.

ఎరువులు : ఆఖరి దుక్కిలో ఎకరాకు 10-12 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 40 కిలోల యూరియా, 150 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. విత్తిన 30 రోజుల తరువాత 40 కిలోల యూరియా, 50 రోజులకు మరో 20 కిలోల యూరియా, 30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.

డాక్టర్.యన్.కృష్ణ ప్రియ,
అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీ బి.వీరారెడ్డి అగ్రికల్చర్ కాలేజ్, బద్వేల్. అండ్
డాక్టర్.యం.చంద్రశేఖర్‌రెడ్డి, సైంటిస్ట్, లాం ఫారం, గుంటూరు.



సమగ్ర సస్యరక్షణ చర్యలు

- ఎండాకాలంలోనే లోతుగాదున్ని, పురుగుల వివిధ దశలను బయటపడేలా చేయాలి. పంటమార్పిడిని పాటించాలి. విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలి. కలుపు లేకుండా చూడాలి.
- చిన్న పురుగులు, ప్యూపా దశలు, వేరు పురుగులు, ఆకుమాడు తెగులు సోకిన ఆకులను, దెబ్బతిన్న దుంపలను తీసి నాశనం చేయాలి. వేరు పురుగు ఆశించకుండా దుంపలను పెట్టిన తరువాత 30 రోజులకు మట్టి ఎగద్రోసేటపుడు, ఫోరేట్ గుళికలు ఎకరానికి 6 కిలోల చొప్పున వేయాలి లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున వేయాలి.
- ఆకు ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- పెరుగుదల దశ తర్వాత ఆశించే ఆకుఎండు తెగులు నివారణకు లీటరు నీటికి మెటలాక్సిల్ 2 గ్రా.+ మాంకోజెబ్ 2 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- బాక్టీరియా ఎండు తెగులుంటే ఎకరానికి 8 కిలోల చొప్పున బ్లీచింగ్ పౌడరును వేయాలి.



- దుంప కోసిన తర్వాత తెగుళ్లు, పురుగులు సోకిన దుంపలను ఏరి నాశనం చేయాలి.

కోత : మొక్క పసుపు రంగు నుంచి గోధుమ రంగుకు మారి, నేల పైభాగంలో వాలి పడిపోతే కోతకొచ్చినట్లే. సాధారణంగా నాటిన 90-100 రోజుల్లో కోతకు సిద్ధం అవుతుంది. దుంపలకు తగలకుండా జాగ్రత్తగా గడ్డ పారతో తవ్వి తీయాలి. దుంపలను నీడలో ఆరబెట్టిన తర్వాత నిల్వ చేసుకోవాలి. ★

ఖరీఫ్ పంటలకు సలహాలు



డాక్టర్ కె.రాజారెడ్డి
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం,
గుంటూరు.

రాష్ట్రంలో ఈ ఏడాది కూడా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖరీఫ్ కాలం పూర్తి స్థాయిలో పంటల సాగుకు అనుకూలించ లేదు. రైతులు అనివార్యంగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు వెళ్లాల్సి వస్తోంది. రాయలసీమలో వేరుశనగకు బదులు కందితో అంతర పంటలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కువగా చిరుధాన్యాలను వ్యవసాయధికారులు ప్రత్యామ్నాయ పంటలుగా సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి వెసులుబాటు, పరిస్థితులు అనుకూలించిన చోట్ల ప్రకాశం మినహా మిగతా కోస్తా జిల్లాల్లో 80 శాతం వరకు వివిధ ఖరీఫ్ పంటలను సకాలంలోనే చేపట్టగలిగారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా పంటల సగటు వయసు, ప్రస్తుత స్థితిగతులు, వాటికి ఇప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కె రాజారెడ్డి ఈవారం సలహాలు విడుదల చేశారు. ఆవివరాలు..



మొక్కజొన్నలో 30 నుంచి 35 రోజుల దశ వరకు కాండం తొలిచే పురుగు సమస్య ఉంటుంది. ఈ పురుగు నివారణకు మొక్కజొన్నకు మొదటి 10-12 రోజుల్లోనే ఎకరానికి మోనోక్రోటోఫాస్ 36% 320 మి.లీ. లేదా కోరాంత్రనిలిపోల్ 18.5% 60 మి.లీ. పిచికారీ చేయాలి. పైరు 25 నుంచి 30 రోజుల దశలో ఎకరాకు 3.0 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను మొక్కల సుడుల్లో వేయాలి.

మినుము/ పెసర

వర్షాలు ఎక్కువగా పడెచోట్ల ఈ పంటలకు ఇనుపధాతు లోపం రావడానికి వీలుంటుంది. ఈ లోపం వల్ల మొక్కల ఆకులు లేత పసుపురంగు లేదా తెల్లరంగులోకి మారతాయి. ఒక్కోసారి ఆకులపై తుప్పు మరకలనూ గమనించవచ్చు. ఈలోపాన్ని గుర్తించిన వెంటనే 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేది+ 5 గ్రాముల నిమ్మఉప్పు+ 150 గ్రాముల యూరియా కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్ల పిచికారీ చేయాలి.

చెరకు

వర్షాకాలం పంట పొలంలో అధిక నత్రజని వాడకం, మురుగునీరు నిలిచిపోవడం వంటి కారణాల వల్ల చెరకును పొలుసు, దూదేకుల పురుగులు, పిండినల్లి, తెల్లఈగ ఆశిస్తుంటాయి. వీటిని ఉధృతిని గమనించి, ముదురు ఆకులను రెలచి, పంట మొత్తం తడిచేలా 'మలాథియాన్' 3 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

జొన్న

జొన్న విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు 12 కిలోల నత్రజనినిచ్చే ఎరువును పైపాటుగా వేయాలి. 30 రోజుల దాటిన పంటలో కాండం తొలిచే పురుగు ఆశిస్తుంటుంది. దీని నివారణకు 35-40 రోజులలోపు 4 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను కాండపు సుడుల్లో వేయాలి.

పొద్దు తిరుగుడు

ఈ పంట వయసు 30 రోజులప్పుడు నత్రజనిని యూరియా రూపంలో ఎకరానికి 13 కిలోల చొప్పున పైపాటుగా వేయాలి. మళ్లీ 50 రోజుల వయసులో మూడో దఫాగా ఎకరాకు 13 కిలోల యూరియా వేయాల్సి ఉంటుంది. ★

మనవి

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయక రాష్ట్రం. దక్షిణాది ధాన్యాగారంగా కూడా ప్రసిద్ధి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే జీవగర్ర, అటువంటి కీలకమైన ఈ రంగానికి సంబంధించిన సమా చారం, శాస్త్రవేత్తలు, నిపుణుల విశ్లేషణలు, ఇంట ర్వ్యూలు, గణాంకాలతో 'అగ్రిప్లస్' అనే శీర్షికతో ప్రతి శుక్ర వారం మీ ముందుకొస్తోంది. దీనిపై మీ అభిప్రా యాలు, సూచనలు, సలహాలు తెలియజేయగలరు. దీనిని మరింతగా పరిపుష్టం గావించేందుకు శాస్త్రవేత్తలు, నిపుణులు, అనుభవజ్ఞులు తమ వంతు తోడ్పాటునందించాలని మనవి.

మా చిరునామా :


'అగ్రిప్లస్', ప్రజాశక్తి దినపత్రిక, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-2
ఇ-మెయిల్ : editorprajasakthi@gmail.com



పొడుపు కథ

అమ్మకు తమ్ముడిని కాను.. కానీ నేను మీకు మేనమామను

జోక్ : టీచర్ : రాజూ ! చీమ, ఏనుగు ఈ రెండింటిలో ఏది పెద్దదో చెప్పు..?
రాజు : వాటి పుట్టిన తేదీలను బట్టి ఏది ముందు పుడితే అదే పెద్దది టీచర్ ..!
టీచర్ : ఆ..!



చుక్కలు కలపండి !

పిల్లలూ.! పైనున్న ఫోటోలో చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి.

రంగులే రక్షిస్తాయి



సీతాకోకచిలుకలు తమ రెక్కలు విప్పి ఎగురుతున్నప్పుడు వాటి రెక్కలపై ఉండే రకరకాల రంగుల్లోని ఆకృతులు మనకు ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తాయి. ఆ రంగుల ఆకృతులే వాటికి హాని కలిగించే ప్రాణుల నుంచి రక్షణ కల్పిస్తాయనే నిజం మనకు ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. సీతాకోకచిలుక ఒక పచ్చని గడ్డిపరకపై లేక ఒక పుష్పంపై వాలినప్పుడు అది తన రెక్కలను దేహానికి దగ్గరగా మూసుకొని ఉండటంతో ఆ రెక్కలపైన చివర్లో ఉండి అంతగా ఆకర్షణలేని బూడిద రంగు లేక నల్లగా ఉండే మచ్చలు, పొడలు మాత్రమే కనబడతాయి. అప్పుడు వాటికి హాని కల్గించే బల్లులు, తొండలు లాంటి ప్రాణులు వాటిపై దాడి చేసినప్పుడు సీతాకోక చిలుకలు శత్రువుల బారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తాయి. ఇలా ఒక్కసారి రెక్కలు విప్పి ఎగిరినప్పుడు ఆ రెక్కలపై ఉండే రకరకాల రంగులు శత్రువుకు వెంటనే కనపడతాయి. అలా కనపడిన ఆ రంగులు శత్రువులను తికమకపెడతాయి. ఆ కంగారు నుంచి శత్రువులు తేరుకొనే లోపే సీతాకోకచిలుకలు దూరంగా ఎగిరిపోతాయి. ఆ రంగులు తమకన్నా పెద్దవైన ఏ ప్రాణి కళ్లలాగో కనబడటంతో సీతాకోక చిలుకలను పట్టుకోవాలనుకున్న ప్రాణులు భయంగా దూరంగా పారిపోతాయి. అదండ్రా పిల్లలూ సీతాకోక రెక్కలపైగల రంగులు శత్రువుల నుంచి రక్షిస్తున్నాయన్నమాట. ★







ప్రజాశక్తి
www.prajasakti.com

మెరిసిన సంజీవని

ప్రపంచ వర్శిటీ 10 వేల మీ. పరుగులో రజతం



చైనీస్‌తైపీ: భారత రైజింగ్ స్టార్ అథ్లెట్ సంజీవని బాబర్ జాదవ్ 29వ ప్రపంచ యూనివర్శిటీ గేమ్స్‌లో రజతంతో మెరిసింది. ఇక్కడ చైనీస్ తైపీ నగరంలో జరిగిన 10 వేల మీటర్లు తన వ్యక్తిగత బెస్ట్ టైమింగ్‌తో 33:22.00 సెకన్లలో రజతం సాధించింది. ఈ విభాగంలో కిర్గిస్తాన్‌కు చెందిన డారియా మస్లోవా 33:19. 27 సెకన్లలో లక్ష్యాన్ని అధిగమించి స్వర్ణం కైవసం చేసుకుంది. మహారాష్ట్రకు చెందిన యువ రన్నరర్ సంజీవనికి ఇది అంతర్జాతీయంగా రెండో పతకం. ఈమె గతంలో వరల్డ్ స్కూల్ ఒలింపియాడ్‌లోను ఓ పతకం సాధించింది. 2017 ఆసియాన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 5వేల మీటర్ల , 10వేల మీటర్ల పరుగుల్లో రజతాలను సాధించింది. రెజ్లింగ్‌లో జిల్లా స్థాయిల్లో సత్తా చాటిన సంజీవనిని ట్రాక్‌అండ్ ఫీల్డ్ వైపు మళ్లించిన ఘనత కోచ్ విజేందర్ సింగ్‌దే.



ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న ఎంఎస్‌కె ప్రసాద్

ఆర్‌విఆర్ కాలేజీలో ఇండోర్ స్టేడియం

ప్రారంభించిన ఎంఎస్‌కె ప్రసాద్

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

గుంటూరులోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాలలో ఇండోర్ స్టేడియాన్ని బిసిసిఐ సెలక్షన్ కమిటి చైర్మన్ ఎంఎస్‌కె ప్రసాద్ గురువారం ప్రారంభించారు. కళాశాల బాలుర వసతి గృహ ప్రాంగణంలో రూ.50 లక్షలతో నిర్మించిన ఇండోర్ స్టేడియం అధునాతన వసతులతో ఉందని ఆయన అన్నారు. క్రీడలకు ఇంతటి ప్రాధాన్యతనిస్తున్న ఆర్‌విఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం నిర్వహించిన ఫ్రెషర్స్ డే సభలో ఎంఎస్‌కె మాట్లాడారు. విద్యార్థులు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడల ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశమూ ఉందని చెప్పారు.

ధోనీ, భువీ సత్తా..

రెండో వన్డేలోనూ భారత్ జయభేరి



పల్లెకలె: శ్రీలంక పర్యటనలో భారత్ ఐదో విజయాన్ని అందుకుంది.రెండో వన్డేలో ఓటమి కోరల్లో చిక్కిన జట్టును మాజీ కెప్టెన్ ధోనీ(45) మీడియ పేస్ బౌలర్ భువీ తొలి అర్ధ సెంచరీ (53తో)అజేయంగా నిలిచి శ్రీలంకపై 3 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయంలో కీలక పాత్ర పోషించారు. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ గెలిచిన విరాట్ శ్రీలంకను బ్యాటింగ్ ఆహ్వానించాడు. భారత్ బౌలర్లు బుమ్రా నాలుగు వికెట్ల, చాహల్ రెండు వికెట్లు తీయడంతో శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 236/8 పరుగులు చేసింది. భారత్ బ్యాటింగ్‌కు దిగే సమయానికి వర్షం రావడంతో కొద్దిసేపు మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో భారత్ లక్ష్యాన్ని 47 ఓవర్లలో 231గా నిర్ణయించారు. భారత్ 44.2 ఓవర్లలో లక్ష్యాన్ని అధిగమించింది.

తడబడి గెలిచిన భారత్...

ఈ లక్ష్యచేధనలో తొలి వికెట్‌కు రోహిత్, శిఖర్‌లు 109 పరుగుల భాగస్వామ్యంతో పునాది వేశారు రోహిత్ శర్మ 54 పరుగుల వద్ద ధనుంజయ బౌలింగ్‌లో ఎల్‌బిగా వెనుదిరిగాడు.మరో నాలుగు పరుగులకే శిఖర్ కూడా 49 వద్ద ఔటయ్యాడు. జాదవ్ 1 వద్ద కెప్టెన్ కోహ్లీ 4 వద్ద, రాహుల్ 4 పరుగుల వద్ద ధనుంజయ ఓవర్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యారు. దీంతో ఒక్కసారిగా భారత్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. 5 ఓవర్లలోను ఐదు వికెట్లను తీసిన ధనుంజయ అక్షర పటేల్‌ను ఔట్ చేయడంతో ఆరు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఎనిమిదో వికెట్ ధోనీ, భువనేశ్వర్ అండగా నిలిచి జట్టును సునాయసంగా గెలిపించారు. భువనేశ్వర్‌కుమార్ తొలిసారిగా అర్ధసెంచరీతో అజేయంగా నిలవడం విశేషం. ఇప్పటి వరకు వన్డేల్లో అత్యధికంగా 31 పరుగులను భువీ చేశాడు. ఇరుజట్ల మధ్య మూడో వన్డే ఈ నెల 27న పల్లెకలె వేదికగానే సాగనుంది.

లంకను ఆదుకున్న సిరి వర్ధనే, కపుదెగర

డిక్వెల్లా 31, గుణ తిలకే 19, కుశాల్ మెండిస్ 19, కెప్టెన్ తరంగ 9, మ్యాథ్యూస్ 20 పరుగులకే ఔట్ కావడంతో శ్రీలంక 121కే సగం వికెట్లను కోల్పోయింది.సగం వికెట్లను కోల్పోయి పీకలలోతు కష్టాల్లో కూరుకుపోయిన లంకను సిరివర్ధినే, కపుదెగర ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 91 పరుగుల చేయడంతో శ్రీలంక 200 పరుగుల మార్క్‌ను చేరుకుంది. సిరివర్ధనే 49 బంతుల్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో అర్ధ సెంచరీ చేశాడు. సిరి వర్ధనే 58 పరుగులు, కపుదెగర 40 పరుగుల వద్ద బుమ్రా వేర్వేరు ఓవర్లలో ఔట్ చేశాడు. దీంతో శ్రీలంక ఆత్మరక్షణలో పడింది.చివరి మూడు ఓవర్లలో ఆ జట్టు కేవలం 14 పరుగులనే చేయడం గమనార్హం.

సంగక్కర రికార్డును సమం చేసిన ధోనీ..

మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మరో అరుదైన రికార్డుకు చేరువయ్యాడు. పల్లెకలెలో జరుగుతున్న రెండో వన్డేలో డిక్‌వెల్లాను స్టంప్ ఔట్ చేయడంతో వన్డేల్లో ధోనీ 99 స్టంపింగ్‌లతో శ్రీలంక మాజీ వికెట్ కీపర్ కుమార సంగక్కర రికార్డును సమం చేశాడు. ఇంకో స్టంపింగ్‌ను ధోనీ చేస్తే సెంచరీకి చేరడమే కాకుండా వన్డేల్లో అత్యధిక స్టంపింగ్స్ చేసిన కీపర్‌గా రికార్డు సృష్టించనున్నాడు.



గ్లాస్గో(స్కాట్లాండ్): ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు తేజాలు పివి సింధు,కిడాంబి శ్రీకాంత్‌లు తమ జైత్రయాత్రను కొనసాగిస్తున్నారు. ప్రి క్వార్టర్స్‌లో పివి సింధు ప్రత్యర్థిపై గంటా 27 నిమిషాల పాటు సాగిన మూడు సెట్ల పోరులో అద్వితీయ విజయాన్ని సాధించింది. హాంకాంగ్ షట్లర్ చుంగ్ వై నగన్‌పై 19-21, 23-21, 21-17తో జయకేతనం ఎగురవేసింది. తొలి సెట్ విజయం అంచుల్లోకి అనుహ్యంగా ఓడిన సింధు రెండో సెట్లోను అదే పోరాట పటిమను చూపి ప్రత్యర్థి నగన్‌పై 23-21తో విజయం సాధించింది. కీలకమైన మూడో సెట్లోను ఇద్దరు ఒకానొక దశలో 17-17తో సమ ఉజ్జీలుగా నిలిచారు. ఇక్కడే చాలా చక్కంగా చుంగ్‌పై వరుసగా నాలుగు పాయింట్లతో కోర్టులో దుమ్మురేపింది. సెమీస్ బెర్త్ కోసం సింధు ఐదో సీడ్ సన్ యూతో తలపడనుంది. ఇక్కడ గురువారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో ఆండెర్స్ ఆంటోన్‌సెన్‌పై వరుస సెట్లలో 21-14, 21-18తో జయభేరి మోగించి క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. స్మాష్ షాట్లతో కోర్టులో చెలరేగిన కిడాంబి తొలి సెట్‌లో ప్రత్యర్థికి ఏ మాత్రం చిక్కకుండా ముందంజ వేసి సునాయాసంగా విజయం సాధిం చాడు. రెండో సెట్లో అండెర్స్ నుంచి ప్రతిఘటన ఎదురైనా ఏ మాత్రం వత్తిడి దరిచేరనీయ కుండా మూడు పాయింట్ల తేడాతో క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. సూపర్ సిరీస్‌లను వరుసగా సాధించిన కిడాంబికి ఇది 12వ విజయం కావడం గమనార్హం. క్వార్టర్స్‌లో ప్రపంచ నెం:1 సాన్ వాన్ హోతో తలపడనున్నాడు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా ఓపెన్‌ల్లో సాన్ వాన్‌ను ఓడించి టైటిల్ రేసులో ముందంజ వేసిన విషయం తెల్సిందే.

2018 ప్రపంచకప్ హాకీకి పాక్ అర్హత


ఇంచోయిన్: భారత్‌లోని భువనేశ్వర్ ఆతిథ్యం ఇచ్చే 2018 ప్రపంచకప్ హాకీకి పాకిస్తాన్ జట్టు గురువారం అర్హత సాధించింది. 14 ర్యాంకులో ఉన్న గ్రీన్ షర్ట్స్ బృందం లండన్‌లోని ఇటీవల జరిగిన వరల్డ్ హాకీ లీగ్ సెమీస్ టోర్నీలో ఏడో స్థానంలో నిలిచింది. ఆమ్‌స్టర్‌డమ్‌లో జరిగిన యూరోపియన్ కాంటినెంటల్ క్వాలిఫైర్స్ టోర్నీలో టాప్ ఐదులో నిలిచిన దేశాలు నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో పాక్ ఐదో స్థానంలో నిలిచింది. ఇందులో ఆడిన జర్మనీ, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, బెల్జియంలు ఇప్పటికే ప్రపంచకప్‌కు అర్హత సాధించాయి. పాకిస్తాన్ 13వ జట్టుగా ప్రపంచకప్‌కు అర్హత సాధించిన జట్టుగా నిలిచింది.

శివ, వికాస్‌లపైనే ఆశలు

నేటి నుంచి ప్రపంచ బాక్సింగ్ ఛాంప్



శివ



వికాస్

హాంబర్గ్: 19వ ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ బాక్సర్లు పంచ్‌లతో పసిడి పతకాలు సాధిస్తారన్న ధీమా వ్యక్తం అవుతోంది. ఈ నెల 25 నుంచి జర్మనీలో హాంబర్గ్ వేదికగా 10 రోజుల పాటు సాగే ఈ టోర్నీల్లో మొత్తం 85 దేశాల నుంచి 280 మంది బాక్సర్లు తలపడనున్నారు.మనదేశం నుంచి 8 మంది బాక్సర్లు బరిలో దిగుతున్నారు. ఈ సారి కూడా శివ తప, వికాస్ కృష్ణన్‌లపైన భారత్ ఆశలు పెట్టుకుంది. ప్రొ బాక్సర్ ఎదురులేని విజయాలను సాధించిన విజేందర్ సింగ్ కూడా భారత్ రెండు పతకాలను సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశాడు. దీంతో అతని అంచనాలను మన బాక్సర్లులో ఎవరు నిజం చేస్తారన్నది ఆసక్తి కరంగా మారింది. 2009, 2011, 2015ల్లో జరిగిన ప్రపంచ ఛాంప్‌ల్లో ప్రతీసారి భారత్ బాక్సర్ల కాంస్యంతో సత్తా చాటారు.

టాప్‌కు యోధ

టైటాన్స్‌కు షాక్

లక్నో: యూపి యోధ, తెలుగు టైటాన్స్ మధ్య ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో చివరి ఐదు నిమిషాల్లో యోధ విజృంభణకు టైటాన్స్‌కు షాక్ తగిలింది. చివరి మజిలీలో 23-25 పాయింట్ల తేడాతో యోధ చేతిలో టైటాన్స్ పరాజయం పాలైంది. జోన్ బిలో ఆడిన 11 మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు, ఐదు ఓటములు, రెండు మ్యాచ్‌ల డ్రా ద్వారా 30 పాయింట్లతో యోధ అగ్రస్థానానికి చేరుకుంది. ఆది నుంచి హోరాహోరీగా సాగిన పోరులో చివర్లో దూకుడైన ప్రదర్శనతో టైటాన్స్‌కు ఫినిషింగ్ టచ్ ఇచ్చింది. స్వల్పపాయింట్ల మార్జిన్‌లోను అద్భుతప్రదర్శనతో నితిన్ తోమర్ సైనం సత్తా చాటింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి ఇరుజట్లు 12-12తో సమ ఉజ్జీలుగా నిలిచాయి. చివరకంటూ ఇదే ఒరవడి సాగింది.టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరీ 23సార్లు దండయాత్రకు వెళ్లగా కేవలం నాలుగే పాయింట్లను తెచ్చాడు.యూపి కెప్టెన్ నితిన్ 14 సార్లు రైడింగ్ వెళ్లి ఆరు పాయింట్లను తేవడం విశేషం.

నేటి మ్యాచ్‌లు

రాత్రి 8 గంటలకు యు ముంబాX జైపూర్ పింక్ పాంథర్స్

రాత్రి 9 గంటలకు బెంగాల్ వారియర్స్ X పాట్నా పైరైట్స్



పండగొస్తే ఆర్టీసి ప్రత్యేక బాదుడే

- స్పెషల్ బస్సుల పేరుతో అధిక ఛార్జీలు
- ప్రయాణికులపై అదనపు భారం
- బస్టాండ్లలో కిక్కిరిసిన ప్రయాణికులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పులివెందులకు చెందిన ఆనందరావు సచివాలయంలో ఓ చిన్న స్థాయి ఉద్యోగి. వినాయక చవితి పండుగతో పాటు వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో సొంత ఊరికి వెళ్లాలని గురువారం బయలు దేరాడు. బస్టాండ్‌కొచ్చిన అతనికి బస్సులన్నీ కిటకిటలాడుతూ కనిపించాయి. అలా ముందుకు వెళ్లగానే స్పెషల్ సర్వీస్ బోర్డు కనిపించింది. తన ప్రయాణానికి మార్గం దొరికిందనుకున్నాడు. బస్సు ఎక్కిన తరువాత తెలిసింది అసలు విషయం. తన ఊరికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ సర్వీసు బస్సులో ఛార్జీ కూడా స్పెషలేనని. ఆయనకే కాదు గురువారం ఊళ్లకు వెళ్లాలనుకున్న ఎంతో మంది ప్రయాణికులకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. పండ గొచ్చిదంటే చాలు కళాశాలల్లో చదివే విద్యార్థులకు మొదలు, ప్రభుత్వ ఉద్యోగుల వరకు అందరూ సొంత ఊళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతారు. రాజధాని ప్రాంతం నుంచి సొంత ఊళ్లకు వెళ్లే వారి సంఖ్య ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రయాణికుల రద్దీని అవకాశంగా తీసుకున్న ఎపిఎస్ ఆర్టీసి పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసుల్ని ఏర్పాటు చేసింది. ప్రత్యేక బస్సుల్లో అధికంగా బస్సు ఛార్జీలు వసూలు చేయబోమని గతంలో ప్రకటించిన ఆర్టీసి అందుకు విరుద్ధంగా ఛార్జీలు నిర్ణయించి ప్రయాణికులపై అధిక భారాన్ని మోపింది. విజయవాడ నుంచి పులివెందులకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సుల్లో సాధారణ ఛార్జీ రూ.572 ఉండగా ప్రత్యేక బస్సుల్లో రూ.920 వసూలు చేస్తున్నారు. సాధారణ సర్వీసుల్లో రూ.450 ఛార్జీ ఉన్న విజయవాడ-కర్నూలు మార్గంలో రూ.800, అలాగే రూ.480 ఉన్న విజయవాడ-విశాఖపట్నం బస్సుల్లో రూ.850 వసూలు చేస్తున్నారు. రూ.610 ఛార్జీ ఉన్న విజయవాడ-అనంతపురం బస్సుల్లో రూ.920, అలాగే రూ.440 ఉన్న విజయవాడ-నంద్యాల బస్సుల్లో రూ.620 వసూలు చేస్తున్నారు. సాధారణ సమయాల్లో నడిచే బస్సుల్లో సీట్లు ఖాళీ లేకపోవడంతో ప్రయాణికులు గత్యంతరంలేని పరిస్థితుల్లో అధిక ఛార్జీని చెల్లించి స్పెషల్ సర్వీసుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. పండగలొస్తే ప్రత్యేక సర్వీసుల పేరుతో అధికంగా బస్సు ఛార్జీలు వసూలు చేయడం ఆర్టీసికి పరిపాటైపోయిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రయాణికులతో కిక్కిరిసిన విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్

ప్రయివేటు ట్రావెల్స్‌లోనూ అదే తీరు

ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌ను ప్రయివేటు ట్రావెల్స్ కూడా సొమ్ము చేసుకున్నాయి. సాధారణ సమయాల్లో ఉన్న ఛార్జీల కన్నా ఇష్టానుసారంగా ఛార్జీలు పెంచేస్తున్నారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించేందుకు వీలు లేక చాలా మంది ప్రయాణికులు అదనపు ఛార్జీల్ని భరించయినా ప్రయివేటు బస్సుల్లో ప్రయాణించాల్సి వచ్చింది.

ప్రయాణికులతో కిక్కిరికిన బస్టాండ్లు

వరుస సెలవులు కావడంతో విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌తో పాటు విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, అనంతపురం వంటి ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. సాధారణ రోజుల కన్నా రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించినట్లు ఆర్టీసి అధికారులు చెబుతున్నారు.

ఉపాధ్యాయుల 'రాష్ట్ర పురస్కారాల' ఎంపికకు కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల రాష్ట్ర పురస్కారాలకు రాష్ట్రప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు, ఈ కమిటీకి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కన్వీనర్‌గా పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సభ్యులుగా ఎస్సీఇఆర్‌టి డైరెక్టర్, రాజమండ్రి ఐఎఎస్ఇ ప్రిన్సిపాల్ ఉంటారు. జిల్లా విద్యాశాఖాధికారులు పంపిన జాబితా నుంచి పురస్కార గ్రహీతల్ని ఎంపిక చేస్తారు. 2017 సంవత్సరానికి గాను ఈ అవార్డుల్ని అందజేయనున్నారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- ఒకటో తేదీన మిలియన్ మార్చ్
- ఎపి ఎన్జీవో జెఎసి చైర్మన్ అశోక్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంటిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సిపిఎస్) రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో వివిధ శాఖల ఉద్యోగులతో మిలియన్ మార్చ్ నిర్వహించనున్నట్లు ఎపి ఎన్జీవో జెఎసి చైర్మన్ అశోక్‌బాబు తెలిపారు. విజయవాడ ఎన్జీవో భవన్‌లో గురువారం ఆయన మిలియన్ మార్చ్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాలేవైనా ఉద్యోగ వ్యతిరేక విధానాలనే అవలంబిస్తున్నాయని, ఉద్యోగ వర్గాలకు నష్టం కలిగించే చర్యలనే చేపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 1992 తరువాత కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పర్మినెంట్ విత్ పెన్షన్, పర్మినెంట్ వితవుట్ పెన్షన్ అనే నాలుగు విభాగాల్లో ఉద్యోగులున్నారని తెలిపారు. 2004 తరువాత విధుల్లోకి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సుమారు 1.80 లక్షల సిపిఎస్ ఉద్యోగులకు చెందిన లక్ష కోట్ల రూపాయలు మార్కెట్లో ఉందని, దాంట్లో వచ్చే లాభ నష్టాల ఆధారంగా ఉద్యోగులకు పెన్షన్ ఇస్తామనడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దుకు అందరినీ కలుపుకొని దేశ వ్యాప్తంగా ఒక ఉద్యమం చేపట్టడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఎలో భాగస్వామి కాబట్టి, రాష్ట్రంలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68